# మన నేషనలిస్ట్ వాయిస్
తెలుగు దిన పత్రిక

RNI : TGTEL/25/A4284

www.manananationalistvoice.com    epaper.manananationalistvoice.com



రిపోర్టర్లు కావలెను
మన నేషనలిస్ట్ వాయిస్ తెలుగు దిన పత్రిక
తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.
తెలుగు రాష్ట్రాలలో సంచనాలు సృష్టిస్తున్న నేషనలిస్ట్ వాయిస్ మీకు సరైన వేదిక.. అన్ని జిల్లాల, మండలాల మరియు నియోజకవర్గాల పరిధిలో పనిచేసేందుకు అవకాశం కల్పింస్తోంది.
రిపోర్టర్లు కావాలి.
ఇంకెందుకు ఆలస్యం...
9666023180.8096660656 నంబర్లకు
వాట్సాప్‌లో మీ బయోడేటాను పంపండి.



ప్రచురణ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | సంపుటి : 01 | సంచిక : 200 | 26 ఆదివారం, జూలై 2026 | పేజీలు :12 | వెల: రూ. 3/-

హైదరాబాద్, నిజామాబాద్, వరంగల్, కరీంనగర్, రంగారెడ్డి, ఆదిలాబాద్, మెదక్, నల్గొండ, మహబూబ్ నగర్, ఖమ్మం, విజయవాడ, గుంటూరు, అమరావతి, క్రిష్ణ, గోదావరి, కర్నూలు, చిత్తూరు, కడప, ప్రకాశం, శ్రీకాకుళం


## నా దీక్షనే అనుమానిస్తారా...?

### కేంద్రంతో లాలూచీ పడతాననుకున్నారా

### విమర్శలపై సోనమ్ వాంగ్‌చుక్ ఘాటు స్పందన

**న్యూఢిల్లీ,జూలై25నేషనలిస్ట్ వాయిస్**



దాదాపు 26 రోజుల పాటు నిరాహార దీక్ష చేసిన సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ఇటీవల కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ సమక్షంలో దీక్షను విరమించారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్ నెరవేరకపోయినా తాను ఎందుకు నిరాహార దీక్ష విరమించాల్సి వచ్చిందో తాజాగా సోనమ్ వివరించారు. ప్రభుత్వంతో ఎలాంటి రహస్య ఒప్పందమూ చేసుకోలేదని, నిరసనకారుల భద్రత కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

వివరాలు 2లో

## ధర్మేంద్ర ప్రధాన్ శాఖ మారొచ్చు కేంద్రం పరిశీలిస్తోందన్న రాహుల్

**న్యూఢిల్లీ,జూలై25నేషనలిస్ట్ వాయిస్**



విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను మరో శాఖకు మార్చే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందన్న వార్తలు ఉన్నాయని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అన్నారు. కేంద్రం ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించబోదన్న వార్తల నడుమ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా సహా మూడు డిమాండ్స్‌ను విద్యార్థులు ప్రభుత్వం ముందు పెట్టారని అన్నారు. వీటి విషయంలో వారు రాజీపడబోరని అభిప్రాయపడ్డారు. 'అసమర్థ, అవినీతి మరక అంటిన ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్నది మొదటి డిమాండ్.

వివరాలు 2లో

## నేటితరం యువత ఆలోచనాపరులు

### వారిని అర్థం చేసుకుని ప్రేమగా చర్చించాలి

### ఆదేశాలతో కాదు..అర్థవంతమైన చర్చలతో సాగాలి

### ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ సంచలన వ్యాఖ్యలు



వివరాలు 2లో

**న్యూఢిల్లీ,జూలై25నేషనలిస్ట్ వాయిస్**

నేటితరం యువత ఆలోచనాపరులని, వారిని అర్థం చేసుకుని ముందుకు సాగాల్సి ఉందని ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ నేటి యువతపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఇప్పటి తరం మార్గదర్శకత్వం లేనిదో లేదా దారి తప్పినదో కాదని స్పష్టం చేశారు. వారిని అర్థం చేసుకోవడానికి ఆదేశాలు ఇవ్వడం కాకుండా అర్థవంతమైన చర్చలు జరపాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు.

# కేంద్రమంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

### కాక్రోచ్ ఉద్యమాన్ని హైజాక్ చేసే యత్నాలు ?

### నీట్ ఆందోళనతో దిగివచ్చిన ప్రధాన్

### దేశ వ్యతిరేక శక్తులకు అవకాశం ఇవ్వరాదనే నిర్ణయం

**న్యూఢిల్లీ,జూలై25నేషనలిస్ట్ వాయిస్**

నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. శనివారం ఆయన తన రాజీనామా లేఖను ప్రధాని నరేంద్రమోడీకి పంపారు. యువత, కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) నిరసనలకు కేంద్ర మంత్రి దిగొచ్చారు. ఈ విషయాన్ని ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. తన రాజీనామా లేఖలో ఆయన మాట్లాడుతూ.. గత నాలు దశాబ్దాలుగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యా సంస్కరణలోకి పనిచేస్తున్నామని తెలిపారు. దేశ యువత ఆకాంక్షలను నెరవేర్చడంతో తన నైతిక బాధ్యతగా భావించినట్లు లేఖలో పేర్కొన్నారు.

వివరాలు 2లో



## నీట్ రద్దుతో విద్యార్థుల్లో పెరిగిన పట్టుదల

### మరింత మెరుగైన ప్రతిభ కోసం కష్టపడ్డారు

### ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వ్యాఖ్య

**న్యూఢిల్లీ,జూలై25నేషనలిస్ట్ వాయిస్**



దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న పరీక్షల పేపర్ లీకేజీల వివాదంపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతా రామన్ భిన్నంగా స్పందించారు. పేపర్ లీక్‌లు జరిగినప్పుడు మొదట్లో విద్యార్థులు తీవ్రంగా బాధపడినప్పటికీ, ఆ తర్వాత ఆ సవాలును స్వీకరించి మరింత బాగా చదివి ప్రతిభను మెరుగు పరుచుకున్నారని ఆమె తెలిపారు. ముందు బాధనిపించింది.. తర్వాత దాన్నే అవకాశంగా మలచుకుని మెరుగ్గా రాశామని పలువురు విద్యార్థులు చెబుతున్నారని ఆమె పేర్కొన్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న విద్యార్థుల ఆందోళనలపై ఓ వార్తా సంస్థకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడారు.

వివరాలు 2లో



## మోదీ మొండి వైఖరికి దక్కిన ఓటమి

### కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

**న్యూఢిల్లీ,జులై 25 నేషనలిస్ట్ వాయిస్**

ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. దీనిపై తాజాగా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పందించారు. దేశంలోని విద్యార్థుల గొంతుక ఎట్టకేలకు అహంకారపూరిత ప్రభుత్వ గడపను తాకిందని ఖర్గే వ్యాఖ్యానించారు. విద్యావ్యవస్థ ప్రక్షాళనను కోరుతూ దేశవ్యాప్తంగా వీధుల్లోకి వచ్చి గళమెత్తిన లక్షలాది మంది యువత సాధించిన విజయమిదని ఆయన 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. ఇది సత్యానికి లభించిన విజయమని, ప్రధాని మోదీ మొండి వైఖరికి దక్కిన ఓటమి అని వ్యాఖ్యానించారు. అవినీతిమయమైన ఈ ప్రభుత్వం కారణంగా నష్టపోయిన కుటుంబాలు అన్నింటిదీ ఈ విజయమని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రయోజనాల పరిరక్షణ కోసం పార్లమెంటు నుంచి వీధుల వరకు ఏకతాటిపై నిలిచి పోరాడిన ప్రతిపక్షాల ఐక్యతే ఈ విజయానికి కారణమని ఆయన స్పష్టంచేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ యువతరానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నిరసనలు తెలుపుతున్న విద్యార్థులపై లాఠీచార్జి చేసి, దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై నటి ప్రియాంక చోప్రా సామాజిక మాధ్యమాల వేదికగా స్పందించారు.

## ధర్మేంద్ర రాజీనామాతో జంతర్‌మంతర్ వద్ద ఉద్రిక్తత

### మరోమారు రెచ్చిపోయి పోలీసులపై రాళ్ల దాడి

### ఇద్దరు పోలీసులకు తీవ్ర గాయాలు

### సంబరాల్లో మునిగిపోయిన విద్యార్థులు

**న్యూఢిల్లీ,జులై 25 నేషనలిస్ట్ వాయిస్**




కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ప్రకటించిన వెంటనే ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. నిరసనకారులు పోలీసుల పై రాళ్ల దాడికి దిగారు. నిరసనకారుల రాళ్ల దాడిలో ఇద్దరు పోలీసులు గాయపడ్డారు. వారి తలలకు తీవ్ర గాయాలు అయ్యాయి.

వివరాలు 2లో

## ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు విబి-జి రామ్ జి ద్వారా కరువు ఉపశమన చర్యలు వేగవంతం చేయాలి

### రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కఅన్నారు.

**నేషనలిస్ట్ వాయిస్ యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో జూలై 25**



ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే కరువు పరిస్థితులను సమర్థ వంతంగా ఎదుర్కొనేందుకు విబి-జి రాంజీ.పథకం ద్వారా కరువు ఉపశమన చర్యలు, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పన,నీటి సంరక్షణ పనులను విస్తృతంగా చేపట్టాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. శనివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు),జెడ్పీ సీఈఓలు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు, జిల్లా పంచాయతీ అధికారులు, పంచాయతీ రాజ్,గ్రామీణ నీటి సరఫరా శాఖల ఇంజినీర్లు, ఎంపీడీఓలతో మంత్రి సమీక్ష నిర్వహించారు.

వివరాలు 2లో



## చట్టసభల వయోపరిమితి 21 ఏళ్లకు తగ్గించాలి

### అప్పడే యువతకు రాజకీయ అవకాశాలు వస్తాయి

### తెలంగాణ అసెంబ్లీలో ఈ మేరకు తీర్మానం చేస్తాం

### కాంగ్రెస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న సిఎం రేవంత్

**హైదరాబాద్,జూలై25 నేషనలిస్ట్ వాయిస్**

చట్టసభలకు పోటీ చేసే వయసును 21 ఏళ్లకు తగ్గించాలని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపు తామన్నారు. యువత రాజకీయాల్లోకి రావాలని, అప్పుడే నీతి మంతమైన రాజకీయాలు సాగుతాయని అన్నారు.

వివరాలు 2లో

## రియల్ ఎస్టేట్ రంగంపై గోబెల్స్ ప్రచారం నమ్మొద్దు

### రెండున్నర ఏళ్లలో దాదాపు 40 శాతం రియల్ వృద్ధి

### త్వరలో మూసీ సుందరీకరణకు టెండర్లు

### రియల్ ఎస్టేట్‌తో పాటు పేదల ఇళ్ల నిర్మాణానికి ప్రాధాన్యత

### రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ , సమాచార శాఖ మంత్రి పొంగులేటి

**హైదరాబాద్,జులై 25 నేషనలిస్ట్ వాయిస్**



రాష్ట్రంలో ముఖ్యంగా హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందని కొంతమంది ఉద్దేశపూర్వకంగా గోబెల్స్ ప్రచారం సాగిస్తున్నారని దీనిలో ఏమాత్రం నిజం లేదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ , సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంలో స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ శాఖ మంత్రిగా స్పష్టమైన ఆధారాలు, వివరాలు ఉన్నాయని అందువలన అటువంటి ప్రచారాలను నమ్మాల్సిన అవసరం లేదని అన్నారు. శనివారం నాడు నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ గత రెండున్నర సంవత్సరాల ప్రజా ప్రభుత్వ పాలనలో సుమారు 15 నుంచి 20 శాతం రియల్ ఎస్టేట్ అభివృద్ధి జరిగిందని , 40 శాతం వరకు విక్రయాలు వృద్ధిచెందాయని అన్నారు.

వివరాలు 2లో

# ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు విబి-జి రామ్ జి ద్వారా కరువు ఉపశమన చర్యలు వేగవంతం చేయాలి

మొదటిపేజీ తరువాయి



ఈ సందర్భంగా తెలంగాణ జలసిరి వి బి.జి రామ్ జి, గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక అమలు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో గ్రామీణ పేద కుటుంబాలకు ఉపాధి హామీ పనులను విస్తృతంగా కల్పించాలని మంత్రి సూచించారు. తెలంగాణ జలసిరి కార్యక్రమం ద్వారా నీటి సంరక్షణ,నీటి భద్రత, భూగర్భ జలాల పెంపు, కరువు ప్రభావాన్ని తగ్గించే పనులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.202627 ఆర్థిక సంవత్సరంలో మార్చి 31, 2027 నాటికి 12 కోట్ల వ్యక్తి పనిదినాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని, ప్రస్తుతం నిర్దేశించిన 4.5 కోట్ల పనిదినాల లక్ష్యాన్ని ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మరింత పెంచేలా చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు.గ్రామీణ కుటుంబాలకు తక్షణ ఉపాధి కల్పించే ఉద్దేశంతో ప్రతి గ్రామపంచాయతీలో రోజుకు కనీసం 60 మంది కూలీలకు తగ్గకుండా ఉపాధి అవకాశాలు కల్పించేలా కూలీల సమీకరణ చేపట్టాలని తెలిపారు.ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా రోజుకు సుమారు 2.26 లక్షల మంది కూలీలకు ఉపాధి కల్పిస్తున్న నేపథ్యంలో, జూలై నుంచి అక్టోబర్ వరకు ప్రతిరోజూ కనీసం 5 లక్షల మందికి ఉపాధి కల్పించేలా అధికారులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు.అర్హులైన ప్రతి గ్రామీణ కుటుంబానికి ఉపాధి కల్పించడంతో పాటు నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచే పనులు,చెరువుల అభివృద్ధి,వర్షపు నీటి సంరక్షణ,కరువు నిరోధక పనులు,గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేయాలని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం స్థానిక సంస్థ ల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఎంపీడీఓలు,ఎంపీఓలు, ఏపీఓలు,పంచాయతీరాజ్ ఏఈలు,గ్రామీణ నీటి సరఫరా శాఖ ఏఈలు సమన్వయంతో టీమ్‌గా పనిచేయాలని ఆదేశించారు.గ్రామస్థాయిలో ఉపాధి హామీ పనులు,నీటి సంరక్షణ కార్యక్రమాలు,కరువు ఉపశమన చర్యలను వేగవంతం చేసి ప్రజలకు గరిష్ట ప్రయోజనం చేకూరేలా కృషి చేయాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ శోభారాణి,జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి టి.నాగిరెడ్డి,జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్,అదనపు డీఆర్‌డీఓ శ్రీ సురేష్, డిప్యూటీ సీఈఓ శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఇంజనీర్ శ్రీ రాకేష్,ఎంపీడీఓలు, ఎంపీఓలు,వి బి జి రామ్ జి సిబ్బంది సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

# ధర్మేంద్ర ప్రధాన్ శాఖ మారొచ్చు

అయితే, ఆయన శాఖ మార్చే అంశం ప్రధాని కేబినెట్‌లో చర్చకు వచ్చినట్టు టాక్ వినిపిస్తోంది. భారతీయ విద్యార్థులు దీన్ని అస్సలు ఆమోదించరు. దీన్ని ఎవ్వరూ ఒకప్పుకోరు' అని రాహుల్ గాంధీ చెప్పారు. ధ్వంసమైన విద్యార్థుల భవిష్యత్తు, అవినీతికి ఆయన సంకేతంగా నిలిచారని వ్యాఖ్యానించారు. ఆయనను తొలగించాల్సిందేనని స్పష్టం చేశారు. సోమవారం నాటి విద్యార్థుల ర్యాలీలో పోలీసులు పె÷-లలెట్ గన్స్, లాఠీ చార్జ్‌కు దిగడాన్ని కూడా రాహుల్ గాంధీ ఖండించారు. ఈ చర్యలకు దిగిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. భారత దేశ విద్యార్థులకు ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాలని మరోసారి డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ ఒక గతమని, భవిష్యత్తు కోసం ఆయన పోరాడజాలరని వ్యాఖ్యానించారు.

మొదటిపేజీ తరువాయి

# నేటితరం యువత ఆలోచనాపరులు

వారిని అర్థం చేసుకోవడానికి ఆదేశాలు ఇవ్వడం కాకుండా అర్థవంతమైన చర్చలు జరపాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో ఢిల్లీ వీధుల్లో విద్యార్థుల నిరసనలతో వాతావరణం అత్యంత వేడెక్కిన తరుణంలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. 'విశ్వ మాంగల్య సభ' కార్యక్రమంలో మాట్లాడిన మోహన్ భగవత్ తరాల మధ్య పెరుగుతున్న వ్యత్యాసాన్ని ప్రస్తావించారు. 'మేము యువకులుగా ఉన్నప్పుడు విధేయత చూపించే వాళ్లం. కానీ ఇప్పుడు పరిస్థితులు అలా లేవు. నేటి తరం ప్రశ్నించే తత్వాన్ని కలిగి ఉంది. కాబట్టి మనం వారికి ప్రతి విషయాన్ని కారణాలతో సహా వివరించాల్సి ఉంటుంది. వారిపై ఎనలేని ప్రేమను చూపిస్తూ, వారితో సమయం గడపాలి. కుటుంబాల్లో సంభాషణలు తగ్గిపోతుండటం ఆందోళనకరం. యువత నమ్మకాన్ని గెలవాలంటే హుకుం జారీ చేయడం కాదు, వారితో మాట్లాడాలి. వారికి ఓ ఆత్మీయ భావన కలిగించాలి. ఆదేశాలు జారీ చేయడం కాకుండా చర్చలు జరిపి, ఒక ఏకాభిప్రాయానికి రావడం ముఖ్యం అని భగవత్ పిలుపునిచ్చారు. జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న ఆందోళనల గురించి భగవత్ ప్రత్యక్షంగా ఎలాంటి ప్రస్తావన చేయకపోయినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇతర రాష్ట్రాలకు కూడా పాకిన ఈ సీజేపీ నిరసనలపై ఆయన ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. ముఖ్యంగా జూలై 20న పార్లమెంట్ సమీపంలో నిరసనకారులకు, పోలీసులకు మధ్య జరిగిన తీవ్ర ఘర్షణలు ప్రజా ఆగ్రహాన్ని మరింత పెంచాయి

మొదటిపేజీ తరువాయి

# చట్టసభల వయోపరిమితి 21 ఏళ్లకు తగ్గించాలి

దేశంలో అధికారంలో వారు భాగస్వాములు కావాల్సి ఉందన్నారు. నీట్ పశ్నపత్రాల లీకేజీకి వ్యతిరేకంగా దిల్లీలో ఆందోళన చేపట్టిన విద్యార్థులపై జరిగిన దాడిని నిరసిస్తూ హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ నేతృత్వంలో పీపుల్స్ ప్లాజా నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కొన్ని దేశాల్లో అమల్లో ఉన్న విధంగా భారత్‌లోనూ 21 ఏళ్లకే ఎంపీలు, ఎమ్మెల్యేలుగా పోటీ చేసే అవకాశం రావాలన్నారు. రాహుల్ ప్రధాని అయితే.. చట్ట సభలకు పోటీ చేసే వయసు 21 ఏళ్లకు తగ్గుతుందన్నారు.

## విద్యార్థుల పోరాటానికి లభించిన విజయమే కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా: పెద్ది సుదర్శన్ రెడ్డి

### నీట్ విద్యార్థుల ఉద్యమానికి తొలి నుంచి బీఆర్ఎస్ అండ విద్యార్థుల ఐక్యత ముందు అధికార అహంకారం తలవంచిందని వ్యాఖ్య

వరంగల్ జిల్లా, జూలై 25, నేషనలిస్ట్ వాయిస్



కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశవ్యాప్తంగా విద్యార్థులు సాగించిన నిరంతర ప్రజాస్వామ్య పోరాటానికి లభించిన విజయమని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు.శనివారం ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల ఐక్యత, ఉద్యమ స్ఫూర్తి ముందు అధికార అహంకారం తలవంచక తప్పలేదన్నారు. వీధుల నుంచి దేశ రాజధాని ఢిల్లీ వరకు విద్యార్థులు శాంతియుతంగా సాగించిన ఉద్యమం ఫలితమే ఈ పరిణామమని పేర్కొన్నారు. విద్యార్థుల హక్కుల కోసం, భవిష్యత్తు కోసం పోరాడిన ప్రతి విద్యార్థికి, యువతకు, ఉద్యమకారులకు అభినందనలు తెలిపారు.నీట్ పరీక్షల నిర్వహణలో చోటుచేసుకున్న అవకతవకలు, పేపర్ లీక్ ఘటనలపై బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని విద్యార్థులు దేశవ్యాప్తంగా డిమాండ్ చేసినప్పుడు, ఆ ఉద్యమానికి బీఆర్ఎస్ పార్టీ పూర్తి మద్దతు ప్రకటించిందన్నారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లకు అండగా నిలుస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి. రామారావు (కేటీఆర్) ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద యువత చేపట్టిన ఆందోళనకు సంఘీభావం తెలిపి, వారికి ధైర్యం నింపారని గుర్తు చేశారు.నీట్ విద్యార్థుల ఉద్యమానికి తొలి రోజు నుంచే బీఆర్ఎస్ పార్టీ అండగా నిలిచిందని, నిన్న నిర్వహించిన ధర్నా కార్యక్రమానికీ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించిందన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని, విద్యా వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం నెలకొల్పేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో విద్యార్థులు సాగించిన ఉద్యమం దేశానికి ఆదర్శంగా నిలిచిందని, యువత ఐక్యతతో సాధించిన ఈ విజయం ప్రజాస్వామ్య విలువలకు నిదర్శనమని పెద్ది సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు.

మొదటిపేజీ తరువాయి

# కేంద్రమంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

పరీక్షను రద్దు చేసి, మళ్లీ నిర్వహించడంతో పాటు వచ్చే ఏడాది నుంచి కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానంలో నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. 20 లక్షల మందికి పైగా విద్యార్థుల కోసం తిరిగి పరీక్ష విజయవంతంగా నిర్వహించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో జూన్ 21నపరీక్ష విజయవంతంగా పూర్తయిందని అన్నారు. తాను మొదటి రోజు నుంచే బాధ్యత తీసుకున్నాని, ఎగ్జామ్ మాఫియా వల్ల ప్రతిభావంతులైన విద్యార్థులు నష్టపోకుండా కృషి చేశానని పేర్కొన్నారు. జూలై 16న ప్రకటించిన ఫలితాల్లో పేద, వెనకబడిన వర్గాలకు చెందిన అనేక మంది విద్యార్థులు విజయాన్ని సాధించడం సంతోషకరమని అన్నారు. ఇదే సమయంలో బాధ్యతయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తులు విద్యార్థుల్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం తనను బాధించిందని చెప్పారు. గత 10 రోజులుగా జరిగిన పరిణామాలు కలిచివేశాయని, ఇది నా వ్యక్తిగత ప్రతిష్టకు సంబంధించిన విషయం కాదని స్పష్టం చేసింది. జంతర్ మంతర్‌తో పాటు దేశవ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని, దేశవ్యతిరేక శక్తులు దీనిని ఉపయోగించుకోకుండా ఉండేందుకు, జాతీయ ఐక్యత కాపాడేందుకు, విద్యార్థుల భవిష్యత్తు న్యాయపరమైన చిక్కుల్లో పడకుండా ఉండేందుకు, వారు చదువులపై దృష్టి సారించేలా చేయడానే ఉద్దేశంతోనే ప్రధాన మంత్రికి రాజీనామా లేఖ సమర్పించినట్లు వెల్లడించారు. తనపై నమ్మకం ఉంచిన ప్రధాని మోడీకి, కేంద్ర మంత్రివర్గ సహచరులకు, విద్యాశాఖ అధికారులకు థాంక్స్ చెప్పారు. దేశ సేవే తన జీవిత లక్ష్యమని, భవిష్యత్తులోనూ ఒడిశా ప్రజలు, దేశ యువత కోసం సేవ చేస్తూనే ఉంటానని పేర్కొన్నారు.

మొదటిపేజీ తరువాయి

# రియల్ ఎస్టేట్ రంగంపై గోబెల్స్ ప్రచారం నమ్మొద్దు

రియల్ ఎస్టేట్ పడిపోయిందని కొంతమంది పనిగట్టుకొని ఈ ప్రభుత్వంపై బురద చల్లేందుకు ఈ గోబెల్స్ ప్రచారం సాగిస్తున్నారని వాటిని పట్టించుకోవద్దని మంత్రి అన్నారు. 2004 నుంచి 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో నాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రుల చొరవ కారణంగానే హైదరాబాద్ ఒక రోల్ మోడల్‌గా రూపొందిందని, వారి దూరదృష్టి వల్లే ఓఆర్ఆర్, అంతర్జాతీయ విమానాశ్రయం, ఐటి సెక్టార్ తదితరాలు 360 డిగ్రీల కోణంలో అభివృద్ధి చెందాయని వివరించారు. అందువల్లే హైదరాబాద్ ఇప్పుడు దేశంలోనే గాక ప్రపంచంలోనే అందరి దృష్టిని ఆకర్షిస్తోందని, ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారితో కలసి దావోస్ వెళ్లినపుడు అక్కడ కూడా అధికశాతం పారిశ్రామిక వేత్తలు హైదరాబాద్ లో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నారన్నారు. హైదరాబాద్ నగరం పెట్టుబడులకు గమ్యస్థానం అవుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి దూరదృష్టితో ప్రణాళికా బద్ధంగా హైదరాబాద్ నగరాభివృద్ధికి చర్యలు చేపట్టారు. 7వేల కోట్లతో చేపడుతున్న మూసీ ప్రాజెక్ట్ సుందరీకరణ పట్టాలెక్కనుందని మంత్రి పొంగులేటి తెలిపారు.

## హెున్నాజిపేట గ్రామపంచాయతీ లో నర్సరీ మొక్కల తనిఖీ చేసిన యం పి డి ఓ బి మారుతి

ధర్పల్లి:నేషనలిస్ట్ వాయిస్

ధర్పల్లి మండలం హెున్నాజిపేట గ్రామ పంచాయతీ ని ఈరోజు లియం పి డి ఓ బి. మారుతి సందర్శించారు.ఈ సందర్భంగా గ్రామంలోని నర్సరీలో మొక్కల పెంపకం కొరకు మొక్కల తరలించడం ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత పంచాయతీ కార్యదర్శులు గంగాధర్, ఇలియాస్, ఫీల్డ్ అసిస్టెంట్ గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. నర్సరీలో నాణ్యమైన మొక్కలను సిద్ధం చేసి, నిర్ణీత సమయంలో ప్లాంటేషన్ పూర్తి చేయాలని యం పి డి ఓ బి మారుతి అధికారులకు సూచించారు



మొదటిపేజీ తరువాయి

# నీట్ రద్దుతో విద్యార్థుల్లో పెరిగిన పట్టుదల

పరీక్షల పవిత్రతను దెబ్బతీసిన వారిపై సత్వర చర్యలు తీసుకోవడానికి ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా స్పందించారని మంత్రి చెప్పారు. నిందితుల అరెస్టులు, సకాలంలో మళ్లీ పరీక్షలు నిర్వహించడం, ఫలితాలను విడుదల చేయడం ద్వారా విద్యార్థులు తమ ఉన్నత విద్య వైపు అడుగులు వేయగలుగుతున్నారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ఈ సున్నితమైన అంశంపై ప్రభుత్వం తక్షణమే స్పందించి చర్యలు తీసుకుంటోంది. ప్రభుత్వ చర్యల వల్ల ప్రతిపక్షాల విమర్శలకు విలువే లేకుండా పోయింది. ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటు, పేపర్లను అమ్మిన, కొనుగోలు చేసిన నేరస్తుల అరెస్టులు శరవేగంగా జరుగుతున్నాయి' అని ఆమె స్పష్టం చేశారు. నీట్ పేపర్ లీకేజీ నేపథ్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని పూర్తిగా ప్రక్షాళన చేస్తున్నామని, ఇందులో భాగంగా ఇప్పటికే ఎన్టీఏకు చెందిన 47 మంది ఉద్యోగులను ప్రభుత్వం తొలగించిందని ఆమె పేర్కొన్నారు.

మొదటిపేజీ తరువాయి

# నా దీక్షనే అనుమానిస్తారా...?

ఢిల్లీలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు, యువతపై హింసాత్మక చర్యలు జరిగే అవకాశం ఉందన్న ఆందోళన తనకు కలిగిందని వాంగ్‌చుక్ పేర్కొన్నారు. గతంలో లడఖ్‌లో జరిగిన పోలీసు చర్యల మాదిరిగా పరిస్థితి మారకూడదనే ఉద్దేశంతో ఉపవాసాన్ని ముగించాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. అలాగే, కేంద్ర ప్రభుత్వం నుంచి కొన్ని అంశాలపై లిఖితపూర్వక హామీ లభించిందని ఆయన తెలిపారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసిన వారిపై ప్రతీకార చర్యలు ఉండవని, వారి సమస్యలపై చర్చ కొనసాగుతుందని ప్రభుత్వం హామీ ఇచ్చిందని వాంగ్‌చుక్ పేర్కొన్నారు అయితే, దీక్ష విరమించడం అంటే ఉద్యమం ముగిసినట్లు కాదని స్పష్టం చేశారు. కాగా, జంతర్ మంతర్‌లో నిరసన చేపడుతున్న సీజేపీ నేతలు మాత్రం తమ ఆందోళన కొనసాగుతుందని ప్రకటించారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు ఉద్యమం ఆగదని వారు వెల్లడించారు. పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ 26 రోజులు చేసిన నిరాహార దీక్షను కేంద్రమంత్రుల సమక్షంలో విరమించిన నేపథ్యంలో.. డీల్ కుదిరిందంటూ ఆయనపై పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. వీటిని ఆయన తీవ్రంగా ఖండించారు. 'నేను చేసిన దీక్ష ఎంత స్వచ్ఛమైందో నిరూపించుకునేందుకు సర్టిఫికెట్ కావాలా.. అని ప్రశ్నించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో వీడియో విడుదల చేశారు. అలాగే విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకుండానే దీక్ష విరమించడంపైనా స్పందించారు. దీక్ష విరమించినప్పటి నుంచి చాలా మంది నాకు ఫోన్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో పోస్టులు చూపిస్తూ.. మీపై పలు సందేహాలు వస్తున్నాయని చెప్తున్నారు. కేంద్రమంత్రుల సమక్షంలోనే ఎందుకు దీక్ష విరమించారు..? ఏం ఒప్పందం జరిగింది..? అని అడుగుతున్నారు.

మొదటిపేజీ తరువాయి

# ధర్మేంద్ర రాజీనామాతో జంతర్‌మంతర్ వద్ద ఉద్రిక్తత

గాయపడ్డ పోలీసులను వెంటనే ఆస్పత్రికి తరలించారు. పరిస్థితిని అదుపు చేసేందుకు పోలీసులు భాష్పవాయు గోళాలు ప్రయోగించారు. నిరసనకారులపై లాఠీఛార్జ్ చేశారు. ఈ నేపథ్యంలోనే జంతర్ మంతర్ వద్ద అదనపు బలగాలు మోహరించాయి. ప్రస్తుతం అక్కడి పరిస్థితి అదుపులోనే ఉన్నట్లు సమాచారం. మరోవైపు విద్యార్థులు సంబరాల్లో మునిగిపోయారు. అభిజిత్‌ను అభినందిస్తూ భుజాలపైకి ఎత్తుకున్నారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే హర్షం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యం, విద్యార్థులు సాధించిన విజయంగా పేర్కొన్నారు. నీట్ పేపర్ లీక్ వివాదంపై కొన్ని వారాలుగా కొనసాగిన నిరసనల ఫలితంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకునేలా విద్యార్థులు ఒత్తిడి తెచ్చారని అన్నారు. ప్రజాస్వామ్య విలువలకు, దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థుల సామూహిక సంకల్పానికి లభించిన విజయమని ఆయన అభివర్ణించారు. కాగా, నిరంతర శాంతియుత నిరసనలు మార్పును తీసుకురాగలవని చెప్పడానికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ఒక నిదర్శనమని అభిజీత్ దిప్కే తెలిపారు. 'ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. మీరు భయపడకపోతే, ఈ ప్రభుత్వానికి తలొగ్గకపోతే, మనం ఎవరితోనైనా రాజీనామా చేయించగలమని చెప్పడానికి ఇది నిదర్శనం' అని అన్నారు. అలాగే నీట్ పేపర్ లీక్ వివాదం తర్వాత ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల పేర్లను దీప్కే గుర్తు చేసుకున్నారు. వారి స్మృతి కోసం రెండు నిమిషాల పాటు మౌనం పాటించాలని నిరసనకారులను కోరారు. అనంతరం ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై నిరసన ప్రాంగణంలో విద్యార్థుల సంబరాలు హోరెత్తాయి.

# గంట వ్యవధిలో ఇద్దరు అన్నదమ్ముల మృతి...

## సర్వాపురంలో విషాదఛాయలు..

## తుది ప్రయాణంలోనూ విడవని అనుబంధం...

వరంగల్ జిల్లా, జూలై 25, నేషనలిస్ట్ వాయిస్.





నర్సంపేట నియోజకవర్గంలోని సర్వాపురం గ్రామంలో శనివారం హృదయవిదారక ఘటన చోటుచేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన సొంత అన్నదమ్ములు కందికొండ కొమురయ్య మరియు కందికొండ నర్సయ్య గంట వ్యవధిలోనే మృతి చెందడంతో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం, ముందుగా అన్న కందికొండ కొమురయ్య మృతి చెందగా, ఆ విషాదాన్ని తట్టుకోలేకపోయిన తమ్ముడు కందికొండ నర్సయ్య కూడా గంట వ్యవధిలోనే కన్నుమూశారు. ఒకే రోజు, కేవలం గంట వ్యవధిలో ఇద్దరు అన్నదమ్ములు మృతి చెందడం కుటుంబ సభ్యులను, బంధుమిత్రులను, గ్రామస్థులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది.జీవితాంతం పరస్పరం అన్యోన్యంగా గడిపిన ఈ అన్నదమ్ములు చివరి ప్రయాణంలోనూ విడిపోకపోవడం స్థానికులను కంటతడి పెట్టించింది. వారి నివాసానికి ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, బంధువులు, స్నేహితులు పెద్ద సంఖ్యలో చేరుకుని నివాళులర్పించారు.ఈ విషాద ఘటనతో సర్వాపురం గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. కందికొండ కొమురయ్య, కందికొండ నర్సయ్య పవిత్ర ఆత్మలకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ తీరని దుఃఖాన్ని భరించే మనోధైర్యాన్ని ప్రసాదించాలని గ్రామస్థులు, పలువురు ప్రముఖులు ప్రార్థించారు.

# కట్ల సంతోష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రాందాస్ నాయక్ జన్మదిన వేడుకలు

### 3 వేల మందికి అన్నదానం

### ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షలు

**( నేషనలిస్ట్ వాయిస్) జులై 26 ఖమ్మం జిల్లా బ్యూరో**

వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ జన్మదిన వేడుకలు శనివారం వైరా పట్టణంలో అపూర్వ ఉత్సాహం మధ్య ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో వేలాది మంది కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎమ్మెల్యేకు జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు. ఉదయం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకున్న రాందాస్ నాయక్‌కు కట్ల సంతోష్, చెరుకూరి కిరణ్ భారీ గజమాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్థానిక రింగ్ రోడ్డు నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యకర్తలు జైజైధ్వానాలు చేస్తూ, టపాసులు పేలుస్తూ, పూలవర్షం కురిపిస్తూ ఎమ్మెల్యేను ఊరేగింపుగా తీసుకెళ్లారు. జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ఎమ్మెల్యేతో కేక్ కట్ చేయించి సంబరాలు జరిపారు. జన్మదిన వేడుకల్లో భాగంగా మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ అన్నదాన కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రాందాస్ నాయక్, సుడా చైర్మన్ పువ్వాల దుర్గాప్రసాద్, మార్క్ ఫైడ్ వైస్ చైర్మన్ బోర్రా రాజశేఖర్, పీసీసీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు , మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ, మాజీ మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ తో కలిసి ప్రారంభించారు. సుమారు మూడు వేల మంది ప్రజలు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భోజనం చేశారు. జన్మదినాన్ని సేవా కార్యక్రమంతో ముడిపెట్టడం అభినందనీయమని పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా కట్ల సంతోష్ మాట్లాడుతూ, వైరా నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. రోడ్లు, తాగునీరు, విద్య, వైద్యం, సాగునీరు, సంక్షేమ పథకాల అమలుకు కోట్లాది రూపాయల నిధులను తీసుకువచ్చి అభివృద్ధి పనులను వేగవంతం చేశారని పేర్కొన్నారు. ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న



ఎమ్మెల్యే నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ, తనపై ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు చూపుతున్న ప్రేమాభిమానాలు జీవితాంతం మరువలేనివని అన్నారు. తనపై ఉంచిన నమ్మకానికి తగ్గట్టుగా వైరా నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని తెలిపారు. ప్రజల ఆశీస్సులు, కార్యకర్తల సహకారంతో మరింత బాధ్యతగా పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ళ రంగారావు, చెరుకూరి కిరణ్, పమ్మి అశోక్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, తాటిపూడి సర్పంచ్ జవ్వాజి అశ్విని, ఖానాపురం సర్పంచ్ బాలాజీ, కౌన్సిలర్లు మోరు శ్రీకాంత్, ధిరావత్ వెంకటేశ్వర్లు, గోరుంట్ల శ్రీదేవి, బత్తుల సుమతి, నాయకులు గుమ్మ రోశయ్య, రాయల రాము, జవాజి నాగరాజు, మచ్చ బుజ్జి, కట్ల నాగరాజు, తెలుగుదేశం పార్టీ నాయకులు చలపతి, సురేందర్, పూర్ణయ్య, ప్రదీప్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళలు, యువకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# దేశంలో దొంగలు పడ్డట్లు సింగరేణి లో పడ్డారు.

### ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు.

### డబ్బు చప్పులతో నేతల పాటలతో మార్మోగిన వేదిక

**గోదావరిఖని జూలై25 నేషనలిస్ట్ వాయిస్**

దేశంలో దొంగలు పడ్డట్లు సింగరేణి లో ఆదాని, అంబానీల రూపంలో సింగరేణి లో పడ్డారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసిబ గౌరవ అధ్యక్షులు, కొత్తగూడెం ఎమ్మెల్యే కామ్రేడ్ కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం గోదావరిఖని జి.ఎం ఆఫీస్ గ్రౌండ్ లో జరిగిన సింగరేణి కార్మికుల కవాతు లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ సింగరేణి ఎనభై ఏండ్ల చరిత్ర కలిగిన సంఘం ఏఐటియుసి అని దీని లో కొనసాగడానికి కార్మిక వర్గం గర్వపడాలని అన్నారు. గత టిఆర్ఎస్ ప్రభుత్వ హయాం లో పార్లమెంటు లో ప్రవేశ పెట్టిన ఎంఎండిఆర్ చట్టం వల్ల సింగరేణి కి కొత్త గనులు రాకుండా పోయిందని దీనికి అనుకూలంగా పార్లమెంటు లో ఆనాడు టిఆర్ఎస్ ఎం.పి కవిత తదితరులు ఓటు వేసారని ఆయన ఆరోపించారు. అటువంటి సంఘానికి నేడు కార్మికుల గురించి, ఏఐటియుసి గురించి మాట్లాడే అర్హత లేదని ఆయన ఘాటుగా విమర్శించారు. గోదావరిఖని లో జరుగుతున్న కార్మికుల కవాతు ద్వారా కార్మిక వర్గ ఐక్యతను చాటాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం వల్ల సింగరేణి కి కొత్త గనులు రావడం లేదని ఆయన అన్నారు. కార్మికుల హక్కుల సాధన కోసం 31 డిమాండ్ లతో సమ్మె నోటీసు ఇచ్చామని, దీని పై ఈ నెల 28 న చర్చలు జరుగనున్నాయని, ఒక వేళ చర్చలు విపలమైన పక్షంలో ఆర్.ఎల్.సి నుండి ఫెయిల్యూర్ రిపోర్ట్ తీసుకొని ఆగస్టు 15 తర్వాత ఎప్పుడైనా సమ్మె లోకి వెళ్తామని, ఈ సమ్మె ను విజయవంతం చేయడానికి కార్మిక వర్గం సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్ కుమార్ మాట్లాడగా, నాయకులు



వై.వి.రావు, వీరభద్రం, కవ్వంపల్లి స్వామి, కందుకూరి రాజారత్నం, జూపాక రాంచందర్, గంధం సాంబశివరావు, మందల రాంచంద్రారెడ్డి, సిపిఐ నాయకులు గౌతం గోవర్ధన్, కే.కనకరాజ్, కార్పొరేటర్ సూర్య, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం ఎ గౌస్, వర్కర్స్ యూనియన్ నాయకులు విజయలక్ష్మి, ప్రజా సంఘాల నాయకులు కన్నం లక్ష్మి నారాయణ, క్రాంతి కిరణ్ లు పాల్గొన్నారు. ఈ కవాతు కార్యక్రమానికి అర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను ఆహ్వానం పలికారు. అంతకు ముందు అమరజీవి కామ్రేడ్ మాదిరెడ్డి భాస్కర్ రావు గారి విగ్రహం కు నాయకులు పూల మాలలు వేసి నివాళులు అర్పించి, ప్రదర్శన గా జి.ఎం.కాలనీ గ్రౌండ్ కు వచ్చారు. కవాతు లో అర్జీ వన్, టూ, త్రీ బ్రాంచి ల ఆఫీస్ బేరర్స్, పిట్ కార్యదర్శులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సభా౼జ కార్యక్రమానికి ముందు కళాకారులు ఎజ్జ రాజయ్య, చీకటి అంజన్న, వై.లెనిన్ లు కార్మిక గేయాలు ఆలపించారు.

# నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి ప్రజలు సహకరించాలి

### రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి

**ద్వారక నగర్ జులై 25 నేషనలిస్ట్ వాయిస్**

. వార్డు సందర్శనలో భాగంగా శనివారం తెల్లవారుఝామున పదవ డివిజన్ రామ్ నగర్ లో పర్యటించారు . ఈ సందర్భంగా 2 ఎ ఇంక్ లైన్ మోరీ వద్ద కాలువ పూడిక తొలగింపు పనులతో తో పాటు ప్రక్కనే ఉన్న ఖాళీ స్థలాల్లో పెరిగిన పిచ్చి మొక్కలు తొలగించే పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వీధులలో రహదారి అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించారు . రామాలయం వెనుక రోడ్డు మధ్యలో మురుగు నీరు నిలిచిపోయిన అండర్ గ్రౌండ్ డ్రై నేజ్ శుభ్రం చేయించారు. మురుగు నీరు ఎక్కడా నిలిచిపోకుండా సాఫీ గా ప్రవహించేలా కాలువలన్నిటినీ శుభ్రం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దడానికి నగర పాలక సంస్థ చేస్తున్న ప్రయత్నంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని అన్నారు. చెత్తను బహిరంగ ప్రదేశాలలో పడవేసి జరిమానా ల బారిన పడవద్దని సూచించారు . నెలకు కేవలం రూ 50/- చెల్లిస్తే ఇంటి ముందుకు వచ్చే స్వచ్ఛ ఆటో కు చెత్త ఇవ్వాలని అన్నారు. అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు , నగర పాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ జె. అరుణ శ్రీ మాట్లాడుతూ ఈ వర్షా కాలంలో అంటువ్యాధుల వ్యాప్తి పట్ల ప్రజలు ప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఇంటి ఆవరణ తో పాటు ఇంటి బయట కూడా నీరు నిలువ ఉండకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా అన్ని డివిజన్ లలో ప్రత్యేక శ్రద్ధతో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఆ తరువాత మధ్యాహ్నం సమయంలో 2,32,33,34 మరియు 49 వ డివిజన్ లలో మేయర్ పలు వీధులను సందర్శించారు. రోడ్లు, కాలువలపై ఆక్రమణలు, అక్రమ కట్టడాలు తొలగించవల్సిందిగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అవసరమున్న చోట వెంటనే యు జి డి నిర్మించి సి సి రోడ్లు




వేయవలసిందిగా ఆదేశించారు. అలాగే రాజేష్ థియేటర్ వద్ద రోడ్డు వెడల్పు ,జశీక్షన్ అభివృద్ధి చేయడానికి వీలుగా ఎలక్ట్రికల్ లైన్స్ , ట్రాన్స్ ఫార్మర్ షిఫ్ట్ చేయించవలసిందిగా ఆదేశాలు జారీ చేశారు. మిలిపోయిన రోడ్డు ప్యాచ్ వర్క్ కూడా పూర్తి చేయాలని ఆదేశించారు . ఈ కార్యక్రమాల్లో స్థానిక కార్పొరేటర్లు అడ్డాల గట్టయ్య , వెంగళ బాపు , తోట మమత, మెరుగు భూ లక్ష్మీ , స్వప్న ప్రియ నాయకులు విజయ్ , కుమార్ , అభిషేక్ , భరత్ ,సాగి సంతోష్ రావు , నగర పాలక సంస్థ టి పి ఓ నవీన్ , ఎ ఇ అన్వేష్ , మీర్ తదితరులు పాల్గొన్నారు.

# వచ్చే జూలై నాటికి ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులు పూర్తి చేస్తాం

### -దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్

### -కురుమూర్తి దేవస్థానం వద్ద లక్ష పుష్పార్చన పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే



**దేవరకద్ర, జులై 25 నేషనలిస్ట్ వాయిస్:**

వచ్చే జూలై నాటికి మహబూబ్ నగర్ జిల్లాలోని చిన్నచింతకుంట మండలం శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానం వద్ద నిర్మించే ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులను పూర్తి చేస్తామని దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అన్నారు. కురుమూర్తి స్వామి దేవస్థానం వద్ద నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్ తో కూడిన ఘాట్ రోడ్డు నిర్మాణ పనులను ఆర్ అండ్ బి ఈఎన్సి బివి రావు, ఎస్ ఈ రాజేందర్ తదితర అధికారులతో కలిసి ఎమ్మెల్యే జిఎంఆర్ శనివారం పరిశీలించారు. అనంతరం దేవస్థానం వద్ద తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన లక్ష పుష్పార్చన పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. దేవస్థానానికి వచ్చిన ఎమ్మెల్యే జిఎంఆర్ కు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం స్వామివారిని ఎమ్మెల్యే జిఎంఆర్ దర్శించుకున్నారు. పురహితులు ఎమ్మెల్యే జిఎంఆర్ పై అక్షింతలు చెల్లి ఆశీర్వచనం పలికారు. స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ కురుమూర్తి స్వామి ఆలయం అభివృద్ధి పై దృష్టి పెట్టి భక్తుల సౌకర్యార్థం వంతెన నిర్మాణం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని అడిగిన వెంటనే ఎలివేటెడ్ కారిడార్ తో కూడిన ఘాట్ రోడ్డు నిర్మాణం కోసం రూ.110 కోట్లు మంజూరు చేశారన్నారు. కారిడార్ నిర్మాణ పనులు వేగంగా కొనసాగు తున్నాయన్నారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని పరిశీలించడం జరిగిందన్నారు. ఈ పనులను సాధ్యమైన త్వరగా పూర్తిచేయాలన్న కృత నిశ్చయంతో పనిచేస్తున్నామని అన్నారు. ఈ బ్రహ్మోత్సవాలనాటికీ దేవస్థానానికి వచ్చే వంతెన నిర్మాణ పనులు పూర్తవుతాయన్నారు. ఎలివేటెడ్ నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తామని ఎమ్మెల్యే జిఎంఆర్ అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# దళిత ఎస్సై చిరంజీవి సస్పెన్షన్ అన్యాయం

### -- మాదిగ జాగృతి సంఘం తీవ్ర ఖండన

**జగిత్యాల జిల్లా ప్రతినిధి జూలై 25, నేషనలిస్ట్ వాయిస్:**

కోరుట్లలో విధులు నిర్వహిస్తున్న దళిత ఎస్సై చిరంజీవిని పూర్తి స్థాయి విచారణ చేపట్టకుండానే సస్పెండ్ చేయడాన్ని మాదిగ జాగృతి సంఘం తీవ్రంగా ఖండించింది. సంఘం నాయకులు మాట్లాడుతూ, గత జూలై 12న జరిగిన సునీత హత్య కేసులో వాస్తవ పరిస్థితులను పూర్తిగా పరిశీలించకుండా, కేవలం ఆరోపణల ఆధారంగా దళిత అధికారి అయిన ఎస్సై చిరంజీవిపై సస్పెన్షన్ విధించడం అన్యాయమని పేర్కొన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితులుగా పేర్కొంటున్న కాసుల వంశీ, కాసుల గంగారెడ్డి తదితరులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నిజానిజాలు వెలుగులోకి రాకముందే దళిత అధికారిపై చర్యలు తీసుకోవడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ, ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని మాదిగ జాగృతి సంఘం కోరింది. ఈ కార్యక్రమంలో జిల్లా మాదిగ జాగృతి సంఘం అధ్యక్షుడు శివ, ప్రధాన కార్యదర్శి తిరుపతి, కార్యదర్శి కొటేష్, సభ్యులు అశోక్, ఉపేంద్ర, గంగరాజం, తిరుపతి, రమేష్, ప్రవీణ్, మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.




# ఆల్ఫోర్స్ విద్యాసంస్థలపై వెంటనే చర్యలు తీసుకోవాలి

### - ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద రాకేష్

**జగిత్యాల జిల్లా ప్రతినిధి జూలై 25, నేషనలిస్ట్ వాయిస్:**

నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నట్లుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాలపై సంబంధిత అధికారులు వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జగిత్యాల జిల్లా అధ్యక్షుడు మంద రాకేష్ డిమాండ్ చేశారు. శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జగిత్యాల పట్టణంలోని కొత్త బస్టాండ్, పాత బస్టాండ్ ప్రాంతాల్లో ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాల పేరుతో ఉమెన్స్ కో-ఎడ్యుకేషన్ నిర్వహిస్తుండగా, అదనంగా పాత బస్టాండ్ సమీపంలో ఐఐటీ, నీట్, మెయిన్స్ కోచింగ్ పేరుతో మరో కేంద్రాన్ని నిర్వహిస్తున్నారని ఆరోపించారు. అయితే, దీనికి సంబంధించి అవసరమైన అనుమతులు ఉన్నాయా లేదా అనే విషయంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. ఈ అంశంపై జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి నారాయణ స్పందించి, ఆల్ఫోర్స్ విద్యాసంస్థలకు ఎలాంటి అనుమతులు మంజూరు చేశారో ప్రజలకు స్పష్టత ఇవ్వాలని కోరారు. ఒకే పట్టణంలో ఆల్ఫోర్స్ పేరుతో ఎన్ని విద్యాసంస్థలకు అనుమతులు ఉన్నాయో వెల్లడించాలని డిమాండ్ చేశారు. అనుమతులు లేకుండా విద్యాసంస్థలు నిర్వహించడం నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్న ఆయన, సంబంధిత అధికారులు వెంటనే సమగ్ర విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.




# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయం

### -దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

### -కొత్తకోటలో కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కుల పంపిణీ

**దేవరకద్ర, జులై 25 నేషనలిస్ట్ వాయిస్:**



ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అన్నారు. దేవరకద్ర నియోజక వర్గ పరిధిలోని కొత్తకోట పట్టణంలోనున్న ఆర్ కే గార్డెన్ ఫంక్షన్ హాల్ లో శనివారం కొత్తకోట, మధనాపురం మండలాలకు చెందిన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే జిఎంఆర్ అందజేశారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రసంగించారు. అన్ని వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడుతుందన్నారు. వారి సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. నిరుపేదలను ఆదుకోవడానికి ప్రభుత్వం పలు పథకాలకు శ్రీకారం చుట్టిందన్నారు. ఆ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జిఎంఆర్ సూచించారు. నిరుపేదలను ఆదుకోవాలన్న ఉద్దేశంతోనే ఇందిరమ్మ ఇండ్ల పథకానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. నిరుపేదలకు ఈ పథకం ఎంతగానో దోహదపడు తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజల ప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# భారతీయ జనతా యువ మోర్చా మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు శ్రీ రాగం అర్జున్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్

**నేషనలిస్ట్ వాయిస్ దిన పత్రిక మేడ్చల్ జిల్లా జులై (25)**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రాష్ట్రవ్యాప్త ఉద్యమంలో భాగంగా పోస్టర్ విడుదల కార్యక్రమం మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు శ్రీ ఈటల రాజేందర్ నివాసంలో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని మల్కాజిగిరి ఎంపీ శ్రీ ఈటల రాజేందర్ పోస్టర్‌ను ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా బీజేపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు శ్రీ బుద్ధి శ్రీను, మాజీ జిల్లా అధ్యక్షులు శ్రీ పట్లోళ్ల విక్రమ్ రెడ్డి గారు ముఖ్య అతిథులుగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా శ్రీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల వేలాది మంది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం భారతీయ జనతా పార్టీ, భారతీయ జనతా యువ మోర్చా నిరంతరం పోరాటం కొనసాగిస్తాయని స్పష్టం చేశారు. శ్రీ రాగం అర్జున్ మాట్లాడుతూ, విద్యార్థుల సమస్యల పరిష్కారమే భారతీయ జనతా యువ మోర్చా ప్రధాన లక్ష్యమని, ప్రభుత్వం వెంటనే పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించే వరకు ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కన్వీనర్ శ్రీ ప్రవీణ్ రావు, బీజేపీ మహిళా మోర్చా జిల్లా సహ కన్వీనర్ శ్రీమతి సుగుణ రెడ్డి, భారతీయ జనతా యువ మోర్చా రాష్ట్ర కార్యదర్శి శ్రీ వరప్రసాద్ రెడ్డి, యువ మోర్చా నాయకులు శ్రీ సామల పవన్ రెడ్డి, శ్రీ చిత్రాంజన్ రెడ్డి, శ్రీ విక్రమ్ సింగ్, జిల్లా నాయకులు శ్రీ మధుసూదన్ గౌడ్, శ్రీ బోయిని శివ సాయి గౌడ్, శ్రీ నరేందర్ రెడ్డి, శ్రీ శరత్, శ్రీ గణేష్, శ్రీ ప్రణయ్, శ్రీ మధు, శ్రీ పవన్ గౌడ్, అలాగే భారతీయ జనతా పార్టీ, భారతీయ జనతా యువ మోర్చా జిల్లా, మండల, శక్తికేంద్ర, బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. విద్యార్థుల హక్కుల సాధన కోసం భారతీయ జనతా యువ మోర్చా మేడ్చల్ జిల్లా ఆధ్వర్యంలో చేపట్టిన ఈ పోస్టర్ విడుదల కార్యక్రమం విద్యార్థి సమస్యలపై పార్టీ కట్టుబాటును మరోసారి చాటిచెప్పింది.



# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ప్రజాస్వామ్యానికి, విద్యార్థుల పోరాటానికి విజయ చిహ్నం



నేషనలిస్ట్ వాయిస్ న్యూస్,నిర్మల్ బ్యూరో, జూలై 25.

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను తెలంగాణ జన సమితి (టీజేఎస్) నిర్మల్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ వాజిద్ అహ్మద్ ఖాన్ స్వాగతించారు. ఈ రాజీనామా ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, విద్యార్థి యువజన పోరాటం సాధించిన విజయమని ఆయన పేర్కొన్నారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చాలా ఆలస్యంగా వచ్చిందన్నారు. ముందుగానే పదవి నుంచి తప్పుకుని ఉంటే వ్యక్తిగత గౌరవంతో పాటు కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠ కూడా నిలిచేదని, ఆలస్యం వల్ల ప్రభుత్వానికి అనవసరంగా ఇబ్బందికర పరిస్థితులు ఎదురయ్యాయని వ్యాఖ్యానించారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద గత కొన్ని రోజులుగా వేలాది మంది విద్యార్థులు, యువత చేపట్టిన ఆందోళనలను ప్రస్తావించిన ఆయన, కేంద్ర విద్యాశాఖ మంత్రిని నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ సాగిన ఈ ఉద్యమం చివరకు ఫలించిందన్నారు. ఈ సందర్భంగా ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులకు, సీజేపీ (జశీఎనితీశుఎష్ట్ర ఝుఝు ఝుతీఎ) నాయకత్వానికి అభినందనలు తెలియజేస్తూ, వారి నిరంతర ప్రజాస్వామ్య పోరాటం వల్ల మోదీ ప్రభుత్వం తలవంచక తప్పలేదని అన్నారు. దీనిని ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ స్ఫూర్తి సాధించిన విజయంగా అభివర్ణించారు. టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం నాయకత్వంలో పార్టీ విద్యార్థి, యువజన సంఘాలతో కలిసి సీజేపీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని తెలిపారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లకు మద్దతుగా దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్యబద్ధమైన ఉద్యమాలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వివాదం నేపథ్యంలో ఆత్మహత్యలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్న విద్యార్థుల కుటుంబాలకు రూ. 1 కోటి చొప్పున పరిహారం అందించాలని డిమాండ్‌కు ఆయన మద్దతు తెలిపారు. ఈ వ్యవహారంలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులపై నమోదు చేసిన తప్పుడు కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. ఆందోళనల సందర్భంగా లాఠీచార్జ్‌కు పాల్పడ్డారని ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసిన వాజిద్ అహ్మద్ ఖాన్, దేశ విద్యా వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం నెలకొల్పి విద్యార్థులకు న్యాయం చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. సీజేపీ నేతృత్వంలో కొనసాగుతున్న విద్యార్థి ఉద్యమానికి టీజేఎస్ పూర్తి మద్దతు కొనసాగిస్తుందని ఆయన పునరుద్ఘాటించారు.

## పట్నం రుక్కమ్మ భౌతికకాయానికి నివాళులు అర్పించిన శరత్ కుమార్ రెడ్డి

నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి, జూలై, 25,2026,

ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి గారి మాతృమూర్తి పట్నం రుక్కమ్మ గారి భౌతికకాయానికి కెఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు శ్రీ శరత్ కుమార్ రెడ్డి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ పట్నం అవినాష్ రెడ్డితో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి, రుక్కమ్మ గారి మరణం పట్ల తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని భగవంతుడిని కోరారు.



# జూలై 27-29 వరకు జిల్లాలో విత్తన మేళా

### రైతు వేదికల్లో ప్రత్యేక ఏర్పాట్లు.. ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన...



## వికారాబాద్ జిల్లా వ్యవసాయ అధికారి కవిత ఆదేశాలు...

వికారాబాద్, నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి, జూలై, 25,2026,

జిల్లాలోని అన్ని మండల కేంద్రాల రైతు వేదికలలో ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు 'విత్తన మేళా' నిర్వహిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి బి. కవిత తెలిపారు. ఎల్-నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగు, అత్యవసర ప్రణాళికపై అవగాహన కల్పించేందుకు మేళా సందర్భంగా ప్రత్యేక సమా వేశాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు) రైతులకు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా చేపట్టాల్సిన సాగు విధానాలపై సూచనలు అందించనున్నారని తెలిపారు. అలాగే విత్తన వ్యాపారులు రైతు వేదికల వద్ద ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి, అత్యవసర ప్రణాళికలో ప్రోత్సహిస్తున్న పంటల విత్తనాలను సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రైతుల సౌలభ్యం కోసం వివిధ కంపెనీలకు చెందిన అన్ని రకాల విత్తనాలు ఒకేచోట లభించేలా ఏర్పాట్లు చేస్తున్నామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి సూచించారు. విత్తన మేళాపై విస్తృత ప్రచారం నిర్వహించి, జిల్లాలోని అధిక సంఖ్యలో రైతులు ఈ కార్యక్రమం ద్వారా లబ్ధి పొందేలా చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారులు (ఎంఏఓలు), వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు)కు ఆదేశాలు జారీ చేశారు.

## ప్రజాసేవలో ముందుండే రాఘవపూర్ మాజీ సర్పంచ్ జగన్‌కు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు

పరిగి, నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి, జూలై, 25,2026,

గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం కృషి చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్న మాజీ సర్పంచ్ జగన్ జన్మదిన వేడుకలు ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పుష్పగుచ్ఛాలు అందజేసి నాయకులు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కుధవంద్‌పూర్ సర్పంచ్ యాదయ్య మాట్లాడుతూ, మాజీ సర్పంచ్ జగన్ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ గ్రామ అభివృద్ధికి విశేష సేవలు అందించిన నాయకుడని కొనియాడారు. ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో మరెన్నో సంవత్సరాలు ప్రజలకు సేవ చేసే అవకాశం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ సైద్‌పల్లి గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రాములు, నాయకులు శ్రీనివాస్, శ్రావణ్ కుమార్, గోపాల్, యాదయ్య తదితరులు పాల్గొని మాజీ సర్పంచ్ జగన్‌ను ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



## కేంద్ర మంత్రి రాజీనామా ఘనత రాహుల్ గాంధీది

నేషనలిస్ట్ వాయిస్ న్యూస్ నిజామాబాద్ బ్యూరో


కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంలో ముఖ్యపాత్ర ఎన్ఎస్ యుఐ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ లదని నిజామాబాద్ డిసిసి అధ్యక్షులు కట్పల్లి నగేష్ రెడ్డి పేర్కొన్నారు. వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఇందిరా గాంధీ విగ్రహం నుండి అంబేడ్కర్ విగ్రహం వరకూ కొవ్వత్తుల ర్యాలీని నిర్వహించిన సందర్భంగా మాట్లాడారు. విద్యార్థులకు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ మద్దతు తెలిపారని, వారి పైన కూడా అక్రమంగా కేసులు దౌర్జన్యంగా ఈడ్చుకుంటూ వెళ్లి కేసులు పెట్టారని, ఇది నియంత పాలనకు నిదర్శనమని బొబ్బిలి రామకృష్ణ అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఛైర్మన్లు శేఖర్ గౌడ్, కవిత రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కోశాధికారి భక్త వత్సలం, జిల్లా ముఖ్య నాయకులు యాదగిరి, విపుల్ గౌడ్, ప్రవీణ్ గౌడ్, శరత్, మోయిన్, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, యూత్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## వేములవాడ రాజన్న ఆలయానికి మరో 99.40 కోట్లు నిధులు మంజూరు

నేషనలిస్ట్ వాయిస్ న్యూస్ ముస్తాబాద్/ సిరిసిల్ల

దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధి విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రాజన్న ఆలయ అభివృద్ధిలో భాగంగా ఇప్పటికే 2023-24 బడ్జెట్లో 50 కోట్లు, 2024-25 బడ్జెట్లో 100 కోట్లు విడుదలవగా శనివారం మరో 99.40 కోట్ల నిధులు విడుదల చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో 150 కోట్లతో సుమారు 45 శాతం పనులు పూర్తికాగా మరో 99 కోట్లు నిధులు విడుదల కావడంతో రాజన్న ఆలయ అభివృద్ధి విస్తరణ పనులు శరవేగంగా జరగనున్నాయి. కాగా విధులు మంజూరు కి కృషిచేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, శ్రీధర్ బాబు, పొన్నశీ ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లకు రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ధన్యవాదాలు తెలిపారు.



## మైనర్ బాలికపై లైంగిక దాడి

### మేనమామ, వరుస సోదరులే నిందితులు

మేడ్చల్ నేషనలిస్ట్ వాయిస్

గంజాయి మత్తులో మైనర్ బాలికపై మేనమామ, సోదరులు సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు. మేడ్చల్ జిల్లా కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన జరిగింది. బాధిత బాలిక తన తల్లిదండ్రులు చనిపోవడంతో కీసరలోని తన అమ్మమ్మ వద్ద ఉంటోంది. స్థానికుల సహాయంతో తుర్కపల్లిలోని వసతి గృహంలో చేరి, ఇటీవల సెలవులు కావడంతో కీసరలోని అమ్మమ్మ ఇంటికి వచ్చింది. ఒంటరిగా ఉన్న సమయంలో గంజాయి మత్తులో మేనమామ, వరుసకు సోదరులైన ఇద్దరు యువకులు బాలికపై సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు. నిందితులు విషయం బయటకు రాకుండా జాగ్రత్త పడ్డారు. వసతి గృహానికి వెళ్లిన బాలికకు అక్కడ ఫ్యాన్ తగిలి గాయాలు అఅయయాయి. అమ్మమ్మ దగ్గరికి తిరిగి రాగా లైంగిక దాడి విషయం బయటపడింది. పోలీసులు నిందితుల్లో ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. పరారైన ఇద్దరి గురించి గాలింపు కొనసాగుతోంది.

## శ్రీమన్నారాయణుని ఆశీస్సులు అందరిపై ఉండాలి

### ప్రజలకు సీఎం రేవంత్ తొలి ఏకాశి శుభాకాంక్షలు


హైదరాబాద్ నేషనలిస్ట్ వాయిస్

పవిత్రమైన తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి కుటుంబంలో ఆనందం, ఆయురారోగ్యం, ఐశ్వర్యం, సిరిసంపదలు వెల్లివిరియాలని, సమాజంలో శాంతి, సామరస్యం నెలకొనాలని శ్రీమన్నారాయణుని ఆశీస్సులు అందరిపై ఉండాలని ప్రార్థించారు. ఈ పవిత్రమైన రోజున భక్తి, విశ్వాసంతో ఉపవాసం పాటించి, ప్రార్థనలు ఆచరించి ఆధ్యాత్మిక శాంతి, సుఖసంతోషాలను పొందాలని ఆకాంక్షించారు.

## జిల్లాలో విష జ్వరాలకు ఇద్దరు చిన్నారుల మృతి

జగిత్యాల,జూలై25( నేషనలిస్ట్ వాయిస్):

జిల్లాలోని పొరండ్ల గ్రామంలో విషజ్వరాలు ఆందోళన కలిగిస్తున్నాయి. గ్రామంలో విషజ్వరాల బారిన పడి ఇద్దరు చిన్నారులు మృతి చెందడం స్థానికంగా విషాదాన్ని నింపింది. విషజ్వరంతో బాధపడుతున్న హరిస్మిత(6) అనే చిన్నారి.. చికిత్స పొందుతూ మృతి చెందింది. శుక్రవారం వరుణ్ తేజ(6) అనే చిన్నారి కూడా విషజ్వరం బారిన పడి ప్రాణాలు కోల్పోయాడు. వైరల్ ఫీవర్ కారణంగానే చిన్నారులు మరణించినట్లు వైద్యులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఇద్దరు చిన్నారుల మృతిలో వైద్యారోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. పొరండ్ల గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. వైద్య సిబ్బంది గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. జ్వరం, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు ఉంటే వెంటనే ఆస్పత్రికి వెళ్లాలని వైద్య సిబ్బంది సూచిస్తున్నారు.



# ఐదో అంతస్తు నుంచి దూకి వైద్యా విద్యార్థిని ఆత్మహత్య

మేడ్చల్ నేషనలిస్ట్ వాయిస్

మేడ్చల్ జిల్లా నాగారం వెస్ట్ గాంధీనగర్లో విషాదం నెలకొంది. ఐదో అంతస్తు నుంచి దూకి పీజీ వైద్య విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలు దీక్షిత (26) అపార్ట్మెంట్ ఐదో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. దీక్షిత బెంగళూరులోని కళాశాలలో పీజీ ఆప్తాల్మాలజీ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. పోలీసులు స్థానికుల సమాచారంతో ఘటనాస్థలికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

## సంపాదకీయం

# కాక్రోచ్ ఉద్యమాన్ని హైజాక్ చేసే యత్నాలు ?

విద్యార్థుల ఉద్యమాన్ని హైజాక్ చేసేందుకు కాంగ్రెస్, ఆప్ పార్టీలు నానా తంటాలు పడుతున్నాయి. తమ కంట్రోల్‌లో తీసుకునేందుకు రాహుల్ నానా యాతన పడుతున్నారు. తానే ముందుండి ఇదంతా నడిపిస్తున్న ట్లుగా వ్యవహరించారు. ప్రధాని మోడీ నివాసం ముందు ఆకస్మిక ధర్నాకు దిగడం, రాష్ట్రాల్లో మద్దతుగా కాంగ్రెస్ ఆందోళనలకు దిగడం చూస్తుంటే కాంగ్రెస్ రాజకీయ లబ్ది పొందేందుకు ఎత్తులు వేస్తోందని అర్థం అవుతోంది. అభిజిత్ దీప్కే వెనకాల కాంగ్రెస్ ఉందా లేదా అన్నది తెలియదు. ఒకవేళ ఉంటే విద్యార్థులు వెంటనే కాంగ్రెస్‌ను పక్కన పెట్టాలి. ఎందుకంటే విద్యార్థుల ఉద్యమం పక్కదారి పట్టే అవకాశం ఉంది. విద్యార్థులు ఉద్యమించడం ద్వారా ఒక్క నీట్ సమస్య కాకుండా అనేక సమస్యలు, ముఖ్యంగా దేశం ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడే ఛాన్స్ ఉంటుంది. కాంగ్రెస్‌ను దగ్గరకు రానీయనంతవరకు అభిజిత్ దీప్కే ఉద్యమానికి ఢోకా ఉండదు. ఎందుకంటే నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సీజేపీ డిమాండ్ చేస్తోంది. యువత కూడా జంతర్ మంతర్ వద్ద జరిగే నిరసనకు రావడంలో నిజాయితీ ఉంది. సోమవారం పార్లమెంట్ మార్చ్ సందర్భంగా పోలీసులు, నిరసనకారులకు మధ్య హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ ఘర్షణల్లో రెండు వర్గాలు గాయపడ్డాయి. ఈ ఉద్యమంలో ప్రధాన ఎజెండా పేపర్ లీకుల నుంచి విషయం తప్పుదారి పడుతున్నట్లు కనిపిస్తోంది. ఉద్యమంలో యువత పాల్గొంటున్నప్పటికీ, వారితో పాటు కొన్ని మత శక్తులు కూడా ప్రవేశించాయని స్పష్టంగా తెలుస్తోంది. ముఖ్యంగా జంతర్ మంతర్ వద్ద అసలైన ఎజెండా పక్కకు పోయి రామమందిరం, హిందూ దేవతల్ని తిట్టడం, జర్నలిస్టులపై దాడులు, భారత సైన్యంపై విద్వేష వ్యాఖ్యలు, జిహాద్ నినాదాలు వినిపించడం ఆందోళన కలిగిస్తోంది. కొన్ని శక్తులు ఈ ఉద్యమాన్ని హైజాక్ చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ క్రమంలో విద్యార్థి ఉద్యమం మత ఉద్యమంగా మారుతుందా అనే అనుమానాలు కలుగుతున్నాయి. మరోవైపు, నిహాంగ్ సిక్కులు కత్తులు, కిర్పాన్లు, ఈటెలతో కనిపించడం మరింత వివాదాస్పదమైంది. వీటిని ఊపుతూ ప్రదర్శనలు చేయడంపై ప్రజల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతు న్నాయి. పలువురు మేధావులు కూడా ఈ పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సరైన సమన్వయం లేకపోతే ప్రశాంతమైన ఉద్యమం బయటి శక్తుల ప్రయోజనాలకు ఉపయోగించే ప్రమాదం ఉందని అభిప్రాయపడుతున్నారు. బుధవారం రాత్రి యూట్యూబర్లపై దాడి, నిరసనకారులు–నిహాంగ్ సిక్కులకు మధ్య ఘర్షణకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. పెద్ద సంఖ్యలో ప్రజలు చేరుతుండటం మహిళల భద్రతకు ప్రమాదంగా మారింది. ఒక యువతిపై లైంగిక వేధింపులకు ప్రయత్నిస్తున్న వీడియో బయటకు రావడం మరింత ఆందోళనకు గురిచేసింది. పేపర్ లీక్ అంశాలతో పాటు మతం, ప్రాంతీయ ఉద్యమాలు, రాజకీయ అంశాలు ప్రస్తావనకు వస్తుండటం చూస్తే ఉద్యమం అసలు లక్ష్యం బలహీనపడుతుందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై గత కొద్ది రోజులుగా జంతర్‌మంతర్ దగ్గర విద్యార్థులు ఆందోళనలు కొనసాగిస్తున్నారు. చలో పార్లమెంట్ ముట్టడి సందర్భంగా విద్యార్థులపై పోలీసులు అమానుషంగా లాఠీఛార్జ్ నిర్వహించారు. దీంతో చాలా మంది బాలికలకు తీవ్ర గాయాలయ్యాయి. పలువురి పరిస్థితి విషమంగా కూడా మారింది. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అయ్యాయి. దీంతో దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున విద్యార్థులకు మద్దతు లభించింది. సినీ, క్రికెటర్లు, విపక్ష రాజకీయ నాయకుల నుంచి సంపూర్ణ మద్దతు లభించింది. ఈ క్రమంలో తాజాగా జంతర్‌మంతర్ దగ్గర కిలోమీటర్ దూరంలో ఇంటర్నెట్, మొబైల్ సేవలు నిలిచిపోయాయి. విద్యుత్ సరఫరాకు కూడా తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. మరోవైపు రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో విపక్ష ఎంపీలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు సంతాపంగా గాంధీ స్మృతి వనం దగ్గర నివాళులర్పించారు. విద్యార్థులకు ఇండియా కూటమి అండగా ఉంటుందని రాహుల్ గాంధీ ప్రకటించారు. ఇదంతా కూడా కాంగ్రెస్ ఉద్యమాన్ని తన గుప్పిట్లోకి తీసుకుని పోయే యత్నంగా గోచరిస్తున్నది. గత రెండు నెలలుగా పెద్దగా పట్టించుకోని కాంగ్రెస్ అకస్మాత్తుగా ఇప్పుడు ముందువరసలోకి రావడానికి యత్నిస్తోంది. బిజెపి కూడా ఇంతకాలం తాత్సారం చేస్తూ వచ్చింది. పరీక్షలో అక్రమాల ఆరోపణలు, పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక పరిపాలనా మార్పులు చేపట్టింది. ఉన్నత విద్యాశాఖ కార్యదర్శిగా ఉన్న వినీత్ జోషిని ఆ పదవి నుంచి తప్పిస్తూ, ఆయన స్థానంలో నరేశ్ పాల్ గంగ్వార్ ను నియమించింది. ఈ మేరకు గురువారం అర్ధరాత్రి కేంద్ర ప్రభుత్వం అధికారిక నోటిఫికేషన్ విడుదల చేసింది. రాజస్థాన్ విశ్వవిద్యాలయం నుంచి ఎకనామిక్స్‌లో మాస్టర్స్ డిగ్రీ పొందిన గంగ్వార్, కేంద్రంతో పాటు రాజస్థాన్ ప్రభుత్వంలో కూడా పలు కీలక బాధ్యతలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వంలో ప్రిన్సిపల్ సెక్రటరీగా కూడా సేవలందించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, పేపర్ లీక్‌కు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సజెపి ప్రధాన డిమాండ్‌గా పెట్టుకుంది. కానీ కేంద్రం ఈ డిమాండ్‌ను పక్కన పెట్టింది. ప్రముఖ సామాజిక కార్యకర్త సోనం వాంగ్‌చుక్ ఈ నిరసనలో పాల్గొని నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభించారు. దీంతో ఉద్యమం మరింత ఉధృతమైంది. జూలై 20న 'చలో పార్లమెంట్' కార్యక్రమానికి పిలుపునివ్వగా, నిరసనకారులు, ఢిల్లీ పోలీసుల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిణామాల అనంతరం కేంద్ర ప్రభుత్వం పలుమార్లు సిజిపి ప్రతినిధులను చర్చలకు ఆహ్వానించింది.

# ఆర్మీకి గేమ్ చేంజర్ 'కార్గిల్'


కార్గిల్ యుద్ధంలో సాధించిన విజయం,

అమర సైనికుల త్యాగానికి గుర్తుగా జరుపుకొనే కార్గిల్ విజయ్ దివస్ వేడుకలకు దేశం సిద్ధమైంది. నేడు(జూలై 26) జరుగనున్న 27 వ కార్గిల్ విజయ దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. కార్గిల్ యుద్ధంలో సాధించిన విజయం, అమర సైనికుల త్యాగానికి గుర్తుగా జరుపుకొనే కార్గిల్ విజయ్ దివస్ వేడుకలకు దేశం సిద్ధమైంది. నేడు(జూలై 26) జరుగనున్న 27 వ కార్గిల్ విజయ దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాజధాని ఢిల్లీతో పాటు అన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వాధినేతలు, అధికారులు, ప్రజలు ఆయా కార్యక్రమాల్లో పాల్గొని కార్గిల్ యుద్ధంలో అమరులైన సైనికులకు నివాళు లర్పించనున్నారు. భారత సైన్యం సాధించిన విజయాన్ని, దేశాన్ని కాపాడుకోవడంలో అమర జవాన్లు చేసిన త్యాగాలను స్మరించుకోనున్నారు. 1999, జూలై 26న కార్గిల్ యుద్ధంలో పాకిస్థాన్ సైన్యంపై భారత్ సైన్యం సాధించిన విజయానికి గుర్తుగా ఈ కార్గిల్ విజయ దినోత్సవాన్ని జరుపుకొంటున్నాం. సరిహద్దుల్లో భారత భూభాగంలోకి చొరబడిన పాకిస్థాన్ సైన్యాన్ని భారత సైన్యం 'ఆపరేషన్ విజయ్' పేరుతో కార్గిల్ ప్రాంతంలో సమర్థంగా తిప్పికొట్టింది. కార్గిల్ జిల్లాలో ఆక్రమించుకొన్న ప్రాంతాల నుంచి పాక్ బలగాలను వెనక్కు తరిమికొట్టింది. ఈ యుద్ధంలో సాధించిన విజయం.. భారత సైన్యానికి ఓ గేమ్ చేంజర్‌గా చెప్పొచ్చని, అభివృద్ధి చెందిన దేశంగా మారాలని ప్రయత్నాలు చేస్తున్న తరుణంలో ఇది కీలక దశ అని రక్షణ రంగ నిపుణులు చెబు తుంటారు. శత్రువులను తిప్పికొట్టడంలో ఆర్మీ సమర్థతను ఈ యుద్ధం ఎత్తిచూపింది. దీని ద్వారా సరిహద్దులో పాకిస్థాన్ ప్రోత్సహిస్తున్న ఉగ్రవాదాన్ని భారత్ ప్రపంచం ముందు ఉంచింది.

**1971 తర్వాత ఇదే..**

కశ్మీర్‌ను ఆక్రమించుకోవాలన్న కుట్రతో పాక్ సైన్యం ఆపరేషన్ బదర్ పేరుతో సరిహద్దులోకి వచ్చారు. కార్గిల్ యుద్ధం 1999, మే 3 నుంచి జూలై 26 వరకు జరిగింది. రెండు నెలలకు పైగా మంచు పర్వతాల్లో పోరాటం జరిగింది. ఈ యుద్ధంలో 527 మంది భారత సైనికులు అమరులయ్యారు. 1971 తర్వాత భారత్–పాక్ మధ్య జరిగిన యుద్ధం ఇదే కావడం గమనార్హం. కాగా, కమాండింగ్, నియంత్రణ, క్రమశిక్షణ చర్యలకు సంబంధించి త్రివిధ దళాల్లో థియేటర్ కమాండర్లకు అధికారాలు కల్పించే ఇంటర్ సర్వీసెస్ ఆర్గనైజేషన్స్–2023 బిల్లుకు రక్షణ రంగ పార్లమెంటరీ స్టాండింగ్ ఇటీవల ఆమోదం తెలిపింది. ఇది త్వరలో ఉభయ సభల ఆమోదంతో చట్టంగా మారనున్నది.

## తొలి ఏకాదశి సందర్భంగా అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో ఘనంగా ప్రత్యేక పూజలు

**నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి హన్మకొండ**

గోపాలపురం బృందావన కాలనీ, రోడ్ నెం.4లో ఉన్న శ్రీ అభయ ఆంజనేయ స్వామి దేవాలయంలో తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం వేదమంత్రోచ్చారణల మధ్య స్వామివారికి పవిత్ర అభిషేకాలు, అర్చనలు, అష్టోత్తర శతనామ పూజలు, ప్రత్యేక అలంకరణలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ నరసింహస్వామి చారి ఆధ్వర్యంలో భక్తులు తొలి ఏకాదశి వ్రతాన్ని ఆచరిస్తూ ఉపవాస దీక్షలు చేపట్టి, విష్ణు నామస్మరణ, భజనలు తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి పాలాభిషేకాలు, ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి తమ కుటుంబ సభ్యుల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, ఐశ్వర్యం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పురుష భక్తులు కూడా భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. తొలి ఏకాదశి హిందూ సంప్రదాయంలో అత్యంత విశిష్టమైన పర్వదినంగా భావిస్తారు. ఈ రోజున ఉపవాసం ఉండి, శ్రీమహావిష్ణువును భక్తిశ్రద్ధలతో ఆరాధించడం వల్ల సకల పాపాలు తొలగి, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సుఖశాంతులు, భగవదృప లభిస్తాయని పురాణాలు పేర్కొంటున్నాయి. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులకు ప్రత్యేక దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు, మహిళలు, పురుషులు, యువత, చిన్నారులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. భక్తులందరి సహకారంతో తొలి ఏకాదశి వేడుకలు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా నిర్వహించబడినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.




## నేత్రపర్వంగా తొలి ఏకాదశి వేడుకలు



**నేషనలిస్ట్ వాయిస్ న్యూస్ ముస్తాబాద్/ సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా తోపాటు ముస్తాబాద్ మండలంలో శనివారం తొలి ఏకాదశి పర్వదినం వేడుకలు నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయాలలో తొలి ఏకాదశి పర్వదినం వేడుకల్లో భాగంగా విశేష పూజలు నిర్వహించగా, భక్తులు భక్తిశ్రద్ధలతో సందర్శించారు. ఆలయాలు హరి నామ స్మరణతో మారుమోగాయి. ఇంటింటా భక్తులు ఉపవాసాలతో ధూపదీప నైవేద్యాలు సమర్పించి, పూజలు నిర్వహించి, భగత్ పారాయణం చేశారు.

## భారతీయ ముస్లింల ప్రస్తుత పరిస్థితిపై జాతీయ సంప్రదింపుల సదస్సు

**నేషనలిస్ట్ వాయిస్ న్యూస్ న్యూఢిల్లీ**



న్యూఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియాలో జరిగిన 'భారతీయ ముస్లింల ప్రస్తుత పరిస్థితిపై జాతీయ సంప్రదింపుల సదస్సు'లో తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ పాల్గొన్నారు. ఈ సదస్సుకు దేశవ్యాప్తంగా పలువురు ప్రముఖులు హాజరయ్యారు. వీరిలో మాజీ రాజ్యసభ సభ్యులు మహమ్మద్ అదీబ్, జమ్మూ, కాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి డా.ఫరూఖ్ అబ్దుల్లా, మాజీ కేంద్ర విదేశాంగ మంత్రి సల్మాన్ ఖుర్షీద్, భారతదేశం నలుమూలల నుండి ప్రముఖ ముస్లిం పండితులు, మేధావులు, మరియు సామాజిక నాయకులు ఉన్నారు. ఈ సంప్రదింపుల సదస్సులో భారతీయ ముస్లింల ప్రస్తుత పరిస్థితిని చర్చించడం, మరియు ఆ సమాజానికి సంబంధించిన వివిధ సామాజిక, విద్యా, రాజ్యాంగ, జాతీయ సమస్యలపై సంప్రదింపులు జరపడంపై దృష్టి సారించారు.

## తొలి ఏకాదశి సందర్భంగా శ్రీ వెంకటేశ్వర స్వామివారికి వైభవంగా అభిషేకాలు

**నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి హన్మకొండ**



తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని హన్మకొండ గోపాల్పూర్, వెంకటేశ్వర కాలనీ, రోడ్ నెం.1లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం తెల్లవారుజాము నుంచే భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, కొబ్బరి నీరు, పుష్పాలు, సుగంధ ద్రవ్యాలతో వైభవంగా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అష్టోత్తర శతనామార్చన, సహస్రనామార్చన, ప్రత్యేక అలంకరణ, మహామంగళహారతి నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ అనుముల ప్రదీప్ శర్మ వేదమంత్రోచ్చారణల మధ్య అభిషేకాలు, ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలి ఏకాదశి రోజున శ్రీ మహావిష్ణువును భక్తిశ్రద్ధలతో ఆరాధించడం వల్ల సకల శుభాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సుఖశాంతులు కలుగుతాయని తెలిపారు. ఉపవాస దీక్షతో విష్ణు సహస్రనామ పారాయణం, గోవింద నామస్మరణ చేయడం విశేష పుణ్యప్రదమని పేర్కొన్నారు. పూజా కార్యక్రమాల్లో గోపాల్పూర్, వెంకటేశ్వర కాలనీతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు, సేవాదారులు సమన్వయంతో విజయవంతంగా నిర్వహించగా, భక్తులు తొలి ఏకాదశి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొని శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆశీస్సులు పొందారు.

## పోరాట ఫలితంతోనే కేంద్రమంత్రి రాజీనామా

**నేషనలిస్ట్ వాయిస్ న్యూస్ అచ్చంపేట...**



సిజెపి ధర్నాలో ఘనత రాహుల్ గాంధీకి దక్కిందని, రేవంత్ రెడ్డి ఇందిరా పార్కు వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేయడం, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పిలుపుమేరకు అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ధర్నా చేయడం జరిగిందని, వారి పోరాట ఫలితమే కేంద్రం దిగివచ్చి కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం జరిగిందని ఐఎన్‌టియుసి అచ్చంపేట తాలూకా అధ్యక్షులు మహబూబ్ అలీ పేర్కొన్నారు.

# ఎన్‌డిఎలో ఇద్దరు రాజీనామా

## గతంలోనే వైదొలగిన ఎంజె అక్బర్

**న్యూఢిల్లీ,జులై 25 (నేషనలిస్ట్ వాయిస్):**

నీట్ పేపర్ లీకేజీపై కాక్రోచ్ జనతా పార్టీ, విద్యార్థిలోకం నిరసనల ధాటికి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. జంతర్ మంతర్ కేంద్రంగా దాదాపు నెల రోజుల పాటు అలుపెరగని పోరాటానికి.. యువతరం మొండిపట్టుదలకు ఎట్టకేలకు దిగొచ్చిన ప్రధాన్ శనివారం రిజైన్ చేశారు. గత ఎనిమిదేళ్లలో ఇలా పదవీకాలం మధ్యలోనే వైదొలిగిన ఏకైక కేంద్ర మంత్రి ప్రధానే కావడం విశేషం. 2018లో విదేశాంగ శాఖ సహాయ మంత్రి ఎంజే అక్బర్ అనూహ్యంగా రాజీనామా సమర్పించారు.కేంద్ర విద్యా శాఖ మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో విద్యార్థిలోకం శాంతించింది. నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ ప్రధాన్ స్వచ్ఛందంగా వైదొలగడంతో కాక్రోచ్ జనతా పార్టీ నేతలు ఉద్యమాన్ని విరమించారు. అయితే.. గత ఎనిమిదేళ్లలో కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసిన ఏకైక వ్యక్తి ధర్మేంద్ర ప్రధాన్. అయన కంటే ముందు.. 2018లో అనూహ్య పరిణామాల మధ్య ఎంజే అక్బర్ విదేశాంగ శాఖ సహాయ మంత్రి బాధ్యతల నుంచి వైదొలిగారు. నరేంద్ర మోడీ క్యాబినెట్‌లో మంత్రిగా 2016లో బాధ్యతలు చేపట్టిన అక్బర్.. అంతుకుముందు వార్త పత్రిక ఎడిటర్‌గా ఉన్న సమయంలో పలు మహిళలపై లైంగిక వేధింపులు పాల్పడ్డాడనే ఆరోపణలు వచ్చాయి. ఆయనకు వ్యతిరేకంగా మీటూ ఉద్యమం తీవ్రమవ్వడంతో అక్బర్ రాజీనామా చేయాల్సి వచ్చింది. ఈసారి నీట్ ప్రశ్నాపత్రం లీకేజీపై విద్యార్థులు భగ్గుమనడంతో.. ప్రధాన్ రాజీనామా అనివార్యమైంది. అయితే.. 2017లో రాజ్‌నాథ్ సింగ్ మీడియాతో మాట్లాడుతూ మాది యూపీఏ ప్రభుత్వం కాదు మంత్రులు రాజీనామా చేయడానికి అని నవ్వుతూ జవాబిచ్చాడు. కట్ చేస్తే తొమ్మిదేళ్లకు ఎన్డేఏ మంత్రివర్గంలోని ధర్మేంద్ర ప్రధాన్ అనూహ్య పరిణామాలతో వైదొలగాల్సి వచ్చింది.

# ధర్మేంద్ర రాజీనామాతో జంతర్‌మంతర్ వద్ద ఉద్రిక్తత

## -మరోమారు రెచ్చిపోయి పోలీసులపై రాళ్ల దాడి-ఇద్దరు పోలీసులకు తీవ్ర గాయాలు

## -సంబరాల్లో మునిగిపోయిన విద్యార్థులు

**లన్యూఢిల్లీ,జులై 25 (నేషనలిస్ట్ వాయిస్):**

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ప్రకటించిన వెంటనే ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. నిరసనకారులు పోలీసులపై రాళ్ల దాడికి దిగారు. నిరసనకారుల రాళ్లదాడిలో ఇద్దరు పోలీసులు గాయపడ్డారు. వారి తలలకు తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడ్డ పోలీసులను వెంటనే ఆస్పత్రికి తరలించారు. పరిస్థితిని అదుపు చేసేందుకు పోలీసులు భాష్పవాయు గోళాలు ప్రయోగించారు. నిరసనకారులపై లాఠీఛార్జ్ చేశారు. ఈ నేపథ్యంలోనే జంతర్ మంతర్ వద్ద అదనపు బలగాలు మోహరించాయి. ప్రస్తుతం అక్కడి పరిస్థితి అదుపులోనే ఉన్నట్లు సమాచారం. మరోవైపు విద్యార్థులు సంబరాల్లో మునిగిపోయారు. అభిజిత్‌ను అభినందిస్తూ భుజాలపైకి ఎత్తుకున్నారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే హర్షం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యం, విద్యార్థులు సాధించిన విజయంగా పేర్కొన్నారు. నీట్ పేపర్ లీక్ వివాదంపై కొన్ని వారాలుగా కొనసాగిన నిరసనల ఫలితంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకునేలా విద్యార్థులు ఒత్తిడి తెచ్చారని అన్నారు. ప్రజాస్వామ్య విలువలకు, దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థుల సామూహిక సంకల్పానికి లభించిన విజయమని ఆయన అభివర్ణించారు. కాగా, నిరంతర శాంతియుత నిరసనలు మార్పును తీసుకురాగలవని చెప్పడానికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ఒక నిదర్శనమని అభిజీత్ దిప్కే తెలిపారు. 'ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. మీరు భయపడకపోతే, ఈ ప్రభుత్వానికి తలొగ్గకపోతే, మనం ఎవరితోనైనా రాజీనామా చేయించగలమని చెప్పడానికి ఇది నిదర్శనం' అని అన్నారు. అలాగే నీట్ పేపర్ లీక్ వివాదం తర్వాత ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల పేర్లను దీప్కే గుర్తు చేసుకున్నారు. వారి స్మృతి కోసం రెండు నిమిషాల పాటు మౌనం పాటించాలని నిరసనకారులను కోరారు. అనంతరం ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై నిరసన ప్రాంగణంలో విద్యార్థుల సంబరాలు హోరెత్తాయి. విద్యావ్యవస్థపై లోపాలను ఎత్తిచూపుతూ పుట్టుకొచ్చిన పార్టీనే సీజేపీ సరిగ్గా రెండు నెలల క్రితం అభిజీత్ దీప్కే దీనిని ఏర్పాటు చేశారు. కొన్ని గంటల్లోనే ఇంటర్నెట్‌లో దాని పేరు మార్మోగిపోయింది. తర్వాత నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో దీప్కే జంతర్ మంతర్ వద్ద ప్రారంభించిన నిరసనలకు భారీ సంఖ్యలో యువత స్పందించింది. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు నిరసన వేదికవద్దకు వచ్చి మద్దతు తెలిపారు. జులై 20న 'చలో పార్లమెంట్' మార్చ్, ప్రధాన్ రాజీనామా నుంచి సీజేపీ వెనక్కి తగ్గకపోవడంతో ప్రభుత్వం దిగిరావాల్సి వచ్చింది. ఈ పరిణామాల్లో కీలకంగా వ్యవహరించిన 30 ఏళ్ల దీప్కే. మహారాష్ట్రలోని పుణెలో జర్నలిజం చదివారు. అమెరికాలోని బోస్టన్ యూనివర్సిటీ నుంచి పబ్లిక్ రిలేషన్స్‌లో మాస్టర్స్ చేశారు.

---------------------------

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో

# మారుతున్న పరిణామాలు

## ఢిల్లీ నుంచి మహా సిఎం ఫడ్నవీస్‌కు పిలుపు

## మంత్రివర్గంలో మార్పులపై ఊహాగానాలు

**న్యూఢిల్లీ,జులై 25 (నేషనలిస్ట్ వాయిస్):**

మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన నేపథ్యంలో న్యూఢిల్లీలో పరిణామాలు వేగంగా మారుతున్నాయి. ఢిల్లీ రావాలని మహారాష్ట్ర సీఎం ఫడణవీస్‌కు అధిష్టానం నుంచి పిలుపు వచ్చింది. సీఎంతో పాటు డిప్యూటీ సీఎం షిండేకు కూడా ఢిల్లీ పెద్దల నుంచి పిలుపు వచ్చింది. కీలక నేతలకు హైకమాండ్ నుంచి పిలుపు రావటంతో రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. కేంద్ర మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తరువాత న్యూఢిల్లీలో పరిణామాలు వేగంగా మారుతున్నాయి. ఢిల్లీకి రావాలని మహారాష్ట్ర సీఎం ఫడణవీస్‌కు అధిష్టానం నుంచి పిలుపు వచ్చింది. సీఎంతో పాటు డిప్యూటీ సీఎం షిండేకు కూడా ఢిల్లీ పెద్దల నుంచి పిలుపు వచ్చింది. కీలక నేతలకు హైకమాండ్ పిలుపుతో రాజకీయాల్లో ఉత్కంఠ నెలకొంది. కేంద్రం భారీ మార్పులకు సిద్ధం అవుతోందా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఈ దిశగా శివసేన ఉద్ధవ్ వర్గం నేత సంజయ్ రౌత్ కీలక వ్యాఖ్యలు చేశారు. మహారాష్ట్ర లో సీఎం మార్పు జరుగబోతోందని అన్నారు. ఫడణవీస్‌కు కేంద్ర విద్యాశాఖను ఇవ్వబోతున్నారని చెప్పారు. కేంద్ర మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణ కొంత కాలంగా వాయిదా పడుతున్న విషయం తెలిసిందే. పార్లమెంటు వర్షాకాల సమావేశాల ప్రారంభానికి ముందే ఇందుకు సంబంధించిన కసరత్తు పూర్తి చేయాలని కేంద్రం భావించినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. అయితే, ప్రధాని విదేశీ పర్యటనల కారణంగా ఈ ప్రక్రియ కొంతకాలం పాటు వాయిదా పడినట్టు సమాచారం. ఇక పునర్‌వ్యవస్థీకరణలో భాగంగా ప్రధాన్ సహా ఇతర మంత్రులు తప్పుకునే అవకాశం ఉన్నట్టు వార్తలు వచ్చాయి. ఈలోపు విద్యార్థుల నిరసనలు మిన్నంటాయి. విపక్షలా నిరసనల నేపథ్యంలో గత కొన్ని రోజులుగా పార్లమెంటు కూడా ఎలాంటి కార్యకలాపాలు జరగకుండానే వాయిదా పడుతోంది. తాజాగా విద్యాశాఖ మంత్రి తప్పుకోవడంతో ఆ శాఖ ఎవరికి కేటాయిస్తారన్న ఉత్కంఠ మొదలైంది. ఇతర ప్రభుత్వ శాఖల విషయంలో ప్రభుత్వం ఏదైనా నిర్ణయం తీసుకుంటుందా అన్న చర్చ జరుగుతోంది. నిన్న రాత్రి కేంద్రం 12 శాఖల సెక్రటరీలకు స్థాన చలనం కలిగించింది. వారిలో విద్యాశాఖ సెక్రటరీ కూడా ఉన్నారు. దీంతో, మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణపై కేంద్రం పూర్తిస్థాయి దృష్టి పెట్టనుందా? అన్న చర్చ జరుగుతోంది.

# నేటితరం యువత ఆలోచనాపరులు

## -వారిని అర్థం చేసుకుని ప్రేమగా చర్చించాలి-ఆదేశాలతో కాదు..అర్థవంతమైన చర్చలతో సాగాలి

## -ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ సంచలన వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ,జూలై25(నేషనలిస్ట్ వాయిస్):**




నేటితరం యువత ఆలోచనాపరులని, వారిని అర్థం చేసుకుని ముందుకు సాగాల్సి ఉందని ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ నేటి యువతపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఇప్పటి తరం మార్గదర్శకత్వం లేనిదో లేదా దారి తప్పినదో కాదని స్పష్టం చేశారు. వారిని అర్థం చేసుకోవడానికి ఆదేశాలు ఇవ్వడం కాకుండా అర్థవంతమైన చర్చలు జరపాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో ఢిల్లీ వీధుల్లో విద్యార్థుల నిరసనలతో వాతావరణం అత్యంత వేడెక్కిన తరుణంలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. 'విశ్వ మాంగల్య సభ' కార్యక్రమంలో మాట్లాడిన మోహన్ భగవత్ తరాల మధ్య పెరుగుతున్న వ్యత్యాసాన్ని ప్రస్తావించారు. 'మేము యువకులుగా ఉన్నప్పుడు విధేయత చూపించే వాళ్లం. కానీ ఇప్పుడు పరిస్థితులు అలా లేవు. నేటి తరం ప్రశ్నించే తత్వాన్ని కలిగి ఉంది. కాబట్టి మనం వారికి ప్రతి విషయాన్ని కారణాలతో సహా వివరించాల్సి ఉంటుంది. వారిపై ఎనలేని ప్రేమను చూపిస్తూ, వారితో సమయం గడపాలి. కుటుంబాల్లో సంభాషణలు తగ్గిపోతుండటం ఆందోళనకరం. యువత నమ్మకాన్ని గెలవాలంటే హుకుం జారీ చేయడం కాదు, వారితో మాట్లాడాలి. వారికి ఓ ఆత్మీయ భావన కలిగించాలి. ఆదేశాలు జారీ చేయడం కాకుండా చర్చలు జరిపి, ఒక ఏకాభిప్రాయానికి రావడం ముఖ్యం అని భగవత్ పిలుపునిచ్చారు. జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న ఆందోళనల గురించి భగవత్ ప్రత్యక్షంగా ఎలాంటి ప్రస్తావన చేయకపోయినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలు అత్యంత ప్రాధాన్యత సంతరించు కున్నాయి. ఇతర రాష్ట్రాలకు కూడా పాకిన ఈ సీజేపీ నిరసనలపై ఆయన ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. ముఖ్యంగా జూలై 20న పార్లమెంట్ సమీపంలో నిరసనకారులకు, పోలీసులకు మధ్య జరిగిన తీవ్ర ఘర్షణలు ప్రజా ఆగ్రహాన్ని మరింత పెంచాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ.. మోహన్ భగవత్ గారు, జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న పరిణామాలపై గత నెల రోజులుగా మీరు పాటిస్తున్న మౌనం మీ ఉపన్యాసాల కంటే చాలా శక్తివంతంగా ఉందని విమర్శించారు. నీట్ పేపర్ లీక్ నిరసనల మధ్య ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ కీలక వ్యాఖ్యలు చేశారు. కొత్తతరం ప్రతి విషయాన్ని ప్రశ్నిస్తోందని, యువతకు సమాధానం ఇవ్వాల్సిందే అని స్పష్టం చేశారు. కొత్తతరంతో తల్లిదండ్రులు ఎక్కువ సమయం గడిపి వారి సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. ప్రస్తుత సమాజంలో వస్తున్న మార్పు లను, యువత ఆలోచనా విధానాన్ని ప్రత్యే కంగా ప్రస్తావించారు. నేటి కాలంలో ప్రతీది మొబైల్‌లోనే నిక్షిప్తమై ఉందన్నారు. నేటి కుటుంబా ల్లోనూ పరస్పర సంభాషణలు తగ్గిపోతున్నాయిని మోహన్ భగవత్ ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లలతో మరింత ఆప్యాయంగా మెలగాలని, వారి కోసం సమయం కేటాయించి మాట్లాడాలని ఆయన హితవుపలికారు. ప్రస్తుతం కొత్తతరం ప్రతి అంశంపై ప్రశ్నలు లేవనెత్తుతోందని, వారికి కేవలం ఆదేశాలు ఇవ్వడం కాకుండా తగిన కారణాలను వివరించాల్సిన బాధ్యత పెద్దలపై ఉందని అభిప్రాయపడ్డారు. విదేశీ దండయాత్రలు, బ్రిటీష్ పాలన వల్ల భారత ప్రజల ఆలోచనా ధోరణి పూర్తిగా మారిపోయిందని ఆర్ఎస్ఎస్ చీఫ్ అన్నారు. బ్రిటీష్ పాలన వల్ల మన సాంప్రదాయాలు తప్పని, విదేశీ పద్ధతులే సరైనవనే భావన భారతీయుల్లో పెరిగిందని వ్యాఖ్యానించారు. కొత్త సాంకేతిక పరిజ్ఞానానికి భయపడాల్సిన అవసరం లేదన్నారు. టెక్నాలజీని మానవాళి శ్రేయస్సు కోసం వాడుకోవాలని సూచించారు. అపరిమితమైన కోరికలు, భౌతికవాదం సమాజంలో పోటీని, సంఘర్షణలను పెంచుతాయని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ హెచ్చరించారు.

# యువ విజయంపై అభిజిత్ తల్లి అనితా దీప్కే భావోద్వేగం

**పుణె,జులై 25 (నేషనలిస్ట్ వాయిస్):**

యువత విజయంపై కాక్రోచ్ పార్టీ చీఫ్ అభిజిత్ దీప్కే తల్లి అనితా దీప్కే స్పందించారు. భావోద్వేగానికి గురయ్యారు. నా కొడుకు ఉద్యమం మొదలు పెట్టినప్పుడు చాలా భయపడ్డాను. అతనికేమైనా జరుతుందేమోని ఆందోళన చెందాను. అభిజిత్ ను పోలీసులు కొట్టినపుడు మరింత భయమేసింది.. దాదాపు నెల రోజుల ఉద్యమంలో మేం నిద్రపోని రాత్రులు ఎన్నో.. తిండి కూడా సహించేదు కాదు..ఏ క్షణంలో ఏం జరగుతుందోని భయంగుప్పిట్లో బతికామని అనితాదీప్కే మీడియాతో తన అనుభవాన్ని పంచుకున్నారు.

# ఆగస్టు 6 నుంచి14వరకు సిపిఐ పాదయాత్రలు

## -సెప్టెంబర్ 1న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయండిలిపోస్టర్ ఆవిష్కరణ

## -ఖమ్మం జిల్లా సిపిఐ పార్టీ కార్యదర్శి దండి సురేష్

**నేషనలిస్ట్ వాయిస్ //ఖమ్మం బ్యూరో**




ఖమ్మం : ప్రజా సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, సంక్షేమ పథకాల అమలు, పంటలకు గిట్టుబాటు ధర తదితర డిమాండ్లతో ఆగస్టు ఆరు నుంచి 14 వరకు జిల్లా వ్యాప్తంగా పాదయాత్రలు నిర్వహించనున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. శనివారం పాదయాత్రల పోస్టర్లను సిపిఐ -నాయకులతో కలిసి స్థానిక సిపిఐ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ధరల పెరుగుదలతో సామాన్యులు బతకలేని పరిస్థితి ఏర్పడిందని ధరల పెరుగుదలపై ప్రభుత్వం నియంత్రణ ఏర్పాటు చేయాలని సిపిఐ డిమాండ్ చేస్తుందన్నారు. దేశంలో మునుపెన్నడులేని రీతిలో నిరుద్యోగం పెరిగిపోయిందని ఉద్యోగ, ఉపాధి కల్పన రంగాలు వట్టిపోతున్నాయని వాటిని పునరుద్దరించి అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి దొరికేవిధంగా చర్యలు చేపట్టాలని విద్య, వైద్యం వ్యాపారంగా మారిన తరుణంలో ఉచితంగా ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని సిపిఐ కోరుతుందని సురేష్ తెలిపారు. డిలిమిటేషన్తో -సంబంధం లేకుండా మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు చేయాలని, పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని, కార్మిక హక్కులను పరిరక్షించాలని, దళిత, ఆదివాసీలపై జరుగుతున్న దాడులను నిలిపివేయాలని సిపిఐ డిమాండ్ చేస్తుందన్నారు. బ్యాలెట్ పేపర్ పద్దతిలో ఎన్నికలను పునరుద్దరించాలని ఈ పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు సురేష్ తెలిపారు. పోస్టర్ విడుదల కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి, రాష్ట్ర సమితి -సభ్యులు యర్రాబాబు, ఎస్ జానిమియా, ఏపూరి లతాదేవి, మహ్మద్ సలాం, బిజి క్లెమెంట్, జిల్లా కార్యవర్గ -సభ్యులు శింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వరరావు, తోట రామాంజనేయులు, పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, ఏనుగు గాంధీ, జిల్లా సమితి సభ్యులు జ్వాలా నర్సింహారావు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ,పీజీ కళాశాలలో అతిధి అధ్యాపకులను మల్టిజోన్-1 వారినే తీసుకోవాలి

### -ఎస్.ఆర్‌డబి.జి.యన్.ఆర్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ కి విన్నతీ.-చింతల రమేష్ ,ఇటుకల రామకృష్ణ

**నేషనలిస్ట్ వాయిస్ //ఖమ్మం బ్యూరో**



సానుకూలంగా స్పందించిన ప్రిన్సిపల్ మల్టిజోన్- 1 లో ఉన్న వారినే నిబంధనల ప్రకారం భర్తీ చేస్తాం అన్ని హామీ.ఖమ్మం(జూలై 25):ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ డిగ్రీ,పీజీ కళాశాలలో అతిధి అధ్యాపకులను మల్టీ జోన్-1 లో ఉన్న స్థానికులకే అవకాశాలను కల్పించి పోస్టులను భర్తీ చేయాలని ఏ.ఐ.ఎస్.ఎఫ్ జాతీయ నేత ఇటుకల. రామకృష్ణ,ఏ.ఐ.వై.ఎఫ్ జిల్లా నాయకులు చింతల.రమేష్,మధోజు. శ్రావణ్ లు డిమాండ్ చేశారు. ప్రభుత్వ డిగ్రీ,పీజీ కళాశాలలో అతిధి అధ్యాపకులను మల్టిజోన్-1 వారినే తీసుకోవాలనీ ఏ.ఐ.ఎస్.ఎఫ్,ఏ.ఐ.వై.ఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్.ఆర్‌డబి.జి.యన్.ఆర్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ జాకిరుల్లాకి విన్నతీపత్రం ఇవ్వడం జరిగింది. వెంటనే సానుకూలంగా స్పందించిన ప్రిన్సిపల్ మల్టిజోన్- 1 లో ఉన్న స్థానికులను నిబంధనల ప్రకారం భర్తీ చేస్తాం అన్ని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సానుకూలంగా స్పందించిన ప్రిన్సిపల్ గారికి వారు ధన్యవాదాలు తెలుపుతూ మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో నూతనంగా అతిథి అధ్యాపకుల పోస్టులను మల్టీ జోన్-1 లో కాకుండా ఓపెన్ గా భర్తీ చేయడం వల్ల నాన్ లోకల్ వారికి ఉద్యోగాలు రావడం వల్ల స్థానికులు నష్టపోతున్నారని, మల్టీజోన్-1 లో ఉన్న వాటికే నిబంధనల ప్రకారం ఇవ్వడం వల్ల స్థానికులకు ఉద్యోగ అవకాశాలు దొరుకుతాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ.ఐ.ఎస్.ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బుర్ర.మనోజ్,ఏ.ఐ.వై.ఎఫ్ ఖమ్మం నగర నాయకుడు కృష్ణ ప్రసాద్ లు పాల్గొన్నారు.

# జంతర్ మంతర్ ఆందోళనకు ముగింపు

-కేంద్రమంత్రులతో సిజెపి ప్రతిధుల చర్చలు ఫలప్రదం-విద్యార్థులపై దేశవ్యాప్త కేసుల ఎత్తివేతకు అంగీకారం

-భవిష్యత్‌లో ఎలాంటి కేసులతో విద్యార్థులను వేధించమని హామీ

ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు కోటి పరిహారం డిమాండ్

**న్యూఢిల్లీ,జులై 25 (నేషనలిస్ట్ వాయిస్):**

జంతర్ మంతర్ ఆందోళన ముగిసింది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో సిజెపి చేపట్టిన ఆందోళన ముగించారు. కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌లతో తాజా సమావేశం అనంతరం కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ప్రతినిధులు తమ ఆందోళనను విరమిస్తున్నామని ప్రకటించారు. జంతర్‌మంతర్ నుంచి విద్యార్థులు, యువత తిరిగి వెళ్లాలని కోరారు. మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో తమకు తొలి విజయం దక్కిందని అన్నారు. నిరసనల సందర్భంగా విద్యార్థులపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లను ఎత్తేసేందుకు కేంద్రం అంగీకరించిందని అన్నారు. నీట్ పేపర్ లీక్ బాధిత కుటుంబాలకు రూ.1 కోటి పరిమారం ఇవ్వాలన్న డిమాండ్‌కు కేంద్రం సానుకూలంగా స్పందించిందని అన్నారు. తాము ఆశించిన చర్యలను కేంద్రం త్వరిత గతిన తీసుకుంటుందన్న విశ్వాసంతో ఆందోళనను విరమిస్తున్నామని అన్నారు. వ్యవహారానికి బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న ప్రధాన డిమాండ్ నెరవేరడంతోపాటు, మిగతా వాటినీ నెరవేర్చేందుకు కేంద్రం అంగీకరించిన నేపథ్యంలో నిరసనలు విరమిస్తున్నట్లు సీజేపీ ప్రకటించింది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన అనంతరం కేంద్రంతో సీజేపీ నేతలు మరోసారి చర్చలు జరిపారు. అనంతరం కేంద్ర మంత్రులు జేపీ నడ్డాల, జితేంద్ర సింగ్‌తో కలిసి సీజేపీ ప్రతినిధులు మీడియాతో మాట్లాడారు. నిరసనకారులపై నమోదైన కేసులను కొట్టివేయాలని కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు. కేవలం దిల్లీలోనే కాకుండా దేశవ్యాప్తంగా నమోదైన కేసులను కొట్టివేయాలని కోరినట్లు చెప్పారు. నాలుగు రోజుల్లో కేసులు విత్‌డ్రా చేస్తామని కేంద్రం హామీ ఇచ్చింది. భవిష్యత్‌లోనూ కేసులతో వేధించబోమని స్పష్టత ఇచ్చింది. నీట్ లీక్ వల్ల ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు పరిహారం ఇచ్చేందుకు, విద్యావ్యవస్థలో సమూల మార్పులకు కేంద్రం అంగీకరించిందని తెలిపారు. నిరసనకారులపై పెట్టిన కేసులు ఎత్తివేసేందుకు అంగీకరించినట్లు కేంద్ర మంత్రి జేపీ నడ్డా తెలిపారు. దిల్లీ, భాజపా పాలిత రాష్ట్రాల్లో పెట్టిన కేసులను ఎత్తివేస్తామన్నారు. విద్యావ్యవస్థ, పరీక్షల్లో సమూల మార్పులు చేస్తామని ఇప్పటికే చెప్పాం. భవిష్యత్‌లో ఎవరినీ కేసులతో వేధించబోము. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు అండగా ఉంటాం' అని జేపీ నడ్డా మీడియా ఎదుట హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో



ఆందోళన విరమిస్తున్నట్లు సీజేపీ ప్రతినిధులు ప్రకటించారు. ఆందోళనకారులు క్షేమంగా ఇళ్లకు చేరుకోవాలని కోరారు. సీజేపీ ప్రతినిధులతో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్న కేంద్ర మంత్రి జేపీ నడ్డా వారితో సుదీర్ఘంగా చర్చించామని అన్నారు. నీట్ ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై కేసులు ఎత్తేస్తామని చెప్పారు. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు నిబంధనలకు లోబడి పరిహారం ఇస్తామని చెప్పారు. కేంద్ర మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై చేయడంపై సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్పందించారు. జంతర్ మంతర్ వేదికగా ఆయన మాట్లాడుతూ బొద్దింకల సత్తా అందరికీ తెలిసొచ్చిందని అన్నారు. నీట్ పేపర్ లీక్ బాధితులకు న్యాయం దక్కిందని వ్యాఖ్యానించారు. బొద్దింకలు ఒకసారి వస్తే వెళ్లగొట్టడం సాధ్యం కాదని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఇది విద్యార్థుల విజయమని అన్నారు. తమని తాము బాద్షాలుగా భావిస్తున్న వారిని దారిలోకి తేవాల్సిన అవసరం ఉందని అన్నారు. యువత ఓట్లతోనే వారు నేడు అధికారంలో ఉన్నారని అన్నారు. ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని చెప్పారు. పాలకులను అదుపులో ఉంచాల్సిన అవసరం ఉందని కూడా ఉన్నారు. తాము పెట్టిన రెండు డిమాండ్స్ ఇంకా మిగిలే ఉన్నాయని దీప్కే అన్నారు. అవి సాధించేవరకూ ముందుకు సాగుతూనే ఉంటామని అన్నారు.

## ముగిసిన మొదటి విడత టీచర్ల ట్రైనింగ్.

## జిల్లా రిసోర్స్ పర్సన్ ఇటిక్యాల సురేష్ కుమార్

**నేలకొండపల్లి/ నేషనలిస్ట్ వాయిస్**

నేలకొండపల్లి మండల కేంద్రంలో మూడు రోజుల పాటు ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. మూడో రోజు జిల్లా రిసోర్స్ పర్సన్ ఇటిక్యాల సురేష్ కుమార్ గణితం రేమిడిమేషన్ తరగతులు బోధించారు. గణితంలో మరింత పట్టు సాధించేలా వివిధ అంశాల పై ఉపాధ్యాయులకు తరగతులు బోధించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు.. ఎస్ఎల్యం, టీఎల్యం, ఐఎల్యం ల వలన జరిగే ఉపయోగాలను వివరించారు. పాఠశాలలో ప్రతీ రోజు ఒక గంట రిమీడియేషన్ కార్యక్రమం ను తప్పకుండా నిర్వహించాలని సూచించారు. మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు ప్రతీ తరగతి లో ప్రాధాన్యంగా తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాలను ఖచ్చితంగా అమలు చేసి పాఠశాలల బలోపేతం లో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి బీ.చలపతిరావు, ఆర్పీ లు మాదవ్, స్వామి, శ్రీనివాస్, కాంప్లెక్స్ హెచ్ఎం. రమేష్, ఉపాధ్యాయులు టి. వెంగళరావు, తొర్తి సురేష్, రామరావు, తొర్తి గురవయ్య, మారగాని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.





## బోరుకు చేయూత ఇచ్చిన కొండపల్లి ఘనంగా

## కొండపల్లి శ్రీనివాస రావు పుట్టిన రోజు వేడుకలు

**నేషనలిస్ట్ వాయిస్/ఖమ్మం బ్యూరో**

కల్లూరు మండలం పరిధిలో ముగ్గు వెంకటాపురం గ్రామ పంచాయితీ లో పేరువంచ మాజీ ఎంపీటీసీ కొండపల్లి శ్రీనివాస రావు (వాసు) పుట్టిన రోజు సందర్భం గా శనివారం ముగ్గు వెంకటాపురం లో గ్రీన్ ఫీల్డ్ హైవే పక్కన గల ముత్యాలమ్మ తల్లి గుడి వద్ద అలాగే ఆర్ అండ్ బి రోడ్డు వద్ద గల రామాలయం లో బోర్లు వెయ్యడం జరిగింది.ఈ రెండు బోర్లు కలిపి సుమారుగా లక్ష ఇరవై వేల రూపాయిల వాసు సొంత ఖర్చుల తో హ్యాండ్ బోర్లు వేయించడం జరిగింది. ఈ కార్యక్రమం లో ముగ్గు వెంకటాపురం సర్పంచ్ బేబీ స్వరాజ్యలక్ష్మి, సీనియర్ నాయకులు కొండపల్లి రాధాకృష్ణ,నానాజీ,నడికోప్పు నరసింహ రావు, యంగల సురేష్,తాళ్ళూరి సుమన్, మెరుగు వీరబద్రరావు,మెరుగు నరసింహారావు, గుండపనేని నరేష్,పాశం ఉపెంద్ర, పాశం గోపి,గ్రామ పెద్దలు కొండపల్లి అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# నా దీక్షనే అనుమానిస్తారా...?

## కేంద్రంతో లాలూచీ పడతాననుకున్నారా

## విమర్శలపై సోనమ్ వాంగ్‌చుక్ ఘాటు స్పందన

**న్యూఢిల్లీ,జూలై25(నేషనలిస్ట్ వాయిస్):**

దాదాపు 26 రోజుల పాటు నిరాహార దీక్ష చేసిన సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ఇటీవల కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ సమక్షంలో దీక్షను విరమించారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్ నెరవేరక పోయినా తాను ఎందుకు నిరాహార దీక్ష విరమించాల్సి వచ్చిందో తాజాగా సోనమ్ వివరించారు. ప్రభుత్వంతో ఎలాంటి రహస్య ఒప్పందమూ చేసుకోలేదని, నిరసనకారుల భద్రత కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఢిల్లీలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు, యువతపై హింసాత్మక చర్యలు జరిగే అవకాశం ఉందన్న ఆందోళన తనకు కలిగిందని వాంగ్‌చుక్ పేర్కొన్నారు. గతంలో లడఖ్‌లో జరిగిన పోలీసు చర్యల మాదిరిగా పరిస్థితి మార కూడదనే ఉద్దేశంతో ఉపవాసాన్ని ముగించాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. అలాగే, కేంద్ర ప్రభుత్వం నుంచి కొన్ని అంశాలపై లిఖితపూర్వక హామీ లభించిందని ఆయన తెలిపారు. శాంతి యుతంగా నిరసన వ్యక్తం చేసిన వారిపై ప్రతీకార చర్యలు ఉండవని, వారి సమస్యలపై చర్చ కొన సాగుతుందని ప్రభుత్వం హామీ ఇచ్చిందని వాంగ్‌చుక్ పేర్కొన్నారు. అయితే, దీక్ష విరమించడం అంటే ఉద్యమం ముగిసినట్లు కాదని స్పష్టం చేశారు. కాగా, జంతర్ మంతర్‌లో నిరసన చేపడుతున్న సీజేపీ నేతలు మాత్రం తమ ఆందోళన కొనసాగుతుందని ప్రకటించారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు ఉద్యమం ఆగదని వారు వెల్లడించారు. పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ 26 రోజులు చేసిన నిరాహార దీక్షను కేంద్రమంత్రుల సమక్షంలో విరమించిన నేపథ్యంలో.. డీల్ కుదిరిందంటూ ఆయనపై పలువురు విమర్శలు



గుప్పిస్తున్నారు. వీటిని ఆయన తీవ్రంగా ఖండించారు. 'నేను చేసిన దీక్ష ఎంత స్వచ్ఛమైందో నిరూపించు కునేందుకు సర్టిఫికెట్ కావాలా.. అని ప్రశ్నించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో వీడియో విడుదల చేశారు. అలాగే విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకుండానే దీక్ష విర మించడంపైనా స్పందించారు. దీక్ష విరమించినప్పటి నుంచి చాలా మంది నాకు ఫోన్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో పోస్టులు చూపిస్తూ.. మీపై పలు సందేహాలు వస్తు న్నాయని చెప్తున్నారు. కేంద్రమంత్రుల సమక్షంలోనే ఎందుకు దీక్ష విరమించారు..? ఏం ఒప్పందం జరిగింది..? అని అడుగుతున్నారు. నేను నిరాహార దీక్ష ఎంత పవిత్రంగా చేశానో ఎవరి నుంచైనా సర్టిఫికెట్ తీసుకోవాలా..? ఇలా బేరాలు కుదుర్చుకోవాల్సి వస్తే.. ఎవరైనా 26 రోజులు ఆకలితో ఉంటారా..? దిల్లీ ఎండలో రోడ్డు పక్కన కూర్చునే బదులు.. ఏసీ గదిలో కూర్చొని డీల్ చేసుకోలేనా' అని తనపై వస్తోన్న విమర్శలకు వాంగ్‌చుక్ కౌంటర్ ఇచ్చారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనేది కచ్చితంగా ముఖ్యమైన విషయం. అయితే నిరసనకారులపై ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోకుండా నిరోధించడమే నాకు ప్రాధాన్య అంశంగా అనిపించింది. అందుకే కేంద్రంతో చర్చల సమయంలో రాజీనామా గురించి నేను డిమాండ్ చేయలేదు. రాజీనామాను వ్యక్తిగతంగా ప్రస్తా వించాల్సిన అవసరం ఉందని అనుకోవడం లేదు. దీన్ని కేంద్రం పెద్ద విషయంగా భావించడం లేదు. రాజీనామా అంశాన్ని నిరాకరించడం వల్ల అపారనష్టాన్ని చవిచూస్తోంది. దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠ దిగజారుతోంది. ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. రాజీనామా విషయంలో ఎటూ తేల్చకుండా కేంద్రం ఎక్కువ కాలం నాన్చలేదు. కొన్నిరోజుల్లో మంత్రి రాజీనామా సమర్పిస్తారని నాకు తెలుసు. అందుకే ఆ విషయంలో నేను మరీ ఎక్కువ ఒత్తిడి చేయలేదు' అని వాంగ్‌చుక్ వివరించారు. దీక్ష కొనసాగిస్తున్న సమయంలో.. దిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు సోనమ్ వాంగ్‌చుక్‌ను జంతర్‌మంతర్ నుంచి సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి పరిస్థితులపై తాజాగా వాంగ్‌చుక్ స్పందించారు. ఆ ఆసుపత్రి జైలులా అనిపించింది. ఒక ఖైదీ కంటే తీవ్రంగా పరిగణించారు. చుట్టూ ఆంక్షలే. నేను నా గది నుంచి కూడా రాలేకపోయా. ఎవరిని కలవడానికి అనుమతించలేదు. ముగ్గురు బంధువులను మాత్రం నావద్దకు రానిచ్చారు అంటూ వీడియో సందేశంలో పేర్కొన్నారు. ఆయన భార్య గీతాంజలి దిల్లీ హైకోర్టులో పిటిషన్ వేయడంతో.. అక్కడి నుంచి మేదాంత ఆసుపత్రికి తరలించిన విషయం తెలిసిందే.

## ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలి

**నేలకొండపల్లి/ నేషనలిస్ట్ వాయిస్**

ప్రస్తుత పరిస్థితులలో ఆరుతడి పంటలనే సాగు చేసుకోవాలని ఆజయ్ తండా పంచాయతీ సర్పంచ్ తేజావత్ శివాజీ సూచించారు. మండలం లోని ఆజయతండా లో శనివారం రైతులకు అవగాహన సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...వాతావరణం అనుకూలంగా ఉన్న పంటలనే సాగు చేసుకోవాలని అన్నారు. నీటి శాతం తక్కువగా ఉన్నందున్న రైతులు వరిక బదులు ప్రత్యామ్నయ పంటలను వేసుకోవాలన్నారు. ఆరుతడి పంటలైన పెసర, కంది, మినుము ఇతరత్రా పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. ఎల్నినో ప్రభావం ప్రమాధకరంగా మారే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు తెలిపారని పేర్కోన్నారు. కుంటల వలన రైతులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయని అన్నారు. కావునా రైతులు ఈ 'అవకాశం ను వినియోగించుకోవాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితులదృష్ట్యా ప్రత్యామ్నాయ పంటల ను సాగు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీరణాధికారి శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి బైరం దినేష్కుమార్, వార్డు సభ్యులు బాషా, సుశీల, ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులు వెంకటేశ్వర్లు, వీఓ అధ్యక్షురాలు సక్కుబాయి, గ్రామదీపిక కవిత, ఆశా వర్కర్ విజయ తదితరులు. పాల్గొన్నారు.



## అనారోగ్యానికి గురయిన అభిజిత్ దీప్కే

### టైఫాయిడ్ వచ్చిందని స్వయంగా వెల్లడి




**న్యూఢిల్లీ,జూలై25(నేషనలిస్ట్ వాయిస్):**

కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే అనారోగ్యానికి గురయ్యారు. నీట్ పేపర్ లీక్‌పై నెల రోజులుగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన చేపట్టిన ఆయనకు టైఫాయిడ్ వచ్చింది. తనకు టైఫాయిడ్ వచ్చిన విషయాన్ని సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా అభిజీత్ దీప్కే వెల్లడించారు. తనకు టైఫాయిడ్ వచ్చిందని, చికిత్స తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇటీవల వైద్య పరీక్షలు చేయించగా వ్యాధి నిర్ధారణ అయినట్లు చెప్పారు. ప్రస్తుతం రోజుకు రెండుసార్లు ఇంట్రావీనస్ చికిత్స తీసుకుంటున్నట్లు దీప్కే పేర్కొన్నారు. తాను అనారోగ్యానికి గురైనా విద్యా వ్యవస్థలో జవాబుదారీ తనం కోరుతూ చేపట్టిన నిరసన దీక్ష మాత్రం కొనసాగుతుందని చెప్పారు. అలాగే, నీట్ పేపర్ లీక్ ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందేనని అభిజీత్ తన వీడియో సందేశంలో తేల్చి చెప్పారు. మరోవైపు, దీప్కేతో పాటు పలువురు సీజేపీ మద్దతుదారులు, కార్యకర్తలు కూడా అనారోగ్యానికి గురైనట్లు తెలుస్తోంది. 'అందరికీ నమస్కారం. కొన్ని రోజులుగా నా ఆరోగ్యం బాగోలేదని మీ అందరికీ తెలుసు. అందుకే రక్త పరీక్షలు చేయించాను. రిపోర్టుల్లో టైఫాయిడ్ అని నిర్ధారణ అయింది. చికిత్స కొనసాగుతోంది. నాకు ప్రతి ఉదయం, సాయంత్రం ఐవీ డ్రిప్స్ పెడుతున్నారు. దేశవ్యాప్తంగా శాంతియుతంగా నిరసన తెలుపుతున్న బొద్దింకలందరికీ నేను నిజంగా ధన్యవాదాలు చెప్పాలనుకుంటున్నా. మీ వల్లే ఈ ఉద్యమం ఇంత విజయవంతమైంది. మీ అందరికీ చాలా చాలా ధన్యవాదాలు. ఈ ఉద్యమాన్ని ఇంత పెద్ద విజయంగా మార్చినందుకు మీ అందరికీ అభినందనలు. నీట్ పేపర్ లీక్ వివాదంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ చేపట్టిన ఉద్యమం కొనసాగుతుంది' అని అభిజీత్ దీప్కే స్పష్టం చేశారు.


# సామాన్యుడిలా ప్రజల మధ్యే ఉంటా

## -సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నాం-వంటగదిని ఫార్మసీగా, ఆహారాన్ని ఔషధంగా మార్చుకుందాం

## -ఆస్పరిలో సంజీవిని పథకం ప్రారంభించిన సిఎం చంద్రబాబు







**కర్నూలు,జులై 25 (నేషనలిస్ట్ వాయిస్):**

తాను సచివాలయానికే పరిమితం కాకుండా సామాన్యుడిలా ప్రజల మధ్యలోనే ఉంటానని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. కర్నూలు జిల్లాలోని ఆస్పరిలో సీఎం చంద్రబాబు పర్యటించి 'సంజీవని' ఆరోగ్య కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఎన్డీయే ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ పథకాలైన తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత గ్యాస్ సిలిండర్లను క్రమం తప్పకుండా అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. పేదరికాన్ని నిర్మూలించడంతో పాటు నాణ్యమైన విద్య, పౌష్టికాహారాన్ని అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం వారి చేతుల్లోనే ఉందని వ్యాఖ్యా నించిన సీఎం.. వంట గదిని ఫార్మ సీగా, ఆహారాన్ని ఔష ధంగా మార్చు కుంటే ఆసుపత్రుల చుట్టూ తిరిగే అవసరం ఉండదని హితవు పలికారు. సాంకేతికతను జోడిస్తూ 'ఏఐ డాక్టర్' సేవలను అందుబాటులోకి తెచ్చి, ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొ÷ల్‌ను డిజిటలైజ్ చేస్తామని వెల్లడించారు. అలాగే భూ హక్కులకు భద్రత కల్పించేందుకు 'బ్లాక్ చైన్ టెక్నాలజీ'ని వినియోగిస్తున్నట్లు తెలిపారు. కరవు పరిస్థితుల నేపథ్యంలో రైతులు ఆలోచించి పంటలు వేయాలని విజ్ఞప్తి చేస్తూనే, ఆలూరు ప్రాంతంలో తాగునీరు, రోడ్ల సమస్యలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. రాయలసీమ సస్యశ్యామలానికి కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించిన చంద్రబాబు, వేదవతి ప్రాజెక్టును త్వరలోనే పూర్తి చేసి హంద్రీనీవా కాలువ ద్వారా నీటిని తరలిస్తామని హామీ ఇచ్చారు. 2027 మార్చి నాటికి పోలవరం ప్రాజెక్టును, 2028 నాటికి రాయల సీమ స్టీల్ ఫ్యాక్టరీని పూర్తి చేస్తామని స్పష్టమైన గడువు విధిం చారు. గత ప్రభుత్వ హయాంలో ఎలాంటి అభివృద్ధీ జరగలేదని విమ ర్శిస్తూ, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.

# కూటమి ప్రభుత్వం అభివృద్ధిని ఓర్వలేని గొడ్డలిపార్టీ

## -ఎమ్మెల్యే బడేటి చంటి విమర్శలు-ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలకు శంకుస్థాపన

**ఏలూరు,జూలై25(నేషనలిస్ట్ వాయిస్):**

కోటి ఆశలతో కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువచ్చిన ప్రజల కళ్లల్లో ఆనందం చూడడమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి స్పష్టం చేశారు. ముఖ్యంగా వైద్యాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక గొడ్డలి పార్టీ నాయకులు చెబుతున్న గారడీ మాటలు నమ్మవద్దని ఆయన ప్రజలకు హితవు పలికారు. జాతీయ ఆరోగ్య మిషన్ నిధులతో ఏలూరు 22వ డివిజన్ సత్రంపాడు ఎం ఆర్ సి కాలనీలో, 25వ డివిజన్ శనివారపుపేట కొత్త ఎన్టీఆర్ కాలనీ లో , 6వ డివిజన్ మాదేపల్లి ఇందిరమ్మ కాలనీ ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ వద్ద మూడు కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ నిర్మాణ పనులకు సంబంధించిన శిలాఫలకాలను ఎమ్మెల్యే బడేటి చంటి, మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు ఆవిష్కరించారు. స్థానికులతో కొబ్బరికాయలు కొట్టించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ ఈ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉండగా జరుగుతున్న అభివృద్ధిని ప్రజలకు తెలిసే విధంగా శంకుస్థాపన శిలాఫలకాలను వారి ఆధ్వర్యంలో ఆవిష్కరించడం జరిగిందన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉంచాలన్న ఏకైక లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు సీఎంఆర్ఎఫ్, ఎన్టీఆర్ వైద్య సేవలకు అధిక ప్రాధాన్యత ఇస్తూనే, ఆరోగ్య మందిర్లను నిర్మించి ప్రజలకు ఆరోగ్యం పట్ల మరింత ధీమాను కలిగిస్తున్నారని పేర్కొన్నారు. కూటమి నాయకులు ప్రజా సంక్షేమానికి అంకితమై వారి సమస్యల పరిష్కారానికి అహర్నిశలు పాటు పడుతున్నారని ఎమ్మెల్యే బడేటి చంటి కొనియాడారు. కూటమి సంక్షేమ పాలనతో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్న సమయంలో తమ ఉనికిని కాపాడుకునేందుకు వైసీపీ నాయకులు లేనిపోని రాద్ధాంతాలు చేస్తూ అలజడి సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నిలబెట్టుకుంటూ, ప్రజల సమక్షంలోనే వారి సమస్యలకు పరిష్కారం చూపుతూ ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. దీన్ని చూసి ఓర్వలేక గొడ్డలి పార్టీ నాయకులు గారడీ మాటలు చెప్పి ప్రజలను మభ్య పెట్టాలని చూస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. వారి గారడీ మాటలువినిమోసపోవద్దని, నిరంతరంఅభివృద్ధితోపాటు ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న కూటమికి ప్రతి ఒక్కరు అండగా నిలవాలని ఎమ్మెల్యే కోరారు.నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు మాట్లాడుతూ, మూడు ప్రాంతాల్లో ఒక్కొక్కచోట కోటి రూపాయల వ్యయంతో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేస్తామని చెప్పారు.. ఎమ్మెల్యే బడేటి చంటి ఆధ్వర్యంలో ఏలూరు నగరంలో 80 కోట్ల రూపాయలతో రోడ్లు, డ్రైన్లు, వీధిలైట్ల ఏర్పాటు వంటి అంశాలకు శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు . కొన్ని ఇబ్బందుల కారణంగా నగర ప్రజలకు ఒంటి పూట మంచినీటిని సరఫరా చేస్తున్నామని, త్వరలోనే రెండుపూట్లా సమృద్ధిగా నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారథి, ఈడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, కో ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, టిడిపి నగర సెక్రటరీ రెడ్డి నాగరాజు, కూటమి నాయకులు,

# చిత్తూరు జడ్పీ సమావేశంలో వాగ్వాదం పరస్పర విమర్శలతో దద్దరిల్లిన సమావేశం

**చిత్తూరు,జూలై25(నేషనలిస్ట్ వాయిస్):**

చిత్తూరు జిల్లా పరిషత్ చివరి సర్వసభ్య సమావేశం శనివారం తీవ్ర ఉద్రిక్తతల మధ్య సాగింది. అరుపులు, కేకలు వాగ్వివాదాలతో సమావేశం దద్దరిల్లింది. ఒక్కసారిగా జడ్పిటిసి సభ్యులు ఎమ్మెల్యేలను చుట్టుముట్టారు. సవాళ్లు ప్రతి సవాళ్లతో సమావేశం రసాభాసగా మారింది. పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్, పలువురు జడ్పీటీసీ సభ్యుల మధ్య సచివాలయాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలపై తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ జోక్యం చేసుకుని సభ్యులను శాంతింపజేశారు. అనంతరం సమావేశం యథావిధిగా కొనసాగింది. చిత్తూరు జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలోని ఎన్టీఆర్ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా పరిషత్ సీఈవో రవికుమార్ నాయుడు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు, తిరుపతి ఎమ్మెల్యే జంగాలపల్లి శ్రీనివాసులు, పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్, జడ్పీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. వైద్య ఆరోగ్య శాఖపై చర్చ సందర్భంగా నగరి మండలం బీఎన్ఆర్‌పేటలో విలేజ్ హెల్త్ క్లినిక్‌ను స్మశానం సమీపంలో నిర్మిస్తున్నారని, ప్రజలకు అనువైన ప్రదేశంలో భవనం నిర్మించాలని ఒక సభ్యుడు కోరారు. దీనిపై స్పందించిన పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ గత ప్రభుత్వం సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు ప్రజల సౌకర్యాన్ని పక్కనపెట్టి ఇష్టానుసారంగా నిర్మించిందని విమర్శించారు. అవసరమైతే ఈ నిర్మాణాలపై కమిటీ ఏర్పాటు చేసి ప్రజాభిప్రాయాన్ని సేకరించేందుకు సిద్ధమని, కమిటీకి అధ్యక్షుడిగా ఉండి నివేదిక అందిచాలని సవాల్ విసిరారు. వ్యక్తిగత విమర్శలకు తావివ్వకుండా ప్రజా సమస్యలపై అర్థవంతమైన చర్చ జరగాలని సభ్యులకు సూచించారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలపై పలువురు జడ్పీటీసీ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆయన సీటు వద్దకు వెళ్లడంతో సభలో ఉద్రిక్తత నెలకొంది. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాలు ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నాయని, వాటిని రాజకీయ కోణంలో విమర్శించడం సరికాదని సభ్యులు వాదించారు. దీంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం కొనసాగి సమావేశం కొంతసేపు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ జోక్యం చేసుకుని సభ్యులను శాంతింపజేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 118 విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణానికి సుమారు రూ.15 కోట్లు మంజూరయ్యాయని, ఇప్పటికే 80 శాతం పనులు పూర్తయ్యాయని, ఏడు భవనాలను ప్రారంభించామని తెలిపారు. ప్రజలకు అవసరమైన చోటే మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, పెండింగ్‌లో ఉన్న నిర్మాణాలను కూడా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. మావేశంలో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు తెలుగుదేశం పార్టీ సిద్ధంగా ఉందని, శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. ప్రజా తీర్పుతో మళ్లీ ప్రజాప్రతినిధులు ఎన్నికై జిల్లా పరిషత్‌లో అడుగుపెట్టాలని వ్యాఖ్యానించారు. సమావేశం ప్రారంభంలో జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల నిధుల విడుదలలో జాప్యం చేస్తోందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. 5వ ఆర్థిక సంఘం చివరి విడత నిధులతో పాటు 16వ ఆర్థిక సంఘం తొలి విడత నిధులు కూడా విడుదల కాలేదన్నారు. స్థానిక సంస్థల నిధులను ఇతర ప్రాంతాల అభివృద్ధి పనులకు మళ్లించడం సరికాదని, జిల్లా పరిషత్ పరిధిలో ప్రజాప్రతినిధులు ప్రతిపాదించిన పనులను ప్రారంభం కాలేదనే కారణంతో రద్దు చేయాలని ప్రభుత్వం ఆదేశించడం సమంజసం కాదన్నారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ ఇప్పటికే ప్రారంభమైన పనులను సక్రమంగా నమోదు చేసి రద్దు కాకుండా చూడాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ÷-యవసాయ శాఖపై చర్చ సందర్భంగా పలువురు సభ్యులు వేరుశనగ విత్తనాల సరఫరాలో తీవ్ర లోపాలు ఉన్నాయని, పంపిణీ చేసిన విత్తనాలు నాసిరకంగా ఉండడంతో రైతులు నష్టపోతున్నారని ఆరోపించారు. జిల్లా పరిషత్ చైర్మన్ కూడా విత్తనాల్లో నాణ్యత లోపించిందని పేర్కొన్నారు. దీనిపై జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళి స్పందిస్తూ ఫిర్యాదులు అందిన వెంటనే సంబంధిత విత్తనాల సరఫరాను నిలిపివేశామని, రైతుల నుంచి పూర్తి వివరాలు అందితే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో వ్యవసాయ, ఉద్యానవన, విద్య, వైద్య ఆరోగ్య, గ్రామీణ తాగునీటి సరఫరా, గృహ నిర్మాణం, విద్యుత్, పంచాయతీరాజ్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, జిల్లా నీటి నిర్వహణ సంస్థ, మహిళా శిశు సంక్షేమ శాఖలకు చెందిన అధికారులు పాల్గొని సభ్యుల ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. సమావేశం చివర్లో పలు అభివృద్ధి పనులపై తీర్మానాలను ఆమోదించారు.

# హౌజింగ్ కార్పోరేషన్ కీలక నిర్ణయం

## మూడు రోజుల గ్రాస్ సాలరీ వసూలు నిలిపివేత

**అమరావతి,జులై 25 (నేషనలిస్ట్ వాయిస్):**

ఆంధ్రప్రదేశ్ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ కీలక నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. ఉద్యోగుల సంక్షేమ కార్యక్రమాల కోసం మూడు రోజుల గ్రాస్ శాలరీని వసూలు చేయాలంటూ జారీ చేసిన ఉత్తర్వులను సంస్థ యాజమాన్యం పూర్తిగా రద్దు చేసింది. ఈ మేరకు జులై 16న జారీ చేసిన మెమోను రద్దు చేస్తూ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పి. అరుణ్ బాబు తాజా ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగుల ముందస్తు అనుమతి లేకుండానే జీతం కోత ప్రతిపాదించడం సరైంది కాదని గుర్తించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మెమోలో పేర్కొన్నారు. అలాగే, మూడు రోజుల జీతాన్ని ఉద్యోగుల సంక్షేమ నిధికి జమ చేయాలన్న ఆదేశాలు పూర్తిగా రద్దు చేసినట్లు స్పష్టం చేశారు. జీతం కోతకు సంబంధించిన అన్ని ఉత్తర్వులు తక్షణమే అమలు కాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా హౌసింగ్ అధికారులకు ఎండీ ఆదేశాలు జారీ చేశారు. తాజా ఉత్తర్వుల మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు ఎండీ పి. అరుణ్ బాబు ఆదేశాలు జారీ చేశారు.


# డిఎస్సీపై వైసిపి పదేపదే అసత్య ఆరోపణలు

## మండిపడ్డ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

## ఆర్టీసిని ప్రైవేట్ పరం చేయబోమని హామీ

**విశాఖపట్నం,జులై 25 (నేషనలిస్ట్ వాయిస్):**

ఏపీలో డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్న ఆరోపణలపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి నారా లోకేశ్‌పై వైసీపీ చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవని మంత్రి మండిపడ్డారు. వైసీపీకి ఆరోపణలు చేయడం తప్ప ఆధారాలు చూపించే అలవాటు లేదని విమర్శించారు. తాడేపల్లిలో జగన్ ఇంటి సమీపంలోనే ఉండి లోకేశ్ డీఎస్సీపై సవాల్ విసిరారని, దానిపై స్పందించేందుకు జగన్ ఎందుకు ముందుకు రాలేదని ప్రశ్నించారు. డీఎస్సీ నియామకాలపై ఎలాంటి అనుమానాలు ఉన్నా చట్టబద్ధంగా విచారణకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రభుత్వం నుంచి అధికారికంగా వివరాలు ఇచ్చినప్పటికీ వైసీపీ రాజకీయ దివాళాకోరుతనంతో విమర్శలు చేస్తోందని మంత్రి మండిపల్లి అన్నారు. తప్పుడు ప్రచారాలతో యువతను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను వెంటనే మానుకోవాలని సూచించారు. నిరాధార ఆరోపణలతో ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీయడమే వైసీపీ లక్ష్యమని ఆరోపించారు. డీఎస్సీ నియామకాలు చేపట్టలేని వారు రాజకీయ రంగు పులిమి విమర్శలు చేయడం సరికాదని, ప్రజా సమస్యలపై చర్చించకుండా తప్పుడు ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఉన్నంతవరకు ఏపీఎస్ఆర్టీసీని ప్రైవేటుపరం చేయబోమని.. అపోహలకు తావు లేదని రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి స్పష్టం చేశారు. విశాఖలో సింహపురి ఈ-బస్సు డిపో పవర్ రూమ్‌ను మంత్రి ప్రారంభించారు. రవాణా రంగంలో పీఎం ఈ-బస్ సేవతో నూతనశకం మొదలైందన్నారు. మరో రెండు నెలల్లో తొలి దశలో 750 ఈ-బస్సులు రానున్నాయని, అందులో విశాఖకు 100 బస్సులు కేటాయించనున్నట్టు చెప్పారు. ప్రస్తుత బస్సులతో పాటు, కొత్త ఈ- బస్సులతో ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలందిస్తామన్నారు. పర్యావరణ హిత, ఆధునిక ప్రజారవాణా వ్యవస్థ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు.



# ఏపిలో ఓటర్ల సంఖ్య 4,16,27,694గా నమోదు

## రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్ వెల్లడి

**అమరావతి,జులై 25 (నేషనలిస్ట్ వాయిస్):**

ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం ఓటర్ల సంఖ్య 4,16,27,694గా నమోదైందని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్ వెల్లడించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ(సర్) పక్రియలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఓటర్ల వివరాలను ఆయన అధికారికంగా ప్రకటించారు. అత్యధికంగా 44,89,488 మంది ఓటర్లకు సరైన అడ్రస్ లేదని సీఈఓ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 15,22,174 మంది ఓటర్లు మరణించినట్లు వెల్లడించారు. అలాగే, 14,43,886 మంది ఓటర్లు మరో చోటుకు బదిలీ అయ్యారని, ఇతర ప్రాంతాల్లో కొత్తగా నమోదైన ఓటర్ల సంఖ్య 7,37,216 గా ఉందన్నారు. ఆచూకీ లభించని ఓటర్ల సంఖ్య 7,77,885 గా తేలిందని సీఈఓ తెలిపారు. అలాగే ఇతర కేటగిరీల కింద మరో 8,327 మంది ఓటర్లు ఉన్నారని వివేక్ యాదవ్ వివరించారు. అర్హులైన వారు మళ్లీ ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం మరో అవకాశాన్ని కల్పిస్తోందన్నారు. ఈ నెల 31 నుంచి ఆగస్టు 30 వరకు సరైన డాక్యుమెంట్లను చూపించి, మరలా ఓటర్‌గా నమోదు చేసుకునేందుకు అవకాశం ఇస్తున్నట్లు సీఈఓ వివేక్ యాదవ్ ప్రకటించారు.

# డిజిటల్ రీ-సర్వేతో భూ వివాదాలకు చెక్

## డీ-పాపులేషన్ హుసేన్‌పూర్ గ్రామం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి శ్రీకారం

## రైతులు పాస్‌బుక్, టైటిల్ డీడ్, ఆధార్‌తో హాజరు కావాలి: సర్వే శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణ

**తూప్రాన్, జూలై 25. నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి:**



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న డిజిటల్ భూ రీ-సర్వే కార్యక్రమాన్ని మెదక్ జిల్లా తూప్రాన్ మండలంలోని డీ-పాపులేషన్ గ్రామమైన హుసేన్‌పూర్ నుంచి ప్రారంభిస్తున్నట్లు సర్వే శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణ తెలిపారు. ఈ సర్వే ద్వారా భూముల హద్దులను శాశ్వతంగా నిర్ణయించి, భవిష్యత్తులో భూ వివాదాలకు పూర్తిగా అడ్డుకట్ట వేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. శనివారం తూప్రాన్‌లో రైతులతో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. హుసేన్‌పూర్ గ్రామంలో మొత్తం 33 సర్వే నంబర్లు ఉండగా, 399 మంది రైతుల ఖాతాలు ఉన్నాయని తెలిపారు. ప్రతి రోజు 30 నుంచి 40 ఎకరాల వరకు డిజిటల్ సర్వే చేపడతామని చెప్పారు. భూమి ఉన్నప్పటికీ రికార్డుల్లో లేకపోవడం, పాత సర్వే వివరాల్లో వ్యత్యాసాలు, ఆన్‌లైన్ రికార్డుల్లో పేర్లు లేకపోవడం వంటి సమస్యలకు డిజిటల్ రీ-సర్వేనే శాశ్వత పరిష్కారమని ఆయన వివరించారు. నకిలీ పత్రాలు, తప్పుడు భూ హక్కుల నమోదులను కూడా ఈ ప్రక్రియ ద్వారా గుర్తించి తొలగిస్తామని స్పష్టం చేశారు.ముందుగా గ్రామ సరిహద్దులను గుర్తించి ప్రభుత్వ భూములను గుర్తిస్తామని, అనంతరం వక్ఫ్ బోర్డు భూములు, ఇనాం భూములు, దేవాదాయ భూములు తదితర వాటికి ప్రత్యేకంగా హద్దులు నిర్ణయిస్తామని తెలిపారు. డిజిటల్ సర్వే పూర్తయిన తర్వాత ప్రతి భూమికి ప్రత్యేక యూనిక్ ల్యాండ్ నంబర్ (ఖూచీ) కేటాయించి యాజమాన్య ధ్రువీకరణ పత్రం అందజేస్తామని చెప్పారు. రైతులు ఎక్కడ ఉన్నా మొబైల్ ఫోన్‌లోనే తమ భూమి వివరాలు, గూగుల్ మ్యాప్‌లో స్థానం పరిశీలించుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. బ్యాంకు రుణాలు, క్రయవిక్రయాల సమయంలో పాత పత్రాల అవసరం లేకుండా భూ నంబర్ ద్వారా అన్ని వివరాలు అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు.రైతులు పట్టాదారు పాస్‌బుక్, టైటిల్ డీడ్, ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. చిన్న, సన్నకారు, మధ్యతరహా, పెద్ద రైతులు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ సర్వేలో పాల్గొనాలని కోరారు. క్షేత్ర స్థాయిలో ప్రతి సెంటు భూమిని పరిశీలించి, ఎలాంటి భూ వ్యత్యాసాలు ఉన్నా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. "వందేళ్ల క్రితమే భూముల హద్దులు నిర్ణయించబడ్డాయి. భూమి మారలేదు... మనుషులే మారారు. అందుకే పాత నక్షాల ఆధారంగా డిజిటల్ రీ-సర్వే నిర్వహించి శాశ్వత సరిహద్దులు నిర్ణయిస్తాం" అని కృష్ణ అన్నారు. ఈ సమావేశంలో తూప్రాన్ ఆర్డీవో భవయ్య, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, డీఐ అనిల్, మండల సర్వేయర్ నర్సింగ్‌రావు, ఆర్ఐ ప్రేమ్ కుమార్, రెవెన్యూ సిబ్బంది, రైతులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మల్కాపూర్‌లో ఘనంగా వన మహోత్సవం

## చనిగే చెరువు కట్టపై ఈత మొక్కల నాటకం -- ప్రతి మొక్కను సంరక్షించాలని పిలుపు

**తూప్రాన్, జూలై 25 (నేషనలిస్ట్ వాయిస్):**

తూప్రాన్ మండలం మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో శనివారం వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సమీపంలోని చనిగే చెరువు కట్టపై ఎక్సైజ్ ఎస్ఐ ఎండి అజీజ్ అహ్మద్‌తో కలిసి గ్రామ సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ ఈత మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతో పాటు భవిష్యత్ తరాలకు సహజ వనరులను అందించాలంటే ఈత మొక్కల పెంపకం ఎంతో అవసరమని అన్నారు. సహజ సిద్ధంగా లభించే ఈత కల్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యతను గౌడ కులస్తులు స్వచ్ఛందంగా తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షిస్తే పచ్చదనంతో కూడిన గ్రామాల నిర్మాణం సాధ్యమవుతుందన్నారు.ఈ కార్య క్రమంలో పంచాయతీ కార్యదర్శి మహేశ్వరి, ఉప సర్పంచ్ స్వామి, పీఏసీఎస్ డైరెక్టర్ గోపి నాయక్, ఫీల్డ్ అసిస్టెంట్ కనకరాజు, పాలకవర్గ సభ్యులు, గౌడ కులస్తులు, గ్రామస్తులు పాల్గొని మొక్కలు నాటి వన సంరక్షణకు తమ వంతు బాధ్యతను నిర్వర్తించారు.





# జిల్లాలో విష జ్వరాలకు ఇద్దరు చిన్నారుల మృతి

**జగిత్యాల,జూలై25(నేషనలిస్ట్ వాయిస్):**

జిల్లాలోని పొరండ్ల గ్రామంలో విషజ్వరాలు ఆందోళన కలిగిస్తున్నాయి. గ్రామంలో విషజ్వరాల బారిన పడి ఇద్దరు చిన్నారులు మృతి చెందడం స్థానికంగా విషాదాన్ని నింపింది. విషజ్వరంతో బాధపడుతున్న హరిస్మిత(6) అనే చిన్నారి.. చికిత్స పొందుతూ మృతి చెందింది. శుక్రవారం వరుణ్ తేజ(6) అనే చిన్నారి కూడా విషజ్వరం బారిన పడి ప్రాణాలు కోల్పోయాడు. వైరల్ ఫీవర్ కారణంగానే చిన్నారులు మరణించినట్లు వైద్యులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఇద్దరు చిన్నారుల మృతితో వైద్యారోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. పొరండ్ల గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. వైద్య సిబ్బంది గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. జ్వరం, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు ఉంటే వెంటనే ఆస్పత్రికి వెళ్లాలని వైద్య సిబ్బంది సూచిస్తున్నారు. జిల్లాలో పరిస్థితిపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

# ఎలినినో ప్రభావాన్ని తగ్గిద్దాం.. పశుసంపదను రక్షిద్దాం

**నేషనలిస్ట్ వాయిస్ /ఖమ్మం రూరల్**



ఎదులాపురం గ్రామ సెంటర్ లో ఈరోజు ఎల్ నినో వల్ల పశువులకు వచ్చే సమస్యలను తగ్గించడానికి (4) ముఖ్యమైన చర్యలు........ చెప్పారు 1.నీటి నిర్వహ-పశువులకు శుభ్రమైన, చల్లని నీరు ఎప్పటికప్పుడు అందించాలి. రోజుకు 3-4 సార్లు నీరు ఇవ్వాలినీటి వృధాను నివారించాలి వర్షపు నీటిని సేకరించి నిల్వ చేసుకోవాలిచెరువు, కుంటలు, తొట్లు శుభ్రంగా ఉంచాలిగమని నీటి కొరత వల్ల పాలు 20-30% వరకు తగ్గిపోతాయి 2. ఉష్ణ ఒత్తిడి నివారణ చర్యలుపైకప్పు మీద గడ్డి, తాటి ఆకులు లేదా తెల్ల రంగు పెయింట్ వేయాలిగీడ చెట్టు పెంచాలి పశువులను మధ్యాహ్నం 11 గం - 4 గం మధ్య వేడి సమయంలో బయటకు తోలవద్దు పశువుల శరీరాన్ని చల్లబరచాలిఫ్యాన్లు, మిస్ట్ స్ప్రేలు ఉపయోగించవచ్చుఉష్ణ ఒత్తిడి తగ్గితే పాలు, పెరుగుదల మెరుగుపడుతుంది 3. ఉత్పత్తి & పునరుత్పత్తి నిర్వహణగర్భధారణ ఉన్న పశువులకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి దిగుబడి తగ్గకుండా సమతుల్య పోషణ ఇవ్వాలిఎలినో వల్ల వచ్చే సమస్యలు: లిఉష్ణోగ్రత పెరగడం, వర్షపాతం తగ్గడం, నీటి కొరత, మేత లభ్యత తగ్గడం, వ్యాధులు వ్యాప్తి4. సాధారణ జాగ్రత్తలుఉష్ణోగ్రత పెరిగినప్పుడు పశువులను నీడలో ఉంచండిఆహారంనీరు ఎప్పుడూ అందుబాటులో ఉండేలా చూడండిమేత నిల్వ ఉంచి ప్రణాళిక చేయండి గోదాములు, పరిసరాలు శుభ్రంగా ఉంచండివెటర్నరీ సహాయం తీసుకుంటూ ఉండండి: "సమయానికి సరైన చర్యలు తీసుకుంటే పశువులను ఆరోగ్యంగా ఉంచి, నష్టాలను తగ్గించవచ్చు". ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు పాడి రైతులకు అవగాహన కలిగించడం జరిగింది . ఈ కార్యక్రమంలో ఖమ్మం రూరల్ వెటర్నరీ డాక్టర్ హరీష్ రావు వ్యవసాయ శాఖ ఏఈఓ. 30, 31, 32,వార్డు కౌన్సిలర్లు దండి శ్రీజ, ఊరడి హైమావతి,మామిళ్ల శ్రీనాథ్ రెడ్డి,రైతులు మొదలగు వారు పాల్గొన్నారు

# కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ...

## కాంగ్రెస్ పార్టీ విజయమే.

**నేలకొండపల్లి / నేషనలిస్ట్ వాయిస్**



గత కొద్ది రోజులు గా నీట్ పేపర్ లీకేజ్ వ్యవహారం పై అటు విద్యార్థులు,ఇటు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న పోరాటం ఫలితంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారని పాలేరు డివిజన్ కాంగ్రెస్ నాయకులు రావెళ్ళ కృష్ణారావు పేర్కొన్నారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.... ఢిల్లీలో మొదలైన ఉద్యమం దేశ వ్యాప్తంగా నిరసనలకు కారణం అయిందన్నారు. నీట్ పేపర్ లీకేజ్ వ్యవహారంలో ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ కేంద్రం లో అధికారంలో ఉన్న బీజేపీ తీరుపై ధర్నా చేపడితే వారిని అరెస్టుతో... దీనిపై దేశ వ్యాప్తంగా ధర్నాలు, నిరసనలు వెల్లువెత్తాయన్నారు.దీంతో కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున చేపట్టిన ఆందోళనల కారణం గా కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయడం కాంగ్రెస్ పార్టీ విజయమన్నారు. ఇప్పటికైనా బీజేపీ కి కనువిప్పు కలగాలని సూచించారు. కేంద్ర మంత్రి రాజీనామాతో పాటు ఇతర డిమాండ్ల కూడా వెంటనే కేంద్రం అమలు చేయాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ మరింత ఉద్యమాలను హెచ్చరించారు. ఈ ఉద్యమ కు సంఘీభావం తెలిపిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. కేంద్రం అవలంబిస్తున్న ప్రజా విద్యార్థి, యువజన,కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు నడుం బిగించాలని పిలుపునిచ్చారు.

# భీమా చేయండి.. ధీమాగా ఉండండి

## -1000లతో భవిష్యత్తుకు కొండంత భరోసా..

## -ప్రమాదంలో కాలు కోల్పోయిన రైతు కుటుంబానికి 10 లక్షల పరిహారం -బ్యాంకు మేనేజర్ శివ కిరణ్

**నేషనలిస్ట్ వాయిస్ //ఖమ్మం రూరల్**






ఖమ్మం రూరల్ :--జీవితంలో ఎప్పుడు ఏం జరుగుతుందో ఎవరూ ఊహించలేరు. అనుకోకుండా వచ్చే ఆపదలు కుటుంబాలను ఆర్థికంగా తీవ్రంగా దెబ్బతీస్తాయి. కానీ, ముందుచూపుతో తీసుకునే చిన్న నిర్ణయం అలాంటి కష్టసమయం లో కొండంత అండగా నిలుస్తుంది. ఇందుకు నిదర్శనమే ఖమ్మం రూరల్ మండలం లో జరిగిన ఈ ఘటన.ఏం జరిగింది?ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్లు గ్రామానికి చెందిన జటంగిపేందర్ అనే వ్యక్తి ఏదులా పురం మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద తండ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ (ɹ+డీ) లో రూ.1000 ప్లాన్తో కూడిన ఎస్బీఐ జనరల్ ఇన్సూరెన్స్ (ఆడీ× +ఐఅవతీఖఙఈ ×అంబుఖఅఎఏ) పథకంలో చేరాడు.ఇన్సూరెన్స్ తీసుకున్న కొంతకాలానికే ఉపేందర్ దురదృష్టవశాత్తు ఒక రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఈ ప్రమాదంలో అతనికి తీవ్రగాయాలై, వైద్యుల సూచన మేరకు కుడికాలును పూర్తిగా తొలగించాల్సి వచ్చింది. అండగా నిలిచిన బ్యాంకు భీమా: ?10 లక్షల క్లైమ్‌కాలు కోల్పోయి, భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్న ఆ కుటుంబానికి ఆయన కట్టిన రూ.1000 ఇన్సూరెన్స్ కొండంత ధైర్యాన్ని ఇచ్చింది. బ్యాంక్ అధికారుల చొరవతో వెంటనే ఇన్సూరెన్స్ ప్రక్రియను పూర్తి చేయగా, బాధితుడికి ?10 లక్షల ఇన్సూరెన్స్ క్లైమ్ మంజూరైంది. కేవలం వెయ్యి రూపాయలతో పొందిన ఈ భీమా పథకం, ఉపేందర్ కుటుంబానికి ఆర్థికంగా పెద్ద ఆసరాగా నిలిచింది.మన కట్టే చిన్న మొత్తమే ఆపద సమయంలో మన కుటుంబానికి రూ.లక్షల భరోసానిస్తుంది. ప్రతీ ఒక్కరూ బ్యాంకుల్లో అందుబాటులో ఉన్న ఇన్సూరెన్స్ పథకాలను వినియోగించుకుని భవిష్యత్తుకు ధీమాగా నిలవాలి."శివ కిరణ్ (బ్యాంక్ మేనేజర్, పెద్దతండ) కార్యక్రమంలో పాల్గొన్న అధికారులుబాధితుడికి క్లైమ్ అందజేసి, గ్రామీణులకు భీమాపై అవగాహన కల్పించిన ఈ కార్యక్రమంలో: ఖమ్మం రీజినల్ మేనేజర్ ఐరిష్ ఛానల్ మేనేజర్ మధు పెద్దతండ ɹ+డీ మేనేజర్ శివ కిరణ్ బ్యాంక్ సిబ్బంది, బ్యాంక్ ɹత్రలు మరియు పొన్నెకల్లు గ్రామస్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.ప్రజలందరికీ విజ్ఞప్తి.. మీరు తెలుసుకోవాల్సిన నిజం!చాలామంది "మనకేం కాదులే" అనే నిర్లక్ష్యంతో ఇన్సూరెన్స్ పథకాలను పక్కన పెడుతుంటారు. కానీ ప్రమాదాలు చెప్పి రావు! లి చిన్న పెట్టుబడి - పెద్ద భద్రత: రోజుకు రెండు రూపాయలు కూడా పడని చిన్న మొత్తంతో రూ.లక్షల భీమా రక్షణ లభిస్తుంది. కుటుంబానికి ఆర్థిక రక్షణ: ఇంటి పెద్దకు ప్రమాదం జరిగినా లేదా అంగవైకల్యం వచ్చినా కుటుంబం రోడ్డున పడకుండా ఈ డబ్బులు కాపాడతాయి. బ్యాంకుల్లో సులువైన ప్రాసెస్: రూపాయి ఖర్చు లేకుండా మీ ఖాతా ఉన్న బ్యాంకుల్లోనే ఈ ఇన్సూరెన్స్ సౌకర్యం లభిస్తుంది.ఆలోచించండి.. ఆచరించండి!కాలయాపన చేయకుండా వెంటనే మీ సమీపంలో ఉన్న గ్రామీణ బ్యాంక్ లేదా ఇతర బ్యాంకులకు వెళ్లండి. అందుబాటులో ఉన్న ఇన్సూరెన్స్ పథకాల్లో చేరండి. మీ భవిష్యత్తుకు, మీ కుటుంబ నవ్వులకు భరోసానివ్వండి!

# ఢిల్లీ హింసపై విచారణ జరిపించాలి

## నిరంకుశ ప్రభుత్వంపై యువత సాధించిన విజయం

## సిపిఐ జాతీయ నేత బాగం హేమంతరావు



ఖమ్మం : నిరంకుశ ప్రభుత్వంపై యువత, విద్యార్థులు పోరాడి విజయం సాధించారని కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా బిజెపి ప్రభుత్వానికి ఒక గుణపాఠమని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా నేపథ్యంలో శనివారం హేమంతరావు ఒక ప్రకటన విడుదల చేశారు. లక్షలాది మంది జీవితాలతో చెలగాట మాడటమే కాకుండా 21 మంది ప్రాణాలు పోయేందుకు కారణమైన నీట్ పేపర్ లీకేజ్ -విషయంలో కేంద్ర ప్రభుత్వం మరింత పారదర్శకంగా వ్యవహరించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ లోపాలను కప్పి పుచ్చుకునేందుకు బిజెపి అనుబంధ సంస్థలు అనేక ప్రయత్నాలు చేశాయని మత భావాలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నం చేశారని హింస ద్వారా విద్యార్థి యువజన ఉద్యమాన్ని అణిచి వేయడానికి ప్రయత్నించారని ఆయన ఆరోపించారు. ఇటువంటి పరిస్థితుల్లో గుండె నిబ్బరంతో శాంతియుతంగా యువజన విద్యార్థులు ఢిల్లీలో ప్రదర్శన నిర్వహించి ఏకపక్షంగా వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వ మెడలు వంచారని హేమంతరావు తెలిపారు. ఇది యువత, విద్యార్థులు సాగించిన పోరాటం భవిష్యత్తు తరాలకు - స్ఫూర్తిదాయకమన్నారు. ఇప్పటికైనా మోదీ, అమిత్ ప్రభుత్వం ఇచ్చిన అధికారాన్ని ప్రజల కోసమే ఉపయోగించాలని ఆయన సూచించారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ ఆందోళన వద్ద పోలీసులు అత్యంత పాశవికంగా వ్యవహరించారని ఇందులో ఆర్ఎస్ఎస్ దాని అనుబంధ సంస్థలు కూడా పాల్గొన్నాయన్న దానిపై పూర్తి విచారణ జరిపించాలని హేమంతరావు డిమాండ్ చేశారు. న్యాయ -విచారణ జరగాలని అందు కొరకు సిపిఐ డిమాండ్ చేస్తుందని ప్రభుత్వం న్యాయ విచారణకు ఆదేశించని పక్షంలో ఆందోళనలు చేపడతామన్నారు.

# రియల్ ఎస్టేట్ రంగంపై గోబెల్స్ ప్రచారం నమ్మొద్దు

**-రెండున్నర ఏళ్లలో దాదాపు 40 శాతం రియల్ వృద్ధి-త్వరలో మూసీ సుందరీకరణకు టెండర్లు**

**-రియల్ ఎస్టేట్‌తో పాటు పేదల ఇళ్ల నిర్మాణానికి ప్రాధాన్యత-రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ , సమాచార శాఖ మంత్రి పొంగులేటి**





**హైదరాబాద్,జులై 25 (నేషనలిస్ట్ వాయిస్):**

రాష్ట్రంలో ముఖ్యంగా హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందని కొంతమంది ఉద్దేశపూర్వకంగా గోబెల్స్ ప్రచారం సాగిస్తున్నారని దీనిలో ఏమాత్రం నిజం లేదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ , సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంలో స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ శాఖ మంత్రిగా స్పష్టమైన ఆధారాలు, వివరాలు ఉన్నాయని అందువలన అటువంటి ప్రచారాలను నమ్మాల్సిన అవసరం లేదని అన్నారు. శనివారం నాడు నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ గత రెండున్నర సంవత్సరాల ప్రజా ప్రభుత్వ పాలనలో సుమారు 15 నుంచి 20 శాతం రియల్ ఎస్టేట్ అభివృద్ధి జరిగిందని , 40 శాతం వరకు ఎ÷–లాట్ల విక్రయాలు వృద్ధిచెందాయని అన్నారు. గడచిన పదేళ్లతో పోలిస్తే ఈ రెండున్నర ఏళ్లలో రెసిడెన్షియల్ మార్కెట్ విశేషంగా పెరిగిందని, దీనికి సంబంధించి తమ స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ శాఖలో పెరిగిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల సంఖ్యనే నిదర్శనమన్నారు. రియల్ ఎస్టేట్ పడిపోయిందని కొంతమంది పనిగట్టుకొని ఈ ప్రభుత్వంపై బురద చల్లేందుకు ఈ గోబెల్స్ ప్రచారం సాగిస్తున్నారని వాటిని పట్టించుకోవద్దని మంత్రి అన్నారు. 2004 నుంచి 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో నాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రుల చొరవ కారణంగానే హైదరాబాద్ ఒక రోల్ మోడల్‌గా రూపొందిందని, వారి దూరదృష్టి వల్లే ఓఆర్ఆర్, అంతర్జాతీయ విమానాశ్రయం, ఐటి సెక్టార్ తదితరాలు 360 డిగ్రీల కోణంలో అభివృద్ధి చెందాయని వివరించారు. అందువల్లే హైదరాబాద్ ఇప్పుడు దేశంలోనే గాక ప్రపంచంలోనే అందరి దృష్టిని ఆకర్షిస్తోందని, ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారితో కలసి దావోస్ వెళ్లినపుడు అక్కడ కూడా అధికశాతం పారిశ్రామిక వేత్తలు హైదరాబాద్ లో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నారన్నారు. హైదరాబాద్ నగరం పెట్టుబడులకు గమ్యస్థానం అవుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి దూరదృష్టితో ప్రణాళికా బద్ధంగా హైదరాబాద్ నగరాభివృద్ధికి చర్యలు చేపట్టారు. 7వేల కోట్లతో చేపడుతున్న మూసీ ప్రాజెక్ట్ సుందరీకరణ పట్టాలెక్కనుందని మంత్రి పొంగులేటి తెలిపారు. 28 కిలోమీటర్ల తొలి విడత అభివృద్ధికి వారం పది రోజుల్లో టెండర్లు పిలవబోతున్నామని చెప్పారు. అదేవిధంగా పాత బస్తీ తదితరాలను కలుపుతూ రెండవ విడతగా 76 కిలోమీటర్ల మేర 24వేల కోట్లరూపాయిల ఖర్చుతో మెట్రో విస్తరణ కార్యక్రమం ప్రారంభం కానుందని తెలిపారు. ఇవేగాక ట్రిబుల్ ఆర్ నుంచి ఓఆర్ఆర్ కలుపుతూ రేడియల్ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయని తెలిపారు.ప్రపంచంలోనే సుందరనగరమైన హైదరాబాద్ ను రియల్ ఎస్టేట్ రంగం పక్షాన కూడా మరింత అభివృద్ధి చెందడానికి రియల్ ఎస్టేట్ రంగ ప్రతినిధులు సహకారం అవసరమని, ప్రజలకు నమ్మకంగా, సకాలంలో ఎ÷–లాట్లను అందించి వారి అభిమానాన్ని చూరగొనాలని మంత్రి హితవు పలికారు. రాష్ట్రంలో భూముల భద్రత , భరోసా కల్పించేందుకు భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని , వీటిలో కొన్ని చిన్న చిన్నసమస్యలను సాఫ్ట్ వేర్ పరంగా 15–20 రోజుల్లో సరిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. కేవలం రియల్ ఎస్టేట్ రంగం కోసమే గాకుండా పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు క్యూర్ పరిధిలో తొలివిడతగా లక్ష ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు నిర్ణయించామని, దీని తర్వాత దఫదఫాలు ఇళ్ల మంజూరు ఉంటుందని మంత్రి చెప్పారు. ప్రజలకు ఇళ్ల నిర్మాణానికి 2–3 లక్షల చదరపు అడుగుల స్థల సేకరణకు ప్రయత్నిస్తున్నామని చెబుతూ రియల్ ఎస్టేట్ రంగ ప్రతినిధుల కోరిక మేరకు ఫాస్ట్ ట్రాక్ సౌకర్యాన్ని కల్పించేందుకు ప్రయత్నిస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రఘురామ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినోతో రైతులకు అండగా నిలవండి

**-డ్రిప్ ఇరిగేషన్‌కు ప్రోత్సహించండి-మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు మంత్రి తుమ్మల సూచన**

**హైదరాబాద్,జూలై25(నేషనలిస్ట్ వాయిస్):**

ఎల్–నినో సమయంలో రైతులకు అండగా నిలవాలని మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు మంత్రి తుమ్మల పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎల్–నినో సవాళ్లకు డ్రిప్, తుంపర సేద్యమే పరిష్కార మార్గమని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ సచివాలయంలో మైక్రో ఇరిగేషన్ కంపెనీలతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమావేశమయ్యారు. డ్రిప్ వ్యవస్థల ఏర్పాటును వేగవంతం చేయాలని ఆ కంపెనీలకు మంత్రి సూచించారు. పెండింగ్‌లో ఉన్న డ్రిప్ పనులకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. బీఎంఎస్, బీఓక్యూలను పూర్తి చేసి వెంటనే అనుమతుల కోసం పంపాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిశీలన, పరిపాలనా అనుమతుల్లో జాప్యానికి తావివ్వొద్దని మంత్రి తుమ్మల సూచించారు. డ్రిప్ వ్యవసాయ పద్ధతిలో తక్కువ నీరు, విద్యుత్ ఉపయోగించి అధిక దిగుబడి సాధించవచ్చని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. పంటల వైవిధ్యీకరణకు మైక్రో ఇరిగేషన్ కీలకమని అన్నారు. ఆయిల్‌పామ్ సాగుకు డ్రిప్ సదుపాయాలను వెంటనే కల్పించాలని మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు హుకుం జారీ చేశారు. అవగాహన కార్యక్రమాల్లో ఆయా కంపెనీలు తప్పనిసరిగా పాల్గొనాలని, పెండింగ్ బిల్లుల చెల్లింపునకు కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. గత రెండేళ్లలో మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.400 కోట్లు చెల్లించిందని ఈ సందర్భంగా వెల్లడించారు. కంపెనీల పనితీరుపై జిల్లాల వారీగా నిరంతర సమీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. సూక్ష్మ సాగునీటి విస్తరణలో దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలవాలని మంత్రి తుమ్మల ఆకాంక్షించారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశ యువశక్తి విజయం

## బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి

**నిజామాబాద్,జూలై25(నేషనలిస్ట్ వాయిస్):**

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశ యువత మొక్కవోని పోరాట పటిమతో సాధించిన ప్రజాస్వామ్య విజయమని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత రాజకీయాలకు అతీతంగా తమ భవిష్యత్తు కోసం, విద్యా వ్యవస్థలో పారదర్శకత కోసం చేపట్టిన ఉద్యమం చివరకు ఫలితాన్ని ఇచ్చిందన్నారు. పరీక్షల నిర్వహణలో జరిగిన అవకతవకలు, విద్యార్థుల భవిష్యత్తుపై నెలకొన్న అనిశ్చితికి వ్యతిరేకంగా యువత శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా చేసిన పోరాటానికి కేంద్ర ప్రభుత్వం చివరకు స్పందించి దిగిరాక తప్పలేదన్నారు. ఉద్యమాన్ని అణచివేసేందుకు ప్రభుత్వం లాఠీచార్జీలు, భాష్పవాయు గోళాలు, నిర్బంధాలను ఆశ్రయించినప్పటికీ, దేశ యువత ఏమాత్రం వెనక్కి తగ్గకుండా అపారమైన ధైర్యంతో తమ ఉద్యమాన్ని కొనసాగించిందన్నారు. 'అధికారం ఎంత బలంగా కనిపించినా, చైతన్య వంతమైన యువత సంకల్పం ముందు తలవంచక తప్పదనే విషయాన్ని ఈ ఉద్యమం మరోసారి నిరూపించింది' అని అన్నారు. యువత ఐక్యపోరాటం ముందు ప్రభుత్వం దిగివచ్చే పరిస్థితి ఏర్పడిందని, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ఆ ప్రజాస్వామ్య పోరాటానికి లభించిన నైతిక విజయమని పేర్కొన్నారు. కానొక సందర్భం లో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నట్టు ?'దేశం కోసం అవసరం వచ్చినప్పుడు ఇండియా రియాక్ట్ అవుతుంది'? అనే మాటలను ఎమ్మెల్యే గుర్తు చేశారు. నేడు దేశ యువత అదే విషయాన్ని మరోసారి సాక్షాత్కరించిందన్నారు. 'యువత ప్రశ్నించడం ప్రారంభిస్తే అధికార వ్యవస్థలు జవాబుదారీతనం వహించక తప్పదు. ప్రజాస్వామ్యంలో ప్రజల గొంతుకే అంతిమ తీర్పు' అని అన్నారు. చదువుకున్న యువత కేవలం ఉద్యోగాల కోసం మాత్రమే కాదు... దేశ భవిష్యత్తు కోసం కూడా పోరాడుతుందని ఈ ఉద్యమం స్పష్టం చేసింది. జ్ఞానం, చైతన్యం, ఐక్యత కలిసొస్తే ఏ అహంకారమైనా కూలిపోవాల్సిందే' అని వేముల ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు, విద్యా వ్యవస్థ విశ్వసనీయత, పరీక్షల పారదర్శకత వంటి అంశాల్లో కేంద్ర ప్రభుత్వం సమగ్ర సంస్కరణలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. 'సమస్యలు మొదలైన వెంటనే బాధ్యతాయుతంగా స్పందించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు. విద్యార్థుల ఆవేదనను నిర్లక్ష్యం చేయడం వల్లే ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి' అని విమర్శించారు. ఇకపై దేశంలో ఏ విద్యార్థి కూడా పరీక్షల అవకతవకల కారణంగా నష్టపోకుండా కఠినమైన, పారదర్శకమైన పరీక్షల వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. 'ఇది ఒక వ్యక్తి రాజీనామాతో ముగిసే అంశం కాదు. దేశ విద్యా వ్యవస్థపై విద్యార్థుల్లో సంపూర్ణ విశ్వాసం నెలకొనే వరకు సంస్కరణలు కొనసాగాలి. అదే ఈ ఉద్యమం ఇచ్చిన అసలైన సందేశం' అని వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. ౖ÷శ యువతకు ఈ విజయం ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచుతుందని, ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుతంగా పోరాడితే మార్పు సాధ్యమేననే నమ్మకాన్ని ఈ ఉద్యమం దేశ ప్రజల్లో మరింత బలపరిచిందని ఆయన పేర్కొన్నారు




# పదవులు తాత్కాలికం, ప్రజల విశ్వాసమే అంతిమం: బండి

**హైదరాబాద్,జులై 25 (నేషనలిస్ట్ వాయిస్):**

'పదవులు తాత్కాలికం, ప్రజల విశ్వాసమే అంతిమం' అని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ప్రజల ఆకాంక్షల మేరకు నడవడమే ప్రజాస్వామ్యమని చెప్పారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై ఆయన స్పందించారు. తమకు పార్టీ కంటే.. దేశమే ప్రధానమన్నారు. ' ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రజాస్వామ్యం అంటే.. ప్రజల గొంతు వినడం, వారి మాటను గౌరవించడం, అవసరమైతే బాధ్యత తీసుకునే ధైర్యాన్ని కలిగి ఉండటం. భాజపా దాన్నే పాటిస్తుంది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా పార్టీ విలువలను ప్రతిబింబిస్తుంది. ఇన్నేళ్లపాటు దేశసేవలో భాగమైనందుకు ధర్మేంద్ర ప్రధాన్‌కు ధన్యవాదాలు' అని ఎక్స్‌లో పోస్టు చేశారు.

# కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ వైఫల్యం స్పష్టం

## మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి వ్యాఖ్య

**నాగర్ కర్నూల్,జులై 25 (నేషనలిస్ట్ వాయిస్):**

నీట్ ప్రశ్నా పత్రాల లీకేజి విషయంలో కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ వైఫల్యం స్పష్టంగా ఉందని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి అన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, యువకులు, విద్యావేత్తలు ఎంతగా కోరినా కేంద్రం పెడచెవిన పెట్టడం వల్ల పరిస్థితి చేయి దాటిందని పేర్కొన్నారు. వాంగ్ చుక్ దీక్ష విషయంలో, కాక్రోచ్ జనతాపార్టీ ఆందోళన విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరించిన వైఖరి ఏమాత్రం సమంజసంగా లేదని వెల్లడించారు. విద్యార్థుల మీద అమానుషంగా ప్రవర్తించడం ప్రతీ భారతీయుడ్ని కదిలించిందని వివరించారు. ప్రజాగ్రహాన్ని గ్రహించే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చిందని తెలిపారు. అనేక మంది రైతులు మరణించిన తర్వాత సాగు చట్టాలను రద్దు చేసినట్లే, అనేక మంది విద్యార్థులు నష్టపోయిన తర్వాత ధర్మేంద్రతో రాజీనామా చేయించడం మోదీ చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లయిందని విమర్శించారు.నీట్ లాంటి జాతీయ పరీక్షల విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా మరింత బాధ్యతగా వ్యవహరిస్తుందని ఆశిస్తున్నానని పేర్కొన్నారు. అనేక విషయాల్లో వైఫల్యం చెందిన రాష్ట్ర ప్రభుత్వం కూడా తాజా రాజకీయ పరిణామాలతో అప్రమత్తం కావాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల విజయం

## బిఆర్ఎస్ ఎపి వద్దిరాజు రవిచంద్ర

**న్యూఢిల్లీ,జులై 25 (నేషనలిస్ట్ వాయిస్):**

ప్రశ్నాపత్రం లీక్ కావడానికి బాధ్యత వహిస్తూ విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం విద్యార్థులు, యువత, ప్రజాస్వామ్యవాదుల విజయమని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ , ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అన్నారు. కాక్రోచ్ సైన్యాన్ని చూసి దేశం గర్వపడుతున్నదని, విద్యార్థులు,యువత ఆగ్రహించి పోరుబాట పడితే,అది ఏ స్థాయిలో ఉంటుందో యావత్ ప్రపంచం మరోసారి చూసిందని పేర్కొన్నారు. ఎన్ని ఆంక్షలు విధించినా, బెదిరించినా, భయపెట్టినా, నిర్బంధాలు ప్రయోగించినా, లాఠీలెత్తినా, దేశద్రోహులు,సంఘ విద్రోహులు అని ముద్రవేసినా కూడా యువత వెనుకంజ వేయకుండా ఉద్యమించిందని అన్నారు. విద్యార్థుల పోరాటంలో న్యాయం ఉందని, ధర్మమైనదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావు ధర్నాలో పాల్గొని సంఘీభావం ప్రకటించడాన్ని ఎంపీ రవిచంద్ర గుర్తు చేశారు. విద్యార్థుల ధర్మమైన ఆగ్రహావేశాలకు పార్లమెంట్ గేట్లు కూడా మూసేయాల్సిన పరిస్థితి తలెత్తిందంటే వారి బలమెంతో పాలకులు అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల సందర్భంగా విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఎంపీ వద్దిరాజు డిమాండ్ చేస్తూ,దేశంలో ఇక ముందు ఎలాంటి పరీక్షల ప్రశ్నాపత్రాలు కూడా లీక్ కాకుండా, అక్రమాలు చోటు చేసుకోకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవలసిందిగా పాలకులకు హితవు పలికారు.

# గుజరాత్‌లో వరదల బీభత్సం

## వల్సాద్‌లో నీట మునిగిన గృహసముదాయాలు

**గాంధీనగర్,జూలై25(నేషనలిస్ట్ వాయిస్):**

గుజరాత్‌లోని వల్సాద్‌లో భారీ వర్షాలకు నివాస సముదాయాలు నీట మునిగాయి. ఓ వ్యక్తి తన ఇంటి బయట వరద నీటిలో నిలబడి ఉన్న వీడియో వైరల్ అయింది. ఇక్కడ పరిస్థితులు ఎంత దారుణంగా ఉన్నాయో ఆ వీడియో చూస్తే తెలుస్తోంది. ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాల కారణంగా వీధులు, రోడ్లు పూర్తిగా నీట మునిగిపోవడంతో, సదరు యువకుడు తన ఇంటి బయట మెడలోతు వరద నీటిలో నిలబడి పరిస్థితిని వివరించాడు. పార్క్ చేసిన వాహనాలు, ప్రహరీలు, భవనాల పైభాగాలు మాత్రమే బయటకు కనిపిస్తున్న ఈ దృశ్యాలు వరద తీవ్రతను స్పష్టంగా చూపిస్తున్నాయి. ఈ వీడియోలో సదరు వ్యక్తి మునిగిపోయే స్థాయిలో నీరు చేరడం చూసి నెటిజన్లు షాక్ అవుతున్నారు. వీధులు, ఖాళీ స్థలాల మధ్య తేడా తెలియకుండా అంతా జలమయం కావడంతో అక్కడి నివాసితుల దైనందిన జీవితం పూర్తిగా స్తంభించిపోయింది. పట్టణాల్లో అరకొరగా ఉన్న మురుగునీటి పారుదల వ్యవస్థలు, ఈ తరహా ముంపునకు ప్రధాన కారణమని ఆన్‌లైన్‌లో పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ దృశ్యాలు చూసిన పలువురు నెటిజన్లు శివమ్ సింగ్, ఇతర నివాసితులు సురక్షితంగా ఇళ్లలోనే ఉండాలని కోరారు. మరోవైపు అధికారులు, రెస్క్యూ టీమ్ ఇప్పటికే పలువురిని సురక్షిత ప్రదేశాలకు తరలించినట్లు సమాచారం.

# కోమటిరెడ్డి నాకు టిక్కెట్ ఇవ్వడడేంటి

## కాంగ్రెస్‌లో అధిష్టానమే టిక్కెట్ ఇస్తుంది

## రాజగోపాల్‌రెడ్డికి మందల సామేల్ కౌంటర్

**సూర్యాపేట,జూలై25(నేషనలిస్ట్ వాయిస్):**

తుంగతుర్తిలో తప్పుడు వ్యక్తిని తీసుకొచ్చి టికెట్ ఇప్పించానంటూ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి చేసి వ్యాఖ్యలపై ఎమ్మెల్యే మందుల సామెల్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్‌గోపాల్.. పార్టీ మారి కాంగ్రెస్‌లోకి వచ్చారని.. ఆయన కంటే ముందు తానే కాంగ్రెస్‌లోకి వచ్చినట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో టికెట్ ఇచ్చేది అధిష్ఠానం మాత్రమే అని చెప్పుకొచ్చారు. 'నాకు రెడ్లు ఓటేశారు, రాజ్‌గోపాల్ రెడ్డికి మాదిగలు ఓటేశారు. రెడ్లు, దళితులతోనే రాజ్యం నడవదు. నాకు టిక్కెట్ ఇచ్చింది ఏఐసీసీ. రాజగోపాల్ రెడ్డి కాదు. నా నియోజకవర్గానికి వచ్చి రోడ్డును పరిశీలించిన కోమటిరెడ్డి.. నాతో ఒక్కమాట కూడా చెప్పలేదు. మునుగోడులో నా క్యాడర్ కూడా ఉంది. మునుగోడులో రాజ్‌గోపాల్‌ను గెలిపించినందుకు నా క్యాడర్ బాధపడుతోంది' అని ఎమ్మెల్యే మందుల సామెల్ వ్యాఖ్యానించారు.





# కోల్‌కతాకు బ్రెజిల్ ఫుట్‌బాల్ టీమ్..

ఇండియన్ ఫుట్‌బాల్ లవర్స్ కి బిగ్ సర్ ప్రైజ్ లభించబోతోంది. ఫైవ్-టైమ్ ఫిఫా వరల్డ్ కప్ ఛాంపియన్ బ్రెజిల్ ఫుట్‌బాల్ టీమ్ ఇండియాలో ఇంటర్నేషనల్ ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడేలా బ్రెజిలియన్ ఫుట్‌బాల్ కాన్ఫెడరేషన్ అడ్వాన్స్ టాక్స్ జరుపుతోంది. తాజా రిపోర్ట్ ప్రకారం, 2026 ఫిఫా వరల్డ్ కప్ టైమ్‌లో కోల్‌కతా ఫ్యాన్స్ ప్రదర్శించిన మైండ్ బ్లోయింగ్ లవ్ చూసి బ్రెజిల్ ఆఫీషియల్స్ షాక్ అయ్యారు. ఈ మ్యాజిక్ కు ఫిదా వాళ్లు అక్టోబర్ మంత్ బిగినింగ్ లో ఉండే ఫిఫా "సూపర్ ఇంటర్నేషనల్ విండో" లో కోల్‌కతా వేదికగా ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడించడానికి ప్లాన్ చేస్తున్నారు. ప్రెజెంట్ ఆపోనెంట్ టీమ్ ను ఫైనలైజ్ చేయాల్సి ఉంది. బ్రెజిల్ ఆల్రెడీ ఆస్ట్రేలియాలో సెప్టెంబర్ 25న టౌన్స్‌విల్లె, సెప్టెంబర్ 29న బ్రిస్బేన్ వేదికలుగా ఆస్ట్రేలియా టీమ్‌తో రెండు మ్యాచులు ఆడటానికి కన్ఫర్మ్ చేసుకుంది. ఈ ఆస్ట్రేలియా టూర్ తర్వాత థర్డ్ లెగ్ లో భాగంగా బ్రెజిల్ కోల్‌కతా కు రానుంది. బంగ్లాదేశ్, సింగపూర్, ఖతార్ లాంటి కంట్రీస్ కూడా బ్రెజిల్ మ్యాచ్ హోస్ట్ చేయడానికి ట్రై చేసినప్పటికీ, ఇండియన్ ఆర్గనైజర్లతో జరిపిన డిస్కషన్స్ పాజిటివ్ గా ముందుకు సాగాయి. న్యూ సూపర్ ఫిఫా విండో ఫార్మాట్ లో పొడిగించిన 16 రోజుల పీరియడ్ లో నేషనల్ టీమ్స్ ఫోర్ మ్యాచులు ఆడుకునే ఛాన్స్ ఉంది. ఒకవేళ ఈ మ్యాచ్ కన్ఫర్మ్ అయితే కోల్‌కతా ఫుట్‌బాల్ హిస్టరీలో మరో గోల్డెన్ పేజీ యాడ్ అవ్వనుంది. 1977 సెప్టెంబర్ లో బ్రెజిల్ ఫుట్‌బాల్ లెజెండ్ పీలే, న్యూయార్క్ కాస్మోస్ టీమ్ తరఫున వచ్చి ఈడెన్ గార్డెన్స్ లో మోహన్ బగాన్ తో మ్యాచ్ ఆడి సంచలనం సృష్టించాడు. ఆ చారిత్రాత్మక మూమెంట్ తర్వాత మళ్లీ బ్రెజిల్ నేషనల్ టీమ్ ఇండియన్ సాయిల్ పై అడుగుపెట్టడం బిగ్గెస్ట్ ఈవెంట్ గా మారనుంది. ఇండియా ఫుట్‌బాల్ క్యాపిటల్ గా పాపులర్ అయిన కోల్‌కతాలో వరల్డ్ కప్ టైమ్ లో విపరీతమైన బ్రెజిల్ క్రేజ్ కనిపించింది. నార్త్ కోల్‌కతా వీధుల్లో నేమార్, వినిసియస్ జూనియర్ పెద్ద కటౌట్లు, వాల్ పెయింటింగ్స్ తో సిటీ అంతా బ్రెజిల్ యెల్లో, గ్రీన్ కలర్లలో మారిపోయింది. ఈ లవ్ కి ఫిదా అయ్యే బ్రెజిల్ టీమ్ కోల్‌కతా రావడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని తెలుస్తోంది.

## భారత్? చేతిలో జింబాబ్వేను చిత్తు 90 పరుగుల తేడాతో ఘన విజయం 2-0తో టీ20 సిరీస్ భారత్ కైవసం ఇషాన్, తిలక్ విధ్వంసకర ఇన్నింగ్స్

# జింబాబ్వే గడ్డపై టీమిండియా జోరు

జింబాబ్వేతో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో భారత్ 90 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. 3 మ్యాచ్‌ల సిరీస్‌ను 2-0తో కైవసం చేసుకుంది. 220 పరుగుల లక్ష్యంతో ఛేదనకు దిగిన జింబాబ్వే 17.5 ఓవర్లలో 129 పరుగులకే ఆలౌటైంది. బ్రియాన్ బెన్నెట్ 32, మారుమని 24, ర్యాన్ బర్ల్ 20, బ్రాడ్ ఎవాన్స్ 19 రన్స్ చేశారు. భారత బౌలర్లలో అభిషేక్ శర్మ 3, ప్రిన్స్ యాదవ్, యశ్ ఠాకూర్ చెరో 2 వికెట్లు తీశారు. రవి బిష్ణోయ్, శివమ్ దూబె, తిలక్ వర్మ తలో వికెట్ తీశారు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 220 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఇషాన్ కిషన్(44 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్సలతో 81), తిలక్ వర్మ(29 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సలతో 60 నాటౌట్) విధ్వంసకర హాఫ్ సెంచరీలతో చెలరేగారు. వైభవ్ సూర్యవంశీ(9 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 20) మెరుపులు మెరిపించగా.. శ్రేయస్ అయ్యర్(20 బంతుల్లో 4 ఫోర్లతో 25) పర్వాలేదనిపించాడు. జింబాబ్వే బౌలర్లలో బ్లెస్సింగ్ ముజర్బానీ, రిచర్డ్ నగర్వ, బ్రాడ్ ఇవాన్స్, న్యూమాన్ న్యామురి, బ్రియాన్ బెన్నెట్ తలో వికెట్ తీసారు. అనంతరం జింబాబ్వే 17.5 ఓవర్లలో 129 పరుగులకు కుప్పకూలింది. బ్రియాన్ బెన్నెట్(19 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సలతో 32), ర్యాన్ బర్ల్(18 బంతుల్లో 2 ఫోర్లతో 20), మరుమని(19 బంతుల్లో ఫోర్, సిక్స్‌తో 24) టాప్ స్కోరర్లుగా నిలిచారు. భారత బౌలర్లలో అభిషేక్ శర్మ(3/17) మూడు వికెట్లు తీయగా.. యశ్ ఠాకూర్(2/30), ప్రిన్స్ యాదవ్(2/10) రెండేసి వికెట్లు పడగొట్టారు. రవి బిష్ణోయ్, శివమ్ దూబే, తిలక్ వర్మ తలో వికెట్ తీసారు.ముందుగా బౌలింగ్‌లో తేలిపోయిన జింబాబ్వే ఆ తర్వాత బ్యాటింగ్‌లోనూ చేతులెత్తేసింది. భారత అరంగేట్ర పేసర్ యశ్ ఠాకూర్, ప్రిన్స్ యాదవ్ నిప్పులు చెరగడంతో కనీస పోటీ ఇవ్వలేకపోయింది. చివరకు భారత పార్ట్ టైమ్ బౌలర్లు తిలక్ వర్మ, అభిషేక్ శర్మలను ఆడలేక వికెట్లు పారేసుకుంది. భారీ స్కోర్‌ను ఛేదించాలనే ఒత్తిడో ఏమో కానీ.. జింబాబ్వే బ్యాటర్లు ఎవరూ క్రీజులో నిలదొక్కుకునే ప్రయత్నం చేయలేదు. కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్‌కు ఇదే తొలి విజయం కావడం గమనార్హం. ఇరు జట్ల మధ్య ఆఖరి టీ20 ఆదివారం హరారే వేదికగా జరగనుంది.



# కామన్వెల్త్ గేమ్స్‌పై సైనా నెహ్వాల్ అసంతృప్తి

కామన్వెల్త్ గేమ్స్ నుంచి బ్యాడ్మింటన్ క్రీడను తొలగించడంపై భారత బ్యాడ్మింటన్ దిగ్గజం, లండన్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత సైనా నెహ్వాల్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అదే సమయంలో పి.వి. సింధు మళ్లీ పాత ఫామ్‌ను అందుకోవడంపై హర్షం వ్యక్తం చేస్తూనే, భారత బ్యాడ్మింటిన్ భవిష్యత్తు కోసం మరింత మంది యువ ఆటగాళ్లు వెలుగులోకి రావాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. 'న్యూస్18 రైజింగ్ భారత్ ఇండియా సమ్మిట్ (సౌత్ ఎడిషన్)' వేదికగా సైనా నెహ్వాల్ ఈ వ్యాఖ్యలు చేశారు. కామన్వెల్త్ క్రీడల నుంచి ప్రధాన ఆటలను తీసివేయడంపై సైనా మాట్లాడుతూ: "బ్యాడ్మింటన్, హాకీ, షూటింగ్ వంటి క్రీడల్లో కామన్వెల్త్ గేమ్స్‌లో మనం ఎన్నో స్వర్ణ పతకాలు సాధించాం. ఈసారి ఆ క్రీడలు అక్కడ లేకపోవడం చాలా ఆశ్చర్యంగా ఉంది. 2006 నుండి 2022 వరకు జరిగిన ప్రతి కామన్వెల్త్ క్రీడల్లోనూ మేము పాల్గొన్నాం. ప్రస్తుతం ఆయా ఆటల ప్లేయర్లు ఎలా భావిస్తున్నారో ఊహించుకుంటే బాధగా ఉంది. 2030లో భారత్ మళ్లీ కామన్వెల్త్ గేమ్స్‌కు ఆతిథ్యం ఇవ్వబోతోంది. అప్పుడు ఈ ఈవెంట్లు మళ్లీ వస్తాయని నమ్ముతున్నాను. కానీ, అంతటి పెద్ద క్రీడలను ఇప్పుడు ఎలా తొలగిస్తారో నాకు అర్థం కావడం లేదు. ఇది తీవ్రంగా నిరాశపరిచే అంశం." అని వ్యాఖ్యానించారు. ఈ నిర్ణయం వల్ల యువ అథ్లెట్లు మానసికంగా కుంగిపోకూడదని సైనా సూచించారు. "ఆటగాళ్లు ఎప్పుడూ ఆగిపోరు. వారు నిరంతరం శ్రమిస్తూ, రాబోయే టోర్నమెంట్లపై దృష్టి పెట్టాలి. అయితే, యువ క్రీడాకారులకు ఇది చాలా కష్టమైన సమయం. ఒక పెద్ద అంతర్జాతీయ టోర్నమెంట్ చేతిజారిపోయిందని వారు భావిస్తారు. ఉదాహరణకు ఉన్నతికి ఈసారి అవకాశం వచ్చి ఉండేది. అంతర్జాతీయ అనుభవాన్ని గడించడానికి ఇదొక మంచి టోర్నమెంట్, కానీ ఆమె ఆ అవకాశాన్ని కోల్పోతోంది. రాబోయే ఆసియా గేమ్స్‌లో ఆమె ఎలా రాణిస్తుందో చూడాలి." అని పేర్కొన్నారు.ఇటీవల జపాన్‌లో అద్భుత ప్రదర్శనతో తిరిగి పాత ఫామ్‌ను అందుకున్న రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పీవీ సింధుపై సైనా ప్రశంసలు కురిపించారు. "గత వారం సింధు ఆడిన తీరు అద్భుతం! చాలా కాలం తర్వాత ఆమె ఎటాకింగ్ గేమ్, కోర్టులో వేగవంతమైన మూవ్‌మెంట్స్‌ను చూశాను. దిగ్గజ క్రీడాకారులను ఎప్పటికీ తక్కువ అంచనా వేయలేం. వారికి ఎంతో అనుభవం ఉంటుంది, తమ భావోద్వేగాలను ఎలా నియంత్రించుకోవాలో బాగా తెలుసు. 2019, 2020 నాటి ప్రదర్శనను మళ్లీ పునరావృతం చేస్తున్నందుకు ఉపశమనం కంటే కూడా ఆమె ఎంతో సంతోషంగా ఉండి ఉంటుంది.



# శ్రీలంకతో రెండు టెస్ట్‌ల సిరీస్ రిషభ్ పంత్ రీఎంట్రీ అవకాశం!?

జింబాబ్వే పర్యటన అనంతరం భారత జట్టు శ్రీలంక పర్యటనకు వెళ్లనుంది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2027లో భాగంగా శ్రీలంకతో రెండు టెస్ట్‌ల సిరీస్ ఆడనుంది. ఆగస్ట్ 15 నుంచి ఈ సిరీస్ ప్రారంభం కానుంది. గతేడాది నవంబర్‌లో సొంతగడ్డపై సౌతాఫ్రికాతో జరిగిన రెండు టెస్ట్‌ల సిరీస్‌లో టీమిండియా 0-2తో క్లీన్ స్వీప్ అయ్యింది. గౌతమ్ గంభీర్ హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత టెస్ట్‌ల్లో టీమిండియా పేలవ ప్రదర్శన కనబరుస్తోంది.ప్రస్తుతం డబ్ల్యూటీసీ పాయింట్స్ టేబుల్‌లో ఐదో స్థానంలో ఉన్న టీమిండియా ఫైనల్ చేరాలంటే తమ తదుపరి 9 టెస్ట్‌ల్లో ఏడు గెలవాలి. శ్రీలంకతో రెండు, న్యూజిలాండ్‌తో రెండు, ఆస్ట్రేలియాతో సొంతగడ్డపై టీమిండియా ఐదు టెస్ట్‌లు ఆడాల్సి ఉంది.శ్రీలంకపై విజయం సాధిస్తేనే టీమిండియా డబ్ల్యూటీసీ ఫైనల్ అవకాశాలు సజీవంగా ఉండనున్నాయి. శ్రీలంకతో టెస్ట్ సిరీస్‌కు ఇంకా జట్టును ప్రకటించలేదు. ఐపీఎల్ 2026 సీజన్ అనంతరం అఫ్గానిస్థాన్‌తో టీమిండియా ఏకైక టెస్ట్ మ్యాచ్ ఆడింది. కానీ ఇది డబ్ల్యూటీసీలో భాగం కాదు. ఈ మ్యాచ్‌కు దూరంగా ఉన్న జస్‌ప్రీత్ బుమ్రా, రవీంద్ర జడేజా శ్రీలంక పర్యటనతో రీఎంట్రీ ఇవ్వనున్నారు. దాంతో గుర్నూర్ బ్రార్, హర్ష్ దూబేలు ఉద్వాసనకు గురవ్వనున్నారు. నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్ గాయాలతో ఇబ్బంది పడుతుండటం సెలెక్టర్లకు తలనొప్పిగా మారింది. సరైన టీమ్ కాంబినేషన్‌కు ఈ ఇద్దరూ కీలకం. ఒకవేళ నితీష్ రెడ్డి ఈ సిరీస్‌కు దూరమైతే టీమిండియా స్పెషలిస్ట్ బ్యాటర్‌ను తీసుకునే అవకాశం ఉంది. రుతురాజ్ గైక్వాడ్, సర్ఫరాజ్ ఖాన్‌లో ఒకరికి అవకాశం దక్కుతుంది. సుందర్ దూరమైతే హర్ష్ దూబేకు చోటు దక్కుతుంది. జడేజా, మానవ్ సుతార్‌తో పాటు హర్ష్ దూబే స్పిన్ బాధ్యతలు పంచుకుంటారు. ఆఫ్ స్పిన్నర్ కావాలనుకుంటే 33 ఏళ్ల సరాన్ష్ జైన్‌కు అవకాశం దక్కుతుంది. ఇటీవల శ్రీలంక-ఏతో జరిగిన టెస్ట్ సిరీస్‌లో భారత్-ఏ తరపున సరాన్ష్ జైన్ ఆడాడు. మధ్యప్రదేశ్‌కు చెందిన సరాన్ష్ జైన్‌కు ఇప్పటి వరకు టీమిండియా పిలుపు దక్కలేదు.నెంబర్ 3 బ్యాటర్‌గా సాయి సుదర్శన్ తన స్థానాన్ని నిలబెట్టుకోనుండగా.. దేవదత్ పడిక్కల్ అతనికి బ్యాకప్‌గా అవకాశం అందుకోనున్నాడు. మహమ్మద్ సిరాజ్ రీఎంట్రీ ఇవ్వనుండగా.. ప్రసిథ్ కృష్ణను జట్టులో కొనసాగించనున్నారు. ఈ ఇద్దరూ బుమ్రాతో కలిసి పేస్ బాధ్యతలు పంచుకోనున్నారు. యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్‌లు ఓపెనర్లుగా ఎంపికవ్వనుండగా.. రిషభ్ పంత్ తిరిగి రానున్నాడు. ధ్రువ్ జురెల్‌ను అతనికి బ్యాకప్ వికెట్ కీపర్‌గా ఎంపిక చేయనున్నారు. ఈ జట్టును అధికారికంగా భారత సెలెక్షన్ కమిటీ మరో 24 గంటల్లోపు ఎప్పుడైనా ప్రకటించే అవకాశం ఉంది.

# అర్థవంతమైన పాత్రలుంటేనే చేస్తా: నిధి అగర్వాల్



సినిమాల్లో అవకాశాల కోసం తొందరపడడం లేదని నటి నిధి అగర్వాల్ అన్నారు. 'ఈశ్వరన్', 'భూమి', 'కళగ తలైవన్' తర్వాత తమిళ సినిమా చేయలేదని, సరైన ప్రాజెక్ట్ కోసం ఎదురు చూస్తున్నానని చెప్పారు. మంచి దర్శకులతో అర్థవంతమైన పాత్రలు ఉన్న సినిమాలు చేయాలనుకుంటున్నాను. అలాంటి పాత్రలకు తమిళ ఇండస్ట్రీ సరైన చోటు. నా జీవితంలో దేనికీ నేను తొందరపడను. పెళ్లి విషయంలో కూడా అంతే. మంచి ప్రాజెక్ట్‌లు వస్తే.. సినిమాలు చేస్తాను. 'హరి హర వీరమల్లు, 'ది రాజా సాబ్' సినిమాల్లో స్టార్‌లతో కలిసి పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ప్రస్తుతం తెలుగు, హిందీ సినిమాలతో బిజీగా ఉన్నాను. దీంతో తమిళంలో నటించడం మిస్ అవుతున్నా. నాది చాలా సున్నితమైన మనస్తత్వం. అందుకే భావోద్వేగాలు ఎక్కువగా బయటపెట్టను. వృత్తిపరంగా బాగా కష్టపడతాను. ఇతర విషయాలకొస్తే అత్యంత సోమరిని. ప్రస్తుతం రెండు ప్రాజెక్టుల గురించి చర్చలు జరుగుతున్నాయి. ఇంకా ఫైనల్ చేయలేదని నిధి తెలిపారు. ఇక, ప్రస్తుతం ఆమె 'మిరాయ్' పార్ట్-2, హిందీ సైకలాజికల్ థ్రిల్లర్ 'ది ఇన్‌ఫ్లుయెన్సర్'లో కనిపించనున్నారు.




# సక్సెస్ టాక్‌లో చెన్నై లవ్ స్టోరీ

టాలీవుడ్‌లో తాజాగా విడుదలైన ప్రేమకథా చిత్రాల్లో 'చెన్నై లవ్ స్టోరీ' ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటోంది. యంగ్ హీరో కిరణ్ అబ్బవరం, నటి శ్రీ గౌరీ ప్రియా జంటగా నటించిన ఈ చిత్రానికి దర్శకుడు రవి నంబూరి దర్శకత్వం వహించారు. జాతీయ అవార్డు గ్రహీత సాయి రాజేష్ అందించిన కథతో తెరకెక్కిన ఈ సినిమా విడుదలకు ముందే మంచి అంచనాలు ఏర్పరుచుకోగా, ప్రీమియర్ షోల నుంచే ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందనను సొంతం చేసుకుంది. ప్రేమ, భావోద్వేగాలు, కుటుంబ అనుబంధాల నేపథ్యంలో రూపొందిన ఈ సినిమా మొదటి షో నుంచే పాజిటివ్ టాక్‌ను అందుకుంది. ముఖ్యంగా కిరణ్ అబ్బవరం నటన, శ్రీ గౌరీ ప్రియా సహజమైన అభినయం, భావోద్వేగ సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయని సినీ అభిమానులు సోషల్ మీడియాలో అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రముఖ టికెటింగ్ ప్లాట్‌ఫామ్ బుక్‌మైషోలో విడుదలైన మొదటి రోజే 1.5 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడుపోవడం విశేషంగా మారింది. విడుదల రోజునే ఇంత భారీ స్థాయిలో టికెట్ సేల్స్ నమోదు కావడం సినిమా క్రేజ్‌ను ప్రతిబింబిస్తోందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఈ చిత్రానికి సంగీత దర్శకుడు మణిశర్మ అందించిన పాటలు, నేపథ్య సంగీతం మరో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. భావోద్వేగ సన్నివేశాలను మరింత బలంగా నిలబెట్టడంలో ఆయన సంగీతం కీలక పాత్ర పోషించిందని ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. తొలి రోజు స్పందనను బట్టి చూస్తే, 'చెన్నై లవ్ స్టోరీ' కిరణ్ అబ్బవరం కెరీర్‌లో మరో విజయవంతమైన చిత్రంగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. 'చెన్నై లవ్ స్టోరీ' చిత్ర బృందం నిర్వహించిన సక్సెస్ మీట్ లో సిబ్బంది మాటలు హైలైట్‌గా నిలిచాయి. హీరోయిన్ శ్రీ గౌరీ ప్రియ, నిర్మాతలు ధీరజ్ మొగిల్నేని, ఎస్‌కేఎన్ తమ అనుభవాలను పంచుకుంటూ సినిమాపై ప్రేక్షకులు చూపిస్తున్న ఆదరణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా హీరోయిన్ శ్రీ గౌరీ ప్రియ మాట్లాడుతూ.. తన జీవితంలో ఇది ఎంతో ప్రత్యేకమైన విజయమని చెప్పారు. సినిమా విడుదలైనప్పటి నుంచి తన ఫోన్ నిరంతరం మోగుతూనే ఉందని, చాలామంది మీ అమ్మ ఉండి ఉంటే చాలా సంతోషించేదని చెబుతున్నారని వెల్లడించారు. అయితే తన అమ్మ ఎక్కడ ఉన్నా తన విజయాన్ని చూస్తూనే ఉంటుందని తాను నమ్ముతున్నానని ఆమె ఎమోషన్ అయ్యారు. ఒక తెలుగు అమ్మాయిగా కంటెంట్ ఉన్న పాత్రలో నటించే అవకాశం రావడం తన అదృష్టమని అన్నారు.నిర్మాత ధీరజ్ మొగిల్నేని మాట్లాడుతూ.. సంగీత దర్శకుడు మణిశర్మ అందించిన పాటలు, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకు ప్రాణం పోశాయని చెప్పారు. అనంత శ్రీరామ్ రాసిన సాహిత్యం కూడా చిత్రానికి మరో బలమైందన్నారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు అన్ని వయసుల మహిళలు సినిమాను విశేషంగా ఆదరిస్తున్నారని వెల్లడించారు. గౌరీ ప్రియ పాత్ర కోసం ప్రాణం పెట్టి నటించిందని, అందుకే ఇప్పుడు ఆమెకు అంతటి ప్రశంసలు వస్తున్నాయని చెప్పారు. హీరో కిరణ్ అబ్బవరాన్ని నిజమైన నిర్మాతల హీరోగా అభివర్ణిస్తూ, షూటింగ్ విషయంలో ఎప్పుడూ సహకరించారని వెల్లడించారు.

# సౌండ్ ఇంజనీర్‌గా వస్తోన్న నారా రోహిత్

కథానాయకుడు నారా రోహిత్ జోరుమీదున్నారు. ఒకప్పుడు వైవిధ్యమైన కథలు, పాత్రలు ఎంచుకుని అలరించేవారు. ఆయన నుంచి సినిమా వస్తుందంటే ఏదో కొత్తదనం ఉందనే భావన ప్రేక్షకులకు కలిగేది. అయితే, కొంతకాలం విరామం తీసుకున్న నారా రోహిత్ గతేడాది 'భైరవం', 'సుందరకాండ' చిత్రాలతో మళ్లీ ట్రాక్‌లోకి వచ్చారు. ఇప్పుడు మరోసారి వరుస చిత్రాలతో అలరించడానికి సిద్ధమయ్యారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా కొత్త సినిమాల కబుర్లు పంచుకుంటున్నారు. రామ్ గన్నీ దర్శకత్వంలో రోహిత్ ఓ సినిమాలో నటిస్తున్నారు. దీనికి 'కపాలి' అనే టైటిల్, ఫస్ట్‌లుక్‌ను తాజాగా విడుదల చేశారు. పురాణాంశాలతో నిండిన సైకలాజికల్ హారర్ థ్రిల్లర్‌గా ఇది రూపొందుతోంది. ఇక వెంకటేశ్-త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న 'ఆదర్శ కుటుంబం: హౌస్ నెం.47'లోనూ నారా రోహిత్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇందులో ఆయన పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్నారు. ఈ లుక్‌ను కూడా చిత్ర నిర్మాణ సంస్థ హారిక హాసిని క్రియేషన్స్ శనివారం సోషల్‌మీడియా వేదికగా పంచుకుంది. దీంతో పాటు, చినిమిల్లి మణికుమార్ దర్శకత్వంలో ఓ వైవిధ్యమైన కథలో నారా రోహిత్ మెరవనున్నారు. ఈ సినిమాకు 'సౌండ్ ఇంజనీర్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. పూర్తి వినోదాత్మక చిత్రంగా దీన్ని తీర్చిదిద్దుతున్నట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది. నయన్‌సారిక, నరేశ్, రోహిణి, అజయ్, వెన్నెల కిషోర్, సుదర్శన్, బ్రహ్మాజీ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.




# హాలీవుడ్ సినిమాలకు దీటుగా 'రామాయణ'

## ప్రపంచ నలుమూలలకు వెళ్తుందని ఇన్‌స్టాలో పోస్ట్

నితేశ్ తివారీ దర్శకత్వంలో భారీ హంగులతో రూపుదిద్దుకుంటున్న సినిమా 'రామాయణ'. శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్ నటిస్తున్నారు. శుక్రవారం విడుదల కావాల్సిన ఈ సినిమా ట్రైలర్ చివరి నిమిషంలో వాయిదా పడింది. అంతర్జాతీయ స్థాయిలో విడుదల చేయాలని భావించి ట్రైలర్‌ని వాయిదా వేస్తున్నాం. హాలీవుడ్ సినిమాలకు దీటుగా 'రామాయణ' ప్రపంచ నలుమూలలకు వెళ్తుందని పేర్కొంటూ ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు నిర్మాత నమిత్ మల్హోత్రా. ఈ సినిమా ప్రచార కార్యక్రమాల్లో భాగంగా అమెరికాలో జరుగుతోన్న శాన్ డియాగో కామిక్-కాన్ 2026 వేడుకల్లో చిత్రబృందం పాల్గొంది. ఈ సందర్భంగా వేడుకలో రణ్‌బీర్ మాట్లాడుతూ.. ఈ సినిమాలో అవకాశం వచ్చినప్పుడు నాలో చాలా భయం, సందేహం ఉండేవి. 'నేను ఇది చేయగలనా, నాకు అంత సామర్థ్యం ఉందా?' అనిపించేది. కానీ ఆ సందేహం చాలా త్వరగానే కృతజ్ఞతా భావంగా మారింది. ఇదొక వరం. జీవితంలో ఒక్కసారి మాత్రమే లభించే అవకాశం. తరతరాలుగా శ్రీరాముడు ఎంతో మందికి ఆత్మ రక్షకుడిగా ఉన్నారు. ధైర్యం, కరుణ, క్షమ, ధర్మం లాంటి వాటికి ఆయన ప్రతీకగా నిలుస్తారు. అలాంటి లక్షణాలకు ప్రాతినిధ్యం వహించే అవకాశం రావడం చాలా గొప్ప విషయం. దీనికి చాలా విశ్వాసం, నమ్మకం, నిజాయతీ అవసరమని ప్రారంభంలోనే అర్థం చేసుకున్నా. ఈ కథను ధ్యమైనంత వాస్తవికంగా చెప్పాలన్నదే మా నటీనటులు, సిబ్బందిల ఉన్నతమైన ఉద్దేశం అన్నారు. యశ్ మాట్లాడుతూ.. 'ఈ ప్రపంచంలో ఎవరూ వచ్చి 'నేను శ్రీరాముడి పాత్ర పోషించగలన'ని చెప్పలేరు. ఈ పాత్ర పోషించడం అంత సులభం కాదు. రణ్‌బీర్ గొప్పగా నటించారు. సినిమా చూసినప్పుడు అతని నిబద్ధత కనిపిస్తుంద'ని అన్నారు. రెండు భాగాలుగా విడుదల అవనున్న ఈ సినిమా మొదటి భాగం దీపావళికి థియేటర్లలోకి రానుంది.

PRINTED AND PUBLISHED by VASISTA PRINTERS 18-97, 306, 3RD FLOOR, RAJINIGANDHA COMPLEX, KAMALA NAGAR, CHAITANYAPURI, SAROORNAGAR, RANGAREDDY, TELANGANA - 500060, RNI No :TGTEL/25/A4284 EDITOR KOMMU SRINIVAS, Contact - 9666023180 & 8096660656